# అతడు
# అడవిని జయించాడు

డా.కేశవరెడ్డి



వెల : రూ. 40/-

మూలం : ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 1984

ప్రథమ ముద్రణ : నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1985

HBT ముద్రణ : ఫిబ్రవరి, 2009

ముఖచిత్రం : కాళ్ళ

ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
హైదరాబాద్-28, ఫోన్: 3521849

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126, శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్: 23391364, 23304194

# అధోమానవుడు అధిమానవుడైన వేళ

"The novelist is neither a historian nor prophet;
he is an explorer of existence"

- Milan Kundera.

1984 లో ప్రచురితమై పాతికేళ్ళపాటు తన అస్తిత్వవాద నిసర్గ సౌందర్యంతో పాఠకులను అలరించిన కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు' నవలిక నిస్సందేహంగా తెలుగుసాహిత్యంలో విశిష్టరచన. లేశమాత్రమైన కథాంశతో, అనామకుడు, అపరిచితుడూ - ఐన నాయకుడితో, అద్భుతమూ, అపూర్వమూ - ఐన అరణ్య నేపథ్యంతో తన రచనను - ఒక పురాగాథ స్థాయికి తీసుకెళ్లారు - కేశవరెడ్డి. కేశవరెడ్డి రచనల్లో సైతం - యిది ఒక ప్రత్యేక విశిష్ట రచన. తెలుగు నవలల్లో - అపూర్వం, అనితర సాధ్యం. కనీసం యింకో పాతికసంవత్సరాలు, ఈ నవల తెలుగు సాహిత్యంలో దీపస్తంభంలా నిబ్బలంగా నిలబడి దిక్దర్శనం చేయించడంతో పాటు శిష్టనాగరిక సమాజపు కళ్లు మిరుమిట్లు గొలుపుతుందని నిస్సంకోచంగా నమ్మవచ్చు.

★ ★ ★ ★ ★

'అతడు అడవిని జయించాడు'లో కథాసమయాన్ని రచయిత ఒకానొక సూర్యాస్తమయాన మొదలెట్టి సూర్యోదయానికల్లా ముగిస్తాడు. ఈ అస్తమయ ఉదయాల మధ్య పందుల్నిసాకే ఓ అనామక ముసలివాడి బహిరంతర అన్వేషణ, అడవిలో చిక్కులు చిక్కులుగా ముళ్ళుపడి, మానవ జీవితంలోని అస్తిత్వ సంఘర్షణగా సామాన్యీకరించబడి తీగలు తీగలై నిర్నిరోధంగా సాగుతుంది. గుప్పెడు గంటల వ్యవధిలోనే కొన్ని కఠోరమరణాలు, యింకొన్ని అధివాస్తవిక జననాలు, సంక్లిష్ట సందేహాలు, గుబులుగొల్పే సందిగ్ధాలు, వెయ్యివెయ్యిగా తలలెత్తే ప్రశ్నలు, భీతి కలిగించే హింస, విశ్వం మొత్తాన్ని గుండెల్లో పొదువుకునే అవ్యాజ ప్రేమభావం,

అమాయిక వాత్సల్యాలు, విశృంఖలత్వం, విహ్వలత్వం, వైవిధ్యం, మోహం, గూఢత్వం, మార్మికత్వం, నిష్ఫలత్వం, నిరర్థకత, పాశవికత, నిస్పృహ, నిరీహ – ముసలివాడి అనుభవంలోకి నిరంతర ప్రవాహంగా ముప్పిరిగొని, అతణ్ణి నివ్వెర పరుస్తాయి. అతని అంతరంగం, 'ఎక్కడో మొదలయ్యి ఎక్కడో అంతమయ్యే' అరణ్యంగా, సిద్ధపరచిన యుద్ధ రంగంగా సాక్షాత్కరిస్తుంది. మొత్తం కథతాలూకు అనుభవంలో – అన్వేషణ ఒక్కటే వాస్తవం, సంఘర్షణ ఒక్కటే ప్రత్యక్షం. జీవితం తాలుకు సంక్లిష్ట ప్రశ్నలకు తేలికపాటి పనికిమాలిన చచ్చు సమాధానాల నిచ్చి భ్రమలు గొలిపే దుస్సాహసం చేయదీ నవలిక. జీవితంలో ఉక్కిరి బిక్కిరిగా అల్లుకున్న కఠోరవైరుధ్యాలను, అధివాస్తవికంగా– నిర్మమంగా – కర్కశంగా – ధైర్యంగా ఆవిష్కరింపజేస్తూ, పాఠకలోకం ముందు బహుముఖీన మానవ అస్తిత్వాన్ని శక్తిమంతంగా ప్రతిష్ఠించడమే దీని ప్రత్యేకత, విశిష్టత.

★ ★ ★ ★ ★

'అతడు అడవిని జయించాడు' లోని కథ అతిస్వల్పం. ఇది, పందులు మేపుకునే ఒక ముసలివాడి కథ. పౌర్ణమికి ముందు, ఒకానొక వేసవికాలపు సాయంత్రం జ్వరపీడితుడైన ముసలివాడు తనకు ప్రీతిపాత్రమైన సుక్కపంది, అడవిలో మేతకని వెళ్ళి తిరిగి రాకపోవడాన్ని గమనిస్తాడు. నెలలు నిండి ప్రసవసమయం దగ్గరపడిన సుక్కపందిని వెదికి పట్టుకుని సురక్షితంగా గుడిసెకు తోలుకు రావడమే అతని ప్రస్తుత కర్తవ్యం. మొదట – సుక్కపంది కోసం అడవిలో అన్వేషణ; ఆచూకీ దొరికిన తర్వాత – దాని సంరక్షణ. ఈ అన్వేషణ, సంరక్షణ బాధ్యతల నడుమ, ఆ వెన్నెల రాత్రి, అడవిలో ముసలివాణ్ణి ముప్పిరిగొన్న క్షణక్షణ గాఢానుభవ పరంపరే గగుర్పొడిచే సన్నివేశాలుగా రూపుకట్టి నవలను ముందుకు నడిపిస్తుంది.

వయోభారంతో వంగి, పురాతన శిలలా పడివున్న ముసలివాడు సంకల్పదీక్షతో ఉదాటున కర్తవ్యచోదితుడై జీవచైతన్యంతో యవ్వనంలోకి ఉలిక్కిపడి ఉబకలెత్తుతున్న సింధువులా యుద్ధానికి సిద్ధమవడంతో అసలు కథ ఆరంభమవుతుంది.



పురాగాథల్లో తారసిల్లే నేర్పరి విలుకాడికి, పక్షికన్నే సర్వత్రా కనిపించినట్టు, కర్తవ్యమోహితుడైన ముసలివాడికి, అదృశ్యమైపోయిన సుక్కపంది పరిపరివిధాల ప్రత్యక్షమై తనను వెదికేందుకు 'రారమ్మని' గుబులుగొల్పుతుంది. ఆ నిర్నిద్ర ఆహ్వానానికి, అస్వస్థతతో నిత్యకృత్యాలు క్రమం తప్పి, మూలపడివున్న ముసలివాడికి ఒకసారిగా 'మెలకువ' వచ్చింది. గోచెను బిగించి, అతడు లేచినిల్చున్నాడు. ఆరాటం క్షణక్షణానికి అధికమయింది. ఇప్పటిదాకా వివశుణ్ణిచేసి బద్ధకంలో ముంచివుంచిన జ్వరం, ఒక్కమారుగా అతని దేహాన్ని, మానుషాన్ని జాజ్వల్యమానం చేసింది. ఒక పెను యుద్ధానికి సిద్ధం చేసింది. ముసలివాడు తలపాగా బిగించి కట్టుకున్నాడు. కత్తిని తీసి బొడ్లో దోపుకున్నాడు. చూరులో ఉన్న ఈటెను తీసి చేతబట్టుకున్నాడు. సర్వవిధాల సన్నద్ధుడయాడు. వేనవేల యేళ్లనాటి పురాతన గుహల కుడ్యచిత్రాల్లోని ఆదిమానవుడు హఠాత్తుగా మేలుకుని వేటకు బయల్దేరాడా– అన్నట్టున్నాడు ముసలివాడు.

గుడిసెను వదిలి... పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, చేతిలోని ఈటెను ఊపుకుంటూ వస్తున్న ముసలివాడు, అస్తమిస్తున్న సూర్యునిపైన దండెత్తిన వానివలె అగుపిస్తున్నాడని అంటాడు రచయిత. ముసలివాడు ముసలితనమనే నివురును నిట్టనిలువుగా చీల్చుకుంటూ కణకణమండే నిప్పుకణంగా పరిణామం చెంది ఒక అపూర్వ సాహస యాత్రకు ఉద్యుక్తుడయాడు. సరిగ్గా నాలుగురోజుల క్రితం మొదటి సుక్కపంది సలుగులను ఈనిన వార్త విన్నప్పుడు – మొదటిసారిగా ముసలివాడి రూప పరిణామం తాలుకు ప్రథమ సంకేతం పొడసూపింది. సుక్కపంది ఈనిన సంబరంలో ముసలివాడూ, అతన్ని దగ్గర కనిపెట్టుకుని వుండే పిల్లవాడూ యిద్దరూ ఈలలేస్తూ దొడ్డిచుట్టూ తిరిగారు. దుత్తలతో కల్లు తెచ్చుకుని తాగారు. సర్వస్వం మరచిపోయి, 'ముసలివాడు పిల్లవాడై, పిల్లవాడు ముసలివాడై, దొర్లారు. నాలుగు రోజుల క్రితం పొటమరించిన ఆ పరిణామం క్రమక్రమంగా – రెండో సుక్కపంది కనిపించకుండా పోయిన ఈనాటి సూర్యాస్తమయానికి, యింతింతై ఎదిగి, ముసలివాణ్ణి సంపూర్ణంగా – సాహసబాలుడిగా రూపాంతరం చెందించింది.

సూర్యాస్తమయవేళ, సుక్కపందికోసం కీకారణ్యంలో ప్రారంభమైన ముసలివాడి (ఇప్పుడతడు - పట్టువదలని విక్రమార్కుడు, సూటి లక్ష్యంతో ముందుకురుకుతున్న సాహసబాలుడు) అన్వేషణను కేశవరెడ్డి - అతిలాఘవంగా, కోలాహలంగా, ఉద్విగ్నంగా, సంక్లిష్టంగా, నిరంకుశంగా, అద్భుతరసప్లావితంగా, ప్రవాహ వేగంతో ఒక అపూర్వ అపరాధ పరిశోధక కథమాదిరి, అత్యంతప్రతిభావంతంగా నిర్వహించారు. ఈ అన్వేషణ నవలికలో రమారమి అర్ధభాగం సాగుతుంది. సూర్యాస్తమయం నుండి అర్ధరాత్రి వరకూ సాగిన అన్వేషణ తరవాతనే - ముసలివాడు సుక్కపంది ఆచూకీని కనిపెట్టగలుగుతాడు.

సుక్కపందికోసం వెదుకుతున్నంతసేపూ, ముసలివాడు తన ఆత్మకథా వృత్తాంతాలతో అడవి అంతరంగాన్ని వెయ్యివిధాల ఆవిష్కరిస్తాడు. వెన్నెల్లో మనోహరంగా తడుస్తున్న మహావృక్షాలతో; ముంగిస, తోటిగువ్వ, సుక్కపంది, గుంటనక్క, కోతి, ఎలుగుబంటి, చంద్రుడు, నక్షత్రాలతో ముఖాముఖీ మాట్లాడుతాడు, వాదిస్తాడు, పోట్లాడుతాడు. ఆకలి బాధకు తాళలేక అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు తాను వేటాడి చంపిన కుందేలుతో సైతం ఒక విచిత్ర తాత్వికతతో సంభాషిస్తాడు. కొన్ని గంటలపాటు ముసలివాడు అడవిలో చేసిన వెతుకులాటనిండా ఒక interrogative meditation, ఒక meditative interrogation కనిపిస్తాయి. 'నిద్రలో కనిపించే కలలవలె' వున్న అడవి దారుల గుండా నడుస్తూ - 'అడవి మహా విచిత్రమయింది. దాని రహస్యాలు బహుశా దానికే తెలీవేమో' అంటూ అబ్బుర పడతాడు. 'అద్భుతాలకు ఆలవాలమైన ఈ అడవిలో, తామసానికి ఆటపట్టయిన ఈ అడవిలో, ప్రాణమెదిగినంతగా మనసు ఎదగని ఈ అడవిలో సుక్కపందికి ఏ ముప్పువాటిల్లిందో' అని ఆందోళన చెందుతాడు. 'సూదికి దారాన్నెక్కిస్తున్నవాని ముఖంతోనూ సగం బయటికొచ్చిన పెయ్యదూడను గర్భం నుండి లాగుతున్న జంతువైద్యుని ముఖంలోనూ వుండే ఏకాగ్రత తోనూ ముసలివాడు - ఇసుకమీది పలురకాల జంతువుల అడుగులను పరికిస్తూపోతాడు. పరికిస్తూ, పరికిస్తూ, 'ఈ అడుగులు తప్పకుండా సుక్కపందివేనని నా నమ్మకం' అని



పలవరిస్తాడు. ఇంతలోనే, 'నేను భ్రమిస్తున్నానేమో! అయిష్టమైన సంభవం భ్రాంతిగానూ, ప్రీతిపాత్రమైన భ్రాంతి సంభవంగానూ మానవుడికి తోచడం కద్దు" అంటూ వేదాంత ధోరణిలో పడతాడు.

ఇలా క్షణక్షణికంగా, అనుక్షణికంగా, నిరంతరజీవజ్వరంతో జ్వలిస్తూ, ఒక జిజ్ఞాసువయిన తోటి గువ్వ సాయంతో, 'సుక్కపంది ఈశాన్యపు దిక్కున ఎక్కడో సలుగులను ఈనేసింది' అన్న నిర్ధారణకు వస్తాడు. క్షణమాలస్యం చేయకుండా ఈశాన్య దిక్కుగా నడుస్తూ 'కళ్ళను చెవులుగా మార్చుకుని, చెవులను కళ్ళుగా మార్చుకుని' వెదుకులాట కొనసాగిస్తాడు.

చివరికి ముసలివాడి అన్వేషణ ఫలిస్తుంది. అయితే, సంరక్షించాలన్న ఏకైక సంకల్పంతో అడవికొచ్చిన ముసలివాణ్ణే సుక్కపంది తీవ్రంగా గాయపరచి చంపబోవడం యిక్కడ ఒక విచిత్రమైన వైరుధ్యం. ఒకింత చిత్రహింస భరించిన తర్వాత సుక్కపంది కోరలనుంచి ముసలివాడు, 'తల్లి గర్భం నుండి వెలికి వచ్చినంత మార్మికంగా' తప్పించుకోగలగడం ఒక అద్భుతం. 'ఇంతటి చిత్రహింస నేను ఎప్పుడూ ఎవరిచేతా అనుభవించలేదు' అని అనుకుంటూనే, 'మరి ఇంతటి ప్రేమ నేను ఎప్పుడూ ఎవరిమీదా చూపలేదు. అని పలవరించడం మరో చిత్రమైన వైరుధ్యం.

ఈ అన్వేషణలో ఎట్టకేలకు, సుక్కపందితోపాటు, అది ఈనిన పది సలుగుల్ని కనిపెట్టాడు ముసలివాడు. ఆనందపారవశ్యంతో తత్తరపడుతూ ఉబ్బి తబ్బిబ్బయినాడు. 'ఈ పూట అనుభవిస్తున్న పరవశతను అతనికి ఏ పదార్థంగాని, ఎన్నడుగాని కలిగించలేదు'. ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఉద్విగ్నమానసంతో సుంక్రేసు కొమ్మలగుండా ముసలివాడు చంద్రణ్ణిచూస్తూ "నువ్వేమీ బయటకు రానక్కరలేదు. ఇక్కడ తీంట్ర పొదలో పది చందమామలున్నాయి. నువు బయటికొస్తే ఎంత, రాకపోతే ఎంత' అని ఎద్దేవాగా అనుకున్నాడు. అప్పటికి సరిగ్గా సగం రాత్రవుతుంది.

★ ★ ★ ★ ★

అర్ధరాత్రి నుంచే కథ రెండోభాగం మొదలవుతుంది. అప్పటి దాకా అడవి తాలూకు సౌందర్యం, రామణీయకత - ఆనంద, అద్భుత రసప్లావితమై నవలిక నిలువెల్లా సాక్షాత్కరిస్తాయి. అర్ధరాత్రి సుక్కపంది ఆచూకీ దొరికినదే తడవుగా, దాని సంరక్షణే ముసలివాడి ముందు పెను సవాలై కూర్చుంటుంది. తన మిత్రులెవరో, శ్రేయోభిలాషులెవరో తెలుసుకోలేని మొరటుజీవాన్ని కంటికి రెప్పలా కాపాడబూనడం నిజంగా ముసలివాడి పాలిట పెనుసవాలే. తోడేళ్లు, గుంటనక్కల రూపంలో మృత్యువు వికటాట్టహాసం చేస్తుంది. ప్రపంచంలోని నైచ్యమంతా అడవికి దిగివచ్చి ముసలివాడికి ముచ్చెమటలు పట్టిస్తుంది. ప్రకృతి క్షణక్షణం - వికృతరూపం దాల్చుతూ వెంటాడి వెంటాడి అతడ్ని కర్తవ్యవిమూఢుణ్ణి చేస్తుంది. కథ ముదిరి చేదెక్కి, బీభత్స రసప్రధానంగా సాగి, ఒక మహా విషాదంగా ముగుస్తుంది.

ప్రమాదాలు ఒక మహాప్రవాహం మాదిరి ప్రచండవేగంతో ముసలివాణ్ణీ, సుక్కపందినీ చుట్టుముట్టగా, అంతటి కర్తవ్యదీక్షలోనూ ముసలివాడు విషాదం వెంట విషాదాన్ని తన చేజేతులారా ఆవిష్కరించవలసి రావడం అతడి జీవితంలోని దుర్భరమైన వైరుధ్యం. మిత్రునిగా దిశానిర్దేశం చేసి, సుక్కపంది ఆచూకీని తెలిపి పుణ్యం కట్టుకున్న శ్రేయోభిలాషి తోటిగువ్వనే తన కత్తికి బలి చేయవలసిన అగత్యం - ముసలివాడి పాలిట మరో పెనువిషాదం. గుంటనక్కలమూక నిర్వహించబోయే మహా నైచ్య కార్యాన్ని తప్పించడానికి, ఎవరి రక్షణార్థం తానీ కాళరాత్రి పూట కీకారణ్యంలోకి ప్రవేశించాడో, ఆ సుక్కపందినే ఈటెతో సంహరించవలసి రావడం దుస్సహమైన మహావిషాదం.

సంఘటన వెంట సంఘటన, ప్రమాదం వెంట ప్రమాదం ముంచుకొచ్చి, ప్రకృతిలోని సర్వశక్తులూ పగబట్టినట్టు ముసలివాడిని ఏకాకిని చేసి దొంగ దెబ్బతీయడం రోమాంచికమైన అధివాస్తవిక విషాదం. ఆ వికృత రాత్రి వికటాట్టహాసానికి విహ్వలుడై, శక్తులుడిగి, సూర్యోదయవేళ అపజయాన్ని మోసుకుని యింటికి తిరిగివచ్చిన ముసలివాడు శిలాసదృశంగా జడప్రాయుడై నిద్రలోకి జారుకోవడంతో కథ ముగుస్తుంది.

★ ★ ★ ★ ★



కథ నిర్మాణంలో కేశవరెడ్డి గొప్ప చాతుర్యాన్ని ప్రదర్శించారు. మానవుడి అస్తిత్వసంఘర్షణను బలంగా ప్రకటించేందుకు, జీవితంలోని సంక్లిష్ట వైరుధ్యాలను, Interplay of dichotomies, ద్వైతభావాల్ని ఎన్నుకున్నారు. సూర్యాస్తమయం నుంచి మొదలై సూర్యోదయం వరకు సాగే కథావృత్తంలోకి, చిన్న చిన్న వృత్తాలూ, ఉపకథలూ వచ్చి చేరి కథ విస్తృతి సుసంపన్నమయింది. ముసలివాడు నిద్రలోంచి మెలకువలోకి పడ్డంతో మొదలైన కథనం, మళ్లీ మెలకువలోంచి నిద్రలోకి జారుకోవడంతో ముగుస్తుంది. వృద్ధాప్యం - బాల్యం, జంతువు - మనిషి, ప్రకృతి-సంస్కృతి, నాగరికం-ఆటవికం, మృత్యువు-జననం, సౌందర్యం-నైచ్యం, వాత్యల్యం-క్రౌర్యం, అస్వస్థత-ఉత్సాహం, జడత్వం-చైతన్యం, మౌనం-శబ్దం, విజయం-అపజయం, జిగీష-నిరీహ, వెలుగు-చీకటి మొదలైన జంట వైరుధ్యాలు, ద్విదీభావాలు - మనిషి జీవితం తాలూకు సంక్లిష్ట మార్మికతను ఆవిష్కరిస్తాయి.

ఈ మొత్తం సంక్లిష్ట సంక్షుభిత మానవ అస్తిత్వ చిత్రాన్ని నిరాడంబరమైన minimalist art తో నిసర్గంగా నిర్వహించడం కథారచయితగా కేశవరెడ్డి మరో విజయం. నవలలోని కథ - రేఖామాత్రం — పాత్రలకున్నవన్నీ ప్రాథమిక (elementary) ఉద్వేగాలు. ఉన్న పాత్రలు కూడా బహు స్వల్పం.

అందులో, ప్రధానమానవపాత్ర ఒకే ఒక్కటి. ఆ పాత్ర - వేషం, భాష - అంతా నిరలంకారం. నవల నిడివి బహుతక్కువ. సన్నివేశాలు స్వల్పం. ప్రధానపాత్ర ముసలివాడి నిత్యజీవితం - సరళాతి సరళం. అతని ఆస్తి స్వల్పం - అతని ఆయుధాలు రెండే - కత్తి, ఈటె. అతని అవసరాలూ తక్కువే. అతనికున్న ఒకేఒక్క తోడు - పందుల్నిగాచే పిల్లవాడు. ఇంతటి అల్పమైన సంబారాలతో, అస్తిత్వ సంఘర్షణలోని అనల్పార్థాన్ని సాధించగలగడం ముసలివాడి విజయానికి పరాకాష్ట.

కథలో - అడవి నేపథ్యాన్ని ఎన్నుకొని ప్రతిభావంతంగా నిర్వహించడం కేశవరెడ్డి చేసిన గొప్ప సాహసం. తెలుగు పాఠకులకు

పూర్తిగా అపరిచితమైన అడవి నేపథ్యాన్ని వందలాది వృక్షజంతు జాతులతో నింపి, అడవిని రమణీయంగా, క్రూరంగా, వైవిధ్యభరితంగా, ఆర్ద్రతతో, ఉత్కంఠతో, ఉద్విగ్నంగా ప్రతిష్టించడం కేశవరెడ్డి masterstroke.

కథలో అధినాయకుడిగా, ఒక Subaltern, subhuman, అనామక, అపరిచిత వ్యక్తిని, అందునా పురాతన శిలవంటి ముసలివాణ్ణి ఎన్నుకోవడం - రచయితగా కేశవరెడ్డి చేసిన ఒక గొప్ప feat ముసలివాడు నాగరిక సమాజానికి దూరం. శిష్ట జన సమూహాలకు బాహ్యుడు. అందువల్లనే భేతాళకథలాంటి ఈ అస్తిత్వవాద నవలకు పట్టువదలని విక్రమార్కుడులాంటి అధినాయకుడిగా - ముసలివాడు సరిగ్గా సరిపోయాడు. సంకల్పదీక్షతో, కర్తవ్య చోదితుడై కాళరాత్రి కీకారణ్యమధ్యంలో జీవితపు చీకటిశక్తులతో ద్వంద్వయుద్ధం చేసి, ఉదయానికి - కఠినప్రశ్నల్ని, కఠోరవాస్తవాల్ని, ఎంత ప్రయత్నించినా బద్దలుకాని జీవితమార్మికతను మోసుకుని గుడిసెకు తిరిగివచ్చే సైనికుడు- ముసలివాడు.

యుద్ధంలో జయాపజయాలమాట ఎలావున్నా యుద్ధం మిగిలే వుంది. అన్వేషణ - వాస్తవం, సంఘర్షణ ప్రత్యక్షం. అస్తిత్వాన్ని రుజువు చేసుకునేందుకు యుద్ధం - అనివార్యం. యుద్ధం - వాస్తవం. యుద్ధానికి వాడే ఆయుధాలు వాస్తవం. ముసలివాడు తిరిగివచ్చిన తరవాత, వాకిటి వద్దనే కత్తిని, ఈటెను జారవిడుస్తాడు. పిల్లవాడు నిద్రమేల్కొన్న మరుక్షణం గమనించేది వాకిలి వద్దనున్న కత్తి, ఈటెలనే. యుద్ధం వాస్తవం అయినప్పుడు ఆయుధాలూ వాస్తవమే. రాత్రి గడిచిపోయినా యుద్ధం మిగిలేవుంది. ముసలివాడు మరుగున పడినా, ఆయుధాలు మిగిలేవున్నాయి - పిల్లవాడూ మిగిలేవున్నాడు.

ఒక అధోమానవుణ్ణి అధిమానవుడిని చేసి - ఈ ఉత్కృష్ట కథకు అధినాయకుణ్ణి చేయడంలోనే వుంది కేశవరెడ్డి అసలైన విజయం.

**- శ్రీనివాస ప్రసాద్**

06-02-2009



డా॥ **కేశవరెడ్డి** చిత్తూరు జిల్లాలోని తలుపులపల్లిలో 1946 మార్చి 10న పుట్టారు. తిరుపతిలో పి.యు.సి., పాండిచ్చేరిలో ఎం.బి.బి.ఎస్. చేశాక నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి విక్టోరియా మెమోరియల్ ఆసుపత్రిలో స్కిన్ స్పెషలిస్ట్‌గా కుష్ఠు రోగులకు సేవలందించారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటూ ఆర్మూరులో వైద్య సేవలు అందిస్తున్నారు. కుష్ఠువ్యాధిపై వీరు రాసిన పరిశోధనా పత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

పాతిక సంవత్సరాలుగా పీడితజన పక్షపాతంతో, దళితుల సమస్యలపట్ల సానుతాపంతో రాయలసీమ గ్రామీణ జీవిత సంఘర్షణే ఇతివృత్తంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. **బానిసలు, భగవాను వాచ, ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం దున్నేరు, అతడు అడవిని జయించాడు, రాముడుండాడు రాజ్జిముండాది, మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె, సిటీ బ్యూటిఫుల్** వీరి ఇతర రచనలు. **అతడు అడవిని జయించాడు** నవలను నేషనల్ బుక్ ట్రస్ట్ వారు 14 భారతీయ భాషల్లోకి అనువదించారు. **ఇన్‌క్రెడిబుల్ గాడెస్** నవల మరాఠీలోకి అనువాదమైంది.

తన రచనా స్పర్శతో బాధల గాయాలు స్పృశించి, హృదయాలను తేలికపరచటం, అనివార్యమైన జీవిత పోరాటానికి ఉపక్రమింపజేయటమే తన లక్ష్యమని వినమ్రంగా చెప్పే వీరిది వర్ణాంతర, మతాంతర వివాహం. కొడుకూ, కూతురూ సంతానం.

ముసలివాడు పురాతనమైన శిలవలె పడుకుని ఉన్నాడు. సాయంకాలపు ఎండ తెరచి ఉన్న తలుపుగుండా వచ్చి అతని పాదాల మీద పడుతున్నది. అతని పాదాలు చాటల వలె విశాలంగాను, బండలవలె మొరటుగాను ఉన్నాయి. అతడు మోచేతిని తలగడగా జేసుకుని నిద్రిస్తున్నాడు. సూర్యుడస్తమించనున్న ఈ వేళ గాని వేళలో అతడు నిద్రించడం చాలా అరుదు.

కాని ఈ దినం తెల్లవారి నిద్ర లేచింది మొదలు అతనికి శరీరంలో నలతగా ఉంది. సన్నగా జ్వరం కాస్తుంది. కీళ్ళన్నీ పోట్లు పెడుతున్నాయి. ఆ కారణంగా అతడు దినమంతా ఇంటిపట్టునే ఉన్నాడు. వేళగాని వేళలో భోంజేస్తున్నాడు. వేళగాని వేళలో నిద్రిస్తున్నాడు. పాపం, ముసలితనంతో బాటు అస్వస్థత తోడురాగా అతని నిత్యకృత్యాలు క్రమం తప్పాయి.

అతడు నిద్రిస్తున్న గుడిసె బయట పందుల దొడ్లు రెండున్నాయి. ఒక దొడ్లో సుక్క పంది తనపిల్లలను పక్కన వేసుకుని పడుకుని ఉంది. అది తన నాలుగు కాళ్ళను బార్ల జాపుకుని, మోరను నేలపైన పడవేసుకుని అరమోడ్పు కన్నులతో ఆనందాతిశయాన్ని అనుభవిస్తూ ఉంది. పిల్లలు తల్లి రొమ్ములను కుమ్ముతూ పాలు తాగుతున్నాయి. పిల్లలు మరీ మోటుగా కుమ్మినప్పుడు తల్లి పంది మెత్తగా హాయిగా మూలుగుతున్నది. పన్నెండు సలుగులకు తానిప్పుడు తల్లిననే గర్వము సంతోషము, తృప్తి దాని అరమోడ్పు కన్నుల్లో కనిపిస్తున్నది.

రెండవ దొడ్డి ఖాళీగా ఉంది. అందులో ఉన్న పందుల్ని ముసలివాని మనుమడు మేతకై తోలుకొనిపోయి ఉన్నాడు. ఈ పూట తాను అస్వస్థతగా ఉన్నందు వల్ల ముసలివాడు పందులను మేపుకునివచ్చే బాధ్యతను తన మనుమనికి అప్పగించాడు.

ముసలివానికి మెలకువ వచ్చింది. ముడుచుకుని ఉండిన కాళ్ళను, చేతులను, మెడను చాచాడు. అతని కదలిక కొండ చిలువ చుట్టగా చుట్టుకుని ఉండి ఎక్కడికో బయలుదేరుతున్నట్లున్నది. గోచెను

బిగించి కట్టుకుంటూ అతడు లేచి నిల్చున్నాడు. లేస్తున్నప్పుడు అరచేతులు మొదట నేలపైనను ఆ తరవాత మోకాళ్ళపైన ఆనుకుని లేచాడు. అతడలా లేస్తుండగా అతని మోకాళ్ళు, నడుము, వెన్నుపూసలు పటపటమని చప్పుడు చేశాయి.

అతను ఆజానుబాహుడు. ఒకప్పుడు కండలు తిరిగి ఉండిన దేహం, ఇప్పుడు వయోభారంతో సడలి ఉంది. అతడు నిటారుగా నిల్చుని ఉన్నప్పటికీ అతని మోకాళ్ళు, నడుము ఇంచుక వంగి ఉన్నాయి.

అతడు రెండడుగులు వేసి గుడిసె బయటికొచ్చి నిలుచున్నాడు. దొడ్డిలోని పంది అతన్ని చూసి "గుర్ గుర్" మన్నది. దాని పిల్లలు కీచు, కీచుమని శబ్దం చేసుకుంటూ పాలు తాగుతున్నాయి.

మేతకై వెళ్ళిన పందులు తిరిగి రాకపోవడం ముసలివాడు గమనించాడు. సూర్యుడు పడమటి కొండను తాకుతున్నాడు. "పందులు ఇంకా తిరిగి రాకపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది." అనుకున్నాడు ముసలివాడు. కారణమేమై ఉండవచ్చునని అతడు ఆలోచించసాగాడు. పందుల్ని గురించిన భయ సందేహాలు అతని మానసంలో పొగవలె రేగుతున్నాయి. అతని ఊహలు అంతకంతకు అధికమై అతనిలో అలజడిని కలుగజేస్తున్నాయి. పందులే అతని సర్వస్వం. పందులే అతని స్థిర చరాస్తులు.

అతని మనసంతా కలగాపులగంగా ఉంది. "పొద్దుగూటిలో పడింది. ఇక కొద్దిసేపట్లో చీకటి పడుతుంది. కాని పందులింకా తిరిగి రాలేదు" అని ఆలోచిస్తూ అతడు ఆందోళన చెందసాగాడు.

భయసందేహాలతో బరువెక్కిన మనసుతోను, నిద్రతో బరువెక్కిన దేహంతోను అతడు పెరడువైపు నడిచాడు. పెరట్లో ఒక గారతొట్టి ఉన్నది. దాన్లో సగానికి నీళ్ళున్నాయి. నీటి అడుగు నుండి పెరిగిన పచ్చటి పాచి నీటి మట్టంపైన తేలియాడుతూ ఉంది.

నీటిమట్టం పైన కూర్చుని ఉన్న కప్ప ముసలివాని రాకతో బుడుంగున మునిగి పాచిలో మాయమైపోయింది. ముసలివాడు



తొట్టిలోని నీటిని ముఖం మీద, మెడమీద, గొంతుమీద చల్లుకోసాగాడు.

అతడు అరుదుగా స్నానం చేస్తుంటాడు. అతనికి స్నానంపైన ఒకింత చిన్నచూపు కద్దు. పరిశుభ్రతను గురించి ఖాతరు లేదు. అతని గురి, నమ్మిక అంతా దృఢత్వం మీదనే. ఈ లోకంలో కొందరు దినానికి రెండుసార్లు స్నానం చేస్తుంటారనే సత్యాన్ని అతడు కలిమాయలోని ఒక అంశంగా భావిస్తాడు.

అతడు నోట్లో నీళ్ళు పోసుకుని పుక్కిలించి ఉమిసి, నడుమెత్తి నిలుచున్నాడు. నీళ్ళు చారలు చారలుగా అతని రొమ్ముమీదుగ, వీపు మీదుగా జారుతున్నాయి. రోజు పొడవునా వేడిగాడ్పులతో కమిలిన దేహం మీద చల్లని నీళ్ళు జారుతూ ఉంటే చాలా హాయనిపించింది. అతడా నీటిని తుడుచుకోలేదు.

అతన్ని ఆవరించి ఉండిన మైకం నీటి తాకిడితో కొంత సడలింది. అరచేతులకున్న తేమను తొడలకు తుడుచుకుంటూ అతడు మళ్ళీ గుడిసె ముందు కొచ్చాడు. పడమటి కొండను తాకిన సూర్యుడు తన కిరణాలను ఏటవాలుగా ప్రసరిస్తున్నాడు. ఆ కిరణాలకు అడ్డంగా అరచేతిని పెట్టుకుని ముసలివాడు మట్టి బాట మీదకు దృష్టి సారించాడు. మట్టిబాట వేరుసెనగ చేల మధ్యగా పోతూ ఉంది. మట్టిబాట మీద మనుష్య సంచారంగాని, జంతు సంచారం గాని కానరాలేదు. పందులు ఏమైనట్టు? పిల్లవాడు ఏమైనట్టు? అని ఆలోచిస్తూ అతడు ఆందోళన చెందుతున్నాడు. దవడలను చప్పరిస్తున్నాడు. అరచేతులను పిసుక్కుంటున్నాడు. పాదాలొక చోట నిలవడం లేదు. చూపులు, మనసు పలుదిక్కులకు చెదిరిపోతున్నాయి.

"పిల్లవానికి అతీతమైన ఆపదల్లో పందులు చిక్కున్నాయేమో! లేక పిల్లవాడే ఆపదల్లో చిక్కుకున్నాడేమో" అని ముసలివాడు అనుకున్నాడు. "నేను బయలుదేరి వెళ్ళి చూడటం మంచిది" అని అతడు నిశ్చయించుకున్నాడు. కాని ఎక్కడికని వెళ్ళడం? ఏ దిక్కుగా వెళ్ళడం? అని మీమాంసకు అతడు క్షణకాలం లోనయ్యాడు.

అతనిలో ఆరాటం క్షణక్షణానికి అధికం కాసాగింది. "ఇక్కడ నుండి బయలుదేరితే మార్గం తనంతటదే గోచరిస్తుంది. కర్తవ్యం బోధపడుతుంది" అనుకుని అతడు గుడిసెలోకి నడిచాడు.

తలుపు మూసినా తెరిచినా గుడిసె లోపల కావలసినంత వెలుతురు ఉంటుంది. గుడిసె కప్పు సగానికి ఎగిరిపోయి ఉన్నది. గోడలు పగిలి అక్కడక్కడ నెరియలు చీలి ఉన్నాయి. ఆ నెరియల గుండా సూర్యకిరణాలు లోపలికి చొచ్చుకుని వస్తున్నాయి. తొండ ఒకటి నెరియలో కూర్చుని ముసలివాని పోకడలను చూస్తూ తల ఆడిస్తూంది. గోడకు కల్లు దుత్త వ్రేలాడుతూంది.

ముసలివాడు దుత్తనురెండు చేతులతో తీసుకుని పెదవుల కంటించుకున్నాడు. కల్లు నోటిలో కమ్మని రుచి కలిగిస్తూ గొంతు వెంబడి దిగి కడుపులో కుదురుకుంటున్నది. ఒక్కపెట్టున అతడు దుత్తను ఖాళీ చేసి గోడకు తగిలించాడు. పెదవులను తుడుచుకుని లొట్ట వేశాడు.

"నేనిప్పుడు పందులను వెతుక్కుంటూ పోతున్నాను. పందులేదైనా ఆపదలో చిక్కుకుని వుంటే వాటిని రక్షించాల్సి ఉంటుంది. అప్పుడు ధైర్యసాహసాలను, బలదర్పాలను ప్రదర్శించవలసి ఉంటుంది. ఇంకొక ముంతెడు కల్లు తాగ గలిగితే బాగుండును" అనుకున్నాడతను. ప్రస్తుతం తన గుడిసెలో అదనంగా కొంత కల్లు లేనందున అతడు ఇంచుక చింతించాడు.

అతడు ప్రయాణానికి సిద్ధమవుతున్నాడు. తలపాగాను బిగించి కట్టుకున్నాడు. కత్తిని తీసి బొడ్లో దోపుకున్నాడు. చూరులో ఉన్న ఈటెను తీసి చేతబట్టుకున్నాడు. "పందుల్ని, పిల్లవాడ్ని ఎలాంటి పరిస్థితిలో చూస్తానో తెలియదు. సాయుధుడనై వెళ్ళడం శ్రేయస్కరం." అనుకున్నాడతడు.

అతడు గుడిసెను వదలి మట్టిబాట మీదపడి పడమటి దిక్కుగా నడవసాగాడు. పెద్ద అంగలు వేసుకుంటూ, చేతిలోని ఈటెను ఊపుకుంటూ అస్తమిస్తున్న సూర్యునిపైన దండెత్తిన వానివలె అతడు నడుస్తున్నాడు. కడుపులో కల్లు వెచ్చనవుతున్నట్టు, పొంగుతున్నట్టు ముసలివానికి అనిపిస్తూ ఉంది.



# 2

సూర్యుడు పడమటి కొండ వెనక క్రుంకాడు. అది పౌర్ణమినాటి ముందు దినం. ఆకాశంలో చంద్రుడు అప్పటికే తాటిచెట్టు ప్రమాణం ఎగప్రాకి తన సోదరునికి వీడ్కోలు చెబుతున్నాడు.

ముసలివాడు నడుస్తుండగా అతని మోకాళ్ళు, నడుము వంగి ఉండడం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. అయినప్పటికీ అతని నడకలో గంభీరత నిండార్లుగా ఉంది. రాజవీధులలో మదగజంవలె, ఆకాశంలో కారు మేఘం వలె హుందాతనంతో అతడు సాగుతున్నాడు.

పడమటి కొండ వెనుక నుండి నిట్టనిలువుగ ప్రసరించి ఆకాశాన్ని పొడుస్తున్న సూర్యకిరణాలు క్రమక్రమంగా ముడుచు కుంటున్నాయి. అంతకంతకు గాలి చల్లబడుతూంది. తూర్పున చంద్రుడింకా కాంతిని పుంజుకోలేదు. చంద్రుడు కలగజేసిన నీడలు వయసురాని వాని మీసం వలె పల్చగా, అస్పష్టంగా ఉన్నాయి.

ముసలివాడు సుదీర్ఘంగా ఉన్న తన నీడను తొక్కుకుంటూ నడుస్తున్నాడు. అతని కన్నా వేగంగా, అతని నీడ కన్నా వేగంగా అతని మనసు పందుల క్షేమాన్ని గురించి ఆరాటపడుతూ పరుగిడుతూంది.

అతడు ఇరవై పందులకు స్వంతదారుడు. అందులో రెండు సుక్క పందులున్నాయి. మొదటి సుక్క పంది ప్రస్తుతం సలుగులను పక్కన వేసుకుని దొడ్డిలో ఉంది. అది సలుగులను నాలుగు రోజుల క్రితం ఈనింది. ఆ రోజు ముసలివాని జీవితంలో మధురాతి మధురమైంది. సుక్కపంది దొడ్డిలో సలుగుల నీనిన వార్త చెవిసోకగానే అతడు సంతోషంతో పరవశించి పోయాడు. క్రోసెడు దూరం నుండి పల్లటీలుగా వేసుకుంటూ దొడ్డి చెంతకు చేరాడు. మడిచిన మోకాళ్ళను చాచకుండా, వంచిన నడుమును పైకెత్తకుండా రెండు జాముల సేపు సంగిడతలు కొడుతూ దొడ్డి చుట్టూ తిరిగాడు. పిల్లవాడు కూడ అతనితోబాటు సంగిడతలు కొట్టడం ప్రారంభించాడు. కాని, వాని లేతకాళ్ళు కొద్ది సేపటికే అలసిపోయాయి. వాడు లేచి చేతి వేళ్ళను నోట్లో పెట్టుకుని ఈల వేస్తూ దొడ్డి చుట్టూ పరుగెత్తాడు. ఆ పూట

వాళ్ళు దుత్తలతో కల్లు తెచ్చుకుని చిత్తుగా తాగారు. పిల్లవాడు కల్లును హరాయించుకోలేక వాంతులు చేసుకోగా ముసలివాడు బొక్కెనతో నీళ్ళు వాని నెత్తిన గుమ్మరించి మరో కల్లు ముంతను చేతికిచ్చాడు. వాళ్ళు సర్వస్వం మరిచిపోయి ముసలివాడు పిల్లవాడై, పిల్లవాడు ముసలివాడై దొర్లారు. ఒకరు మార్చి ఒకరు ఏలకతలు పాడుతూ ఆ రాత్రంతా ఆ వీధిలోని వారినెవ్వర్నీ నిద్ర పోనీయకుండా గడిపారు.

తెల్లవారే సరికి ముసలివాని గొంతు రాచిపోయి మాటలాడడం దుస్సాధ్యమై పోయింది. చేతి సైగలతో ముఖకవళికలతో మంతనాలు జరపాల్సి వచ్చింది. వొంట్లోని కీళ్ళన్నీ పచ్చి పుళ్ళయిపోయాయి. నొప్పులను బాపుకునేందుకు అతడు నిప్పులలో కాలిన కళ్ళి కొమ్మలను తొక్కాడు. కీళ్ళకు చింతాకు పట్టు వేశాడు. సుక్కపంది సలుగుల్నీని మూడు రోజులైంది. సలుగులు పురిటితేమ ఆరి కళ్ళు తెరిచి తిరుగాడుతున్నాయి. ముసలివాడు మాత్రం ఇంకా స్వస్థత చెందలేదు. కీళ్ళవాపు తగ్గిందిగాని నొప్పులు తగ్గలేదు. గొంతు మండడం లేదు గాని మాటలు సరిగా వెలువడడం లేదు.

ముసలివాని రెండో సుక్కపంది నేడో రేపో సలుగుల నీనడానికి సిద్ధంగా ఉంది. దానిని పిల్లవాడు మిగిలిన పందులతో బాటు మేతకై తోలుకొనిపోయి ఉన్నాడు. "బహుశ మేతకై వెళ్ళిన తావున్నే అది సలుగులను ఈనిందేమో" అనే ఆలోచన ముసలివాని తలలో దిగ్గున మెదిలింది.

అసంకల్పితంగా అతడు బాట మీద ఆగిపోయాడు. ఆకాశంలో తూర్పువాలున ఉన్న చంద్రుడిని చూస్తూ అతడు ఆలోచించసాగాడు. అతని సుక్కపందులు రెండూ ఒకేసారి పలమయ్యాయి. ఎవరో చెప్పారో గాని సుక్కపందులు పలమై ఉన్న విషయం ఊర్లో ఉన్న గున్నలన్నింటికీ తెలిసిపోయింది. అవి మోరలను, తోకలను పైకెత్తుకుని "గీ" మని అరుస్తూ ఆ రెండు పందుల వెంట తిరగడం ప్రారంభించాయి. ఆ రెండింటినీ తొక్కడానికి పోటీ పడుతూ గున్నలు నిద్రాహారాలు మాని ప్రయత్నం చేశాయి. తన పందులను సుక్కగున్నలే తప్ప వేరొక నాసిజాతి గున్నలు తొక్కడం ముసలివానికి ఇష్టం లేదు.



అతడు బడితె చేతబట్టుకుని నాసి జాతి పందుల్ని ఆ పరిసరాల్లో మెదలనీయకుండా తరిమి కొట్టాడు. చివరకతని అభీష్టం నెరవేరింది. అతని రెండు పందులను సుక్కగున్నలే తొక్కాయి.

తన సుక్కపందులు రెండూ ఒకే రోజున సలుగుల నీనుతాయని అతడు ఆశించాడు. కాని అలా జరగలేదు. మొదటి పంది పౌర్ణమి ఇంకా నాలుగు రోజులుందనగా ఈనింది. రెండో పంది నేడో రేపో ఈనడానికి సిద్ధంగా ఉంది.

"సందేహం లేదు. మేతకు వెళ్ళిన తావున్నే అది ఈనేసింది. ఏమి చేయాలో తెలియక పిల్లవాడికి కాళ్ళు చేతుల ఆడి ఉండవు. అందుకే ఆలస్యమయింది." అనుకున్నాడు ముసలివాడు.

అతడు మళ్ళీ నడక ప్రారంభించాడు. "నెలలు నిండిన ఈ స్థితిలో సుక్కపందిని బయటకు వదలవలసింది కాదు. దొడ్డిలోనే ఉంచి తిండీ నీళ్ళూ పెట్టవలసింది. మరి ఇవన్నీ చూచుకోవడానికి వీలులేకుండా నేను కీళ్ళనొప్పులతో మూలబడితిని. పిల్లవానికి తగిన ఇంగితము, అనుభవము లేదాయె" అని ముసలివాడు తల పోయసాగాడు. ముసలివాని తలలో సుక్కపందిని గురించిన ఆలోచనలు దట్టంగా ముసురుకుంటున్నాయి.

మూర్ఖత్వానికీ, రౌద్రానికీ సుక్కపంది పెట్టింది పేరు. సలుగులనీనిన పిదప వారం రోజులపాటు అది దయ్యం వలె ప్రవర్తిస్తుంది. తన వారిని గాని పగవారిని గాని దరిజేరనియ్యదు. దాపుకెవరైనా వస్తే చీల్చి చెండాడుతుంది. బొందిలో ప్రాణ ముండగా అది సలుగులపైన ఈగను సైతం వాలనివ్వదు. సలుగులను పక్కనేసుకుని పడుకుని ఉండగా చీమ చిటుక్కుమన్నా అది దిగ్గున లేచి మోర ఎత్తి చూస్తుంది. దాపున మనిషిగాని, ఏదైనా జంతువుగాని కనిపిస్తే అది రౌద్రాకారం దాలుస్తుంది. సలుగులకు హాని చేయడానికి శత్రువు పొంచి ఉన్నట్లు భావిస్తుంది. పుట్టుకతో తనకు సంక్రమించిన మొరటుతనంతో అది శత్రువు మీద విరుచుకుపడుతుంది. ఆ పోరులో శత్రువు పలాయనం చెందడమో, ప్రాణం పోగొట్టుకోవడమో జరిగితే గాని అది తిరిగిరాదు.

ముసలివాడు మట్టి బాట మీద గబగబ నడుస్తున్నాడు. మాటి మాటికీ, "ఓరి గోపాలో! అని కేకలేస్తూ తన మనుమడిని పిలుస్తున్నాడు. ఏ దిక్కు నుండి గాని అతని కేకలకు సమాధానం రావడం లేదు. గొంతు రాచిపోయి ఇప్పుడిప్పుడే కోలుకుంటూ ఉండడం వల్ల అతని కేకలు గట్టిగా వినిపించడం లేదు. వయసురాని కోడిపుంజు కూత వేసినట్టుగానూ, గొంతులో చేపముల్లు గుచ్చుకున్న గుంట నక్క ఊళ వేసినట్లుగానూ అతడు కేకలు వేస్తున్నాడు.

## 3

కొంతసేపటికి అతని పందులు బాట మీద ఎదురుగా వస్తుండడం ముసలివానికి కనిపించింది. అవి గునగున నడిచివస్తుంటే నల్లగుండ్లు దొర్లుకుని వస్తున్నట్లుంది. అతడు వాటి కోసం ఎదురుచూస్తూ బాటమీద నిలుచోలేదు. మరింత వేగంగా పందుల కెదురుగా నడిచి వాటిని కలుసుకున్నాడు. పందులన్నీ తమ యజమానిని గుర్తించి బాటమీద ఆగిపోయాయి. అవి మోరలను పైకెత్తి ముట్టెలను ఆడిస్తూ గుర్‌గుర్ మని అరవసాగాయి. సన్నటి తోకలను ఆడిస్తూ అతని ముందు అల్లి బిల్లిగా తిరగసాగాయి. ముట్టెలతో ఒకటి దాని డొక్కలో మరొకటి కుమ్ముతూ సందడి చేయసాగాయి.

ముసలివాని చూపులు సుక్కపంది కోసం గాలిస్తున్నాయి. పందుల గుంపులో సుక్కపంది లేకపోవడం అతడు గమనించాడు. రెండు మూడుసార్లు గుంపును కలయజూశాక అతని చూపులు పిల్లవాని మీద వాలాయి.

పిల్లవాడు చాలా సేపట్నుంచీ ఏడుస్తుండినట్టున్నాడు. దుమ్ముతో నిండివున్న చెంపల మీద కన్నీళ్ళు జారిన గుర్తులు కనిపిస్తున్నాయి. కన్నులు ఎర్రబారి ఉన్నాయి. ఎర్రనైన ఉన్న కళ్ళను వాడు నలుముకుంటూ బెక్కుతూ నిలుచుని ఉన్నాడు.



"సుక్కపంది ఏమయిందిరా?" అనడిగాడు ముసలివాడు. సుక్కపంది కనపడక పోవడానికీ పిల్లవాని ఏడుపుకూ కారణం ఒకటేనని అతనికి తెలుసు.

పిల్లవాడు తన నడుం మీద జారిపోతున్న తుండు గుడ్డను ఒక చేత్తో పట్టుకుని మరొకచేత్తో కళ్ళు నులుముకుంటూ "పైటేళ నుండి కనబడలా" అన్నాడు.

కనుబొమ్మలు ముడి వేస్తూ ముసలివాడు, "ఎట్టెట్టా?!" అన్నాడు.

"ఏడేడా వెతికినా పైటేళ నుండి కనబడలేదు. ఈతెత్తుకొని ఇంటికొచ్చేసిందేమొననుకున్నా." అన్నాడు పిల్లవాడు.

ముసలివాడు "ఇంటికి యాడొచ్చింది. ఇంతసేపు ఇంటికాడనే ఉండినా. చూసి చూసి సాలైపోయి యలబారి ఇట్టోచ్చినా" అని కొంత ఆగి, "అది ఈ తెత్తుకునిందని నీకెట్ట తెల్సు? తీగలేసిందా?" అని అడిగాడు.

"తీగలెయ్యటం నేను చూడలా. ఈత పొదలో పడుకుని మూలగతా కొంచేపుండి లేసోచ్చేసింది. పైగా నువ్వే సెప్తా ఉంటివి గదా - పవర్నం నాటికో పవర్నం ముందు నాటికో ఈనేస్తాదని."

ముసలివాడు "నేను చెప్పటంలో అగ్గిబడనట్టే ఉంది" అని గొణుక్కుని, పిల్లవాడిని గద్దిస్తూ "ఈ పొద్దో రేపో ఈన బోయే పందిని దొడ్లోనే ఉండనీయకుండా బయటకెందుకిడిస్తివి?" అన్నాడు.

పిల్లవాడు గుక్కిళ్ళు మింగుతూనిల్చున్నాడు. వాడి ఎడమ భుజం నుండి పంగల కర్ర వ్రేలాడుతూ ఉంది. కుడి భుజానికి ఒక జోలె వ్రేలాడుతూంది. వాడు కొట్టిన పిట్టలు జోలెలో ఉన్నాయి. పిట్టలతాలూకు బూడిదరంగు రెక్కలు, ఎర్రటికాళ్ళు పైకి కనిపిస్తున్నాయి.

"పిల్లవాడిని కోపగించుకోవడంలో అర్థం లేదు." అనుకున్నాడు ముసలివాడు. "వాడు పంగల కర్ర చేత బట్టుకుని చెట్ల వెంబడి తిరుగుతూ ఉండి ఉంటాడు. పంగల కర్రలో గులకరాళ్ళు పెట్టి పిట్టల తలలోని మెదడును చెదరగొట్టడంలో మునిగిపోయి ఉంటాడు."

"మళ్ళీ ముండమోపిమాదిరి ఏడిసేదేవిటికి? ఇవిట్ని బద్దరంగా తోలుకొని పోయి దొడ్డిలోకి చేర్చు. నేను సుక్కపంది ఏంవయిందో చూసొస్తా" అని బయలు దేరి నాలుగడుగులేసి ఆగి, "పందుల్ని యాడికి తోలుకోని పోయుంటివి? సుక్కపందిని కడాన యాడ సూస్తివి?" అనడిగాడు.

"బరకలకుంట కాడ కనబడింది కడాన. మల్ల కనబడలా." అన్నాడు పిల్లవాడు.

"సరే నువ్వు పో. పందులకు కుడితిపెట్టి దొడ్లో తోలిబద్దరంగా సూస్కో సుక్కపంది కత నేను జూసుకుంటా" అంటూ ముసలివాడు బయలుదేరాడు.

అతడు వడివడిగా నడవసాగాడు. అతని గమనవేగం మనసులోని కోలహలాన్ని సూచిస్తూ ఉంది. చేతిలోని ఈటెను ఊపుకుంటూ, తన నీడను నుజ్జుగుజ్జుగా తొక్కివేయడానికి ప్రయత్నిస్తున్నట్లు అంగలు వేసుకుంటూ నడుస్తున్నాడు. అతని మనసు అతనికన్నా ముందుగా పయనించి అతన్ని లాగుతున్నది. క్రమక్రమంగా అతని నడక పరుగుగా మారింది. మట్టిబాట మీద అతని పాదాలు తపతప పడుతున్నాయి.

## 4

ఇంచుక సేపటికి అతడు 'బరకల కుంట'ను చేరాడు. వేసవి గనుక కుంట చాలావరకు ఎండిపోయి కట్టవద్ద మాత్రం కొద్దిగా నీళ్లున్నాయి.

నీళ్ళలో పందులు తనివితీర దొర్లినట్లున్నాయి. ముసలివాడు "హూచ్. హూచ్" అని అరుస్తూ కట్టవెంబడి నడవ సాగాడు. ఆ చివరన కట్టదిగి నీటి అంచు వెంబడి నడవసాగాడు. పందులు, బర్రెలు రోజు పొద్దునా బురదనీటిలో దొర్లి గట్టెక్కినప్పుడు వాటి దేహాలనుండి కారిన నీటి తాలూకు చెమ్మను తొక్కుకుంటూ అతడు నడుస్తున్నాడు. కుంట చుట్టూ ఉన్న పొదలన్నింటినీ అతడు



కలదిరుగుతున్నాడు. పొదలలో దూరుతూ అతడు సుక్కపంది కోసం అన్వేషిస్తున్నాడు.

అతడు మళ్ళీ నీటి అంచువద్దకు వచ్చాడు. నడుము వంచి తేమ నేల మీద పంది అడుగుజాడల కోసం చూడసాగాడు. తేమ నేల మీద ఎన్నోరకాల జంతువుల అడుగుజాడలు గజిగజిగా కనిపిస్తున్నాయి. దుక్కి దున్ని అరిగిపోయిన గొడ్ల గిట్టల గుర్తులు, నాడాలు కొట్ట బడిన కోడెల గిట్టల గుర్తులు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. వాటి మధ్యన గొర్రెలగిట్టలు, పందులగిట్టలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటినన్నిటినీ కలుపుతూ జలగలజాడలు, వానపాముల జాడలు కనిపిస్తున్నాయి.

అతడు నడుమెత్తి నిలుచుని దీర్ఘంగా నిట్టూర్చాడు. వెన్నెలలో కుంట పరిసరాలన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి.

ప్రసవ సూచనలు కనిపించగానే సుక్కపంది విచిత్రంగా ప్రవర్తిస్తుంది. ఏకాంత స్థలాన్ని వెదుక్కుంటూ అది బయలుదేరుతుంది. ఒక్కొక్కసారి అది అలా కొన్ని మైళ్ళు పయనించడం కద్దు. అలా పయనించి చివరకొక దట్టమైన పొదనో, గుహనో చూసుకుని అందులో పిల్లల నీనుతుంది.

ముసలివాడు నీటి అంచువద్ద నిలబడి చుట్టూ చూశాడు. అక్కడున్న పొదలలో ఏదీ పందికి అండనిచ్చేటంత పెద్దదిగా లేదు. "పైటేళప్పుడు అది ఈ ప్రాంతాన్ని వదలి ఎటో వెళ్ళిపోయింది" అనుకున్నాడతడు.

ఇక్కడనుండి బయలుదేరి ఎక్కడకు పోయి ఉంటుంది?

తూర్పుగా పోయి ఉంటే మట్టిబాట మీదుగా నడచి ఇల్లు చేరుకునేది. మట్టిబాట దానికి సుపరిచితమే. కాని అలాజరగలేదు. కనుక అది తూర్పుదిశగా వెళ్ళలేదని తెలుస్తుంది.

కుంటకు ఉత్తరంగా చిన్న నది ప్రవహిస్తున్నది. ఈత ఎత్తుకుని ఉన్న పంది నదిని దాటగలగడం అసంభవమే.

కుంట నానుకుని దక్షిణంగా సువిశాలమైన మైదానం ఉంది. మైదానం నిండా పచ్చగడ్డి వెంపలిచెట్లు మాత్రం ఉన్నాయి. మోకాటెత్తు

ఉన్న పొద ఒకటిగూడా లేదు. ఏకాంతాన్ని వెదుక్కుంటూ బయలుదేరిన పంది అటూ వెళ్ళి ఉండదు.

ఇక కుంట వద్ద ప్రారంభమై ఒక అడవి పడమటి దిక్కుగా వ్యాపించి ఉన్నది. వర్షాకాలంలో కుంటను నీటితో నింపే వంక అడవిలో నుండి వస్తున్నది. అడవి నల్లగా, గూఢంగా, అనంతంగా పరచుకుని ఉంది.

"సుక్కపంది ఇలా పడమరగా వెళ్ళి అడవిలోకి ప్రవేశించి ఉంటుంది" అనుకున్నాడు ముసలివాడు. తను అలా భావించడానికి ఆధారం ఏమైనా ఉందా అని అతడు ప్రశ్నించుకున్నాడు. "వేరే ఆధారమేమీలేదు. ఈత ఎత్తుకోగానే సుక్కపంది పొదలను, గుహలను వెదుకుతూ ఎన్ని ఆమడల దూరమైనా పోతుంది. అదే ఆధారం" అనుకున్నాడతడు.

చంద్రుడు ఆకాశంలో ఎగబ్రాకుతున్నాడు. రాత్రి ముదురుతున్నది. కాలయాపన చేయడం ముసలివానికి ఇష్టం లేదు. అతడు కుంటను వదిలి పడమటి దిక్కుగా అడవివైపు నడవసాగాడు.

## 5

అడవిలో అతడు నడవడానికి నిర్ణీతమైన దారులులేవు. అతడ బండల మీదుగా, కణికి రాళ్ళమీదుగా నడుస్తున్నాడు. మిట్టలను ఎక్కుతూ, పల్లాను దిగుతూ సాగుతున్నాడు. పచ్చికను తొక్కుకుంటూ, చిన్నచెట్లను తొలగదోసుకుంటూ నడుస్తున్నాడు.

అడవి జంతువులు అవిరామంగా నడవడం వల్ల ఏర్పడిన సన్నటి దారి మీద అతడు నడవసాగాడు. ఆ దారి మరీ అస్పష్టంగా ఉంది. కొంతసేపటికది గారడి యుక్తివలె గురి వెంద పొదల మధ్య మాయమైపోయింది. అందుకతడు వగచలేదు. "ఈ దారులు ఎటూ కానిచోట ప్రారంభమై ఎటూ కాని చోట అంతమౌతాయి. ఇలాంటి దారుల వెంబడి నడవడం శుద్ధ దండగ" అనుకున్నాడతడు.



అతడు అరణ్యం మధ్యకు పురోగమనిస్తున్నాడు. పొదలను, గుహలను వెదకుతున్నాడు. మాటి మాటికి ఎలుగెత్తి, "హూచ్ హూచ్" అని అరుస్తున్నాడు.

అతడు తాగిన కల్లు తన ప్రభావాన్ని చూపుతూ ఉంది. వొళ్లంతా వెచ్చగా అవుతున్నట్లు, పాదాలు గాలిలో తేలుతున్నట్లు అనిపిస్తూంది. అతనికి హాయిగా ఉంది. చంద్రుడు నవ్వుతున్నట్లుగా అతనికి తోస్తున్నది. "కడుపులో ఈతకల్లు మరుగుతున్నది. ఆవిర్లు ఎగదన్నుతున్నాయి." అనుకున్నాడతడు. కల్లు ఎంత మైకం కలిగించినాగాని పందిని గురించిన ఆరాటం అతనిలో కించిత్తయినా తగ్గలేదు.

అడవి జంతువులు ఏర్పరచిన దారి మళ్ళీ ఒకటి అతనికి తటస్థించింది. ముసలివాడు, "నిద్రలో కనిపించే కలలవలె ఈ దారులు తలా తోకా లేకుండా ఉంటాయి" అనుకుంటూ ఆ దారి మీద నడవసాగాడు దారి మీద పలురకాలైన జంతువుల అడుగుజాడలున్నాయి. వాటిని తొక్కుకుంటూ అతడు నడవసాగాడు.

తన గుడిసె ప్రమాణమున్న పొదలను చుట్టివస్తూ, చంద్రుని కిరణాల కభేధ్యమైనంత దట్టంగా వున్న వృక్షాల కిందుగా నడుస్తూ, అగాధమైన లోయలను దాటుతూ, దీవుల వంటి బండలను ఎక్కి దిగుతూ అతడు సాగుతున్నాడు.

అతడు తలయెత్తి చూస్తే వృక్షాల మధ్య ఆకాశం కొంత కనిపిస్తుందేగాని, సూర్యుడిని తన వెనక దాచుకున్న పడమటి కొండగాని, చంద్రుడిని ఆకాశంలోకి విసిరిన తూర్పు కొండగాని కనిపించడం లేదు. అతన్ని పరివేష్టించి వృక్షాలు, పొదలు, గుట్టలు గంభీరంగా నిలుచుని ఉన్నాయి. అడవిలో ఉద్భవించిన ధ్వనులు అవిరామంగా వినిపిస్తున్నాయి. కంటికి కనిపించకపోయినప్పటికీ ఆ ధ్వనులను కలగజేస్తున్న ప్రాణులను అతడు క్షుణ్ణంగా ఎరుగును. కాని అతని అవగాహనకు అతీతమైన ధ్వనులు చాలా ఉన్నాయి. ఆ ధ్వనులు ఎలా పుడతాయో, వాటి అంతరార్థమేమిటో అతనికిగాని,

అతని పూర్వులకుగాని అంతుపట్టలేదు. "అడవి నిగూఢమైనది. ఏ అనుభవానికీ, ఏ మేధస్సుకీ అంతు చిక్కని రహస్యాలు ఇక్కడ చాలా ఉన్నాయి" అనుకున్నాడు ముసలివాడు.

"కాని, నా అనుభవం మాత్రం స్వల్పమైనది కాద," అనుకున్నాడతడు. ఇరవయ్యేండ్ల ప్రాయంలో అతడు ఒక కీకారణ్యంలో రెండేడ్ల పాటు కాపురమున్నాడు. అప్పట్లో ఈ ప్రాంతంలో భయంకరమైన కరవు సంభవించి, గడ్డి లేక పశువులు మందలు మందలుగా రాలిపోసాగాయి. ఈ ప్రాంతంలో ఒక భూస్వామి ముసలివానికి (అప్పట్లో యువకుడు) ఒక మంద పశువులను అప్పగించి యాభై మైళ్ళ దూరాన ఉన్న "సూగాలోల్ల అడవి"కి తోలుకొని పోయి వర్షాలు పడి కరవు తీరేవరకు తిరిగి రావద్దని ఆదేశించాడు. పశువులన్ను మేపుకుంటూ, వాటిని క్రూరమృగాల బారి నుండి కాపాడుతూ తాను అడవిలో గడిపిన రెండేండ్ల కాలంలోని ప్రతి దినాన్నీ అతడు వొళ్ళు గగుర్పొడిచే అనుభవాలతో గడిపాడు. నాలుగు తరాలకు సాక్షులవలె నిల్చుని ఉండే చెట్ల కింద, అది మధ్యాంతాలు తెలియని తీగలతోనిర్మించిన పొందలకింద, కూతవేస్తే జాము సేపు ప్రతిధ్వనించే చీకటి గుహల్లో అతడు నివాసమున్నాడు. నక్కలను, చిరుతలను ఎదుర్కొంటూ, జింకలతో, అడవి కోళ్లతో స్నేహం చేస్తూ, కుందేళ్ళను ఏదు పందులను వేటాడుతూ అతడు జీవించాడు. ఆ అనుభవాలన్నింటినీ నెమరువేస్తూ ముసలివాడు, "అడవి మహాచిత్రమయింది. దాని రహస్యాలు బహుశ దానికే తెలియవేమో" అనుకున్నాడు.

చంద్రుడు చల్లగా వెలుగుతున్నాడు. పచ్చికపైన, చెట్లపైన, లోయమీద, పర్వతాల మీద వెన్నెల కురుస్తున్నది. వైశాఖ మాసపు ఎండలకు శోషిల్లి ఉండిన ప్రకృతి, వెన్నెలను ఆస్వాదిస్తూ సేదదీర్చుకుంటున్నది.

అడవిలోని శబ్దాలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి. ప్రాణులు ఒక్కటొకటే నిద్రాదేవి వొడిలోకి జారుకుంటున్నాయి.



చంద్రుని కిరణాల తాకిడికి తెలివి తెచ్చుకుని తలలు పై వని గడ్డిని, మొక్కలను తొక్కుకుంటూ ముసలివాడు నడుస్తున్నా

రెండు శిలలు ఒకదానికొకటి ఆనుకొని ఉండగా ఏర ఒకటి దారికి కుడి పక్కన కనిపించింది. ముసలి వాడు గుహ నిల్చుని అరచేతులను నోటి చుట్టూ పెట్టుకొని "హూచ్ హూచ్" అని అరిచాడు. గుహ చీకటిగా ఉంది. చంద్రుడు దాదాపు నడి ఆకాశంలో నిలిచి ఉండడంవల్ల వెన్నెల గుహలోనికి ప్రసరించడం లేదు. గుహముందు ద్వార పాలకులవలె రెండు ముష్టి చెట్లున్నాయి. అతడు ఈటెను కింద పెట్టి గుహలోపలకు పోయేదారిమీద పంది తాలుకు అడుగుల గుర్తులకోసం నడుం వంచి వెదకసాగాడు. గతవారం కురిసిన తొలిముంగార్ల వానల మూలాన అక్కడ పచ్చగడ్డి వొత్తుగా పెరిగి ఉంది. ముసలివానికి అనుకూలించే గుర్తులేవీ కనబడలేదు. అతడు రెండు రాళ్ళను చేతిలోనికి తీసుకుని చీకటిమయంగా ఉన్న గుహలోనికి విసిరాడు. గుహకు పక్కగా నిలుచుని ఫలితం కోసం చూడసాగాడు. "నేను జాగ్రత్తగా ఉండాలి. ఒక వేళ సుక్కపంది గుహలో ఉండి నా ఉనికిని గ్రహిస్తే మరుక్షణమే అది పులివలె మీదకు దుముకుతుంది. అందినది కాలో చేయో నంజర నంజరగా కొరికిపారేస్తుంది. ప్రాణం తీసినా తీస్తుంది. అది మొరటు జీవం. శత్రువులు, శ్రేయోభిలాషులు అని చూసుకొనే ఇంగితం దానికి లేదు" అనుకున్నాడు ముసలివాడు. గుహలోపల నుండి ఏ సంభవమూ కానరాలేదు. అతడు గుహ ద్వారానికి చేరువగా వెళ్ళి ముష్టి చెట్ల వద్ద నిలుచుని కొంత సేపు గాలిని గట్టిగా పీల్చి, తల అడ్డంగా ఊపుతూ వెనక్కి తిరిగాడు. ఇంతలో అతని వెనకనుండి గబగబమని శబ్దం వచ్చింది. ముసలివాడు బిసకంపవలె చెంగున ఎగిరి ఈటెవద్ద దూకి దానిని చేత బుచ్చుకుని గిరుక్కున వెనకకు తిరగాడు. నాలుగైదు గబ్బిలాలు రెక్కలు కొట్టుకుంటూ గుహనుండి బయటకొచ్చి ఎగిరిపోవడం కనిపించింది. ఈటె చుట్టూ బిగుసుకుని ఉండిన అతని కుడిచేతి వ్రేళ్ళు సడలినాయి. ఎడమ చేతిని ఎద మీద వేసుకుని, "సుక్కపంది అనుకుంటి. గుండె ఆవులించిపోయింది" అనుకున్నాడు.

అ  అతడు మళ్ళీ నడక ప్రారంభించాడు. అడవి దిగంతాల వరకు భూమిని కప్పి ఉన్నట్లు కనబడుతున్నది. పొదలు, గుహలు, చెట్లు, లోయలు, శిలలు ఒక దానికి భిన్నంగా మరొకటి, ఒకదానికన్న ఉన్నంతగా మరొకటి ఉన్నాయి. కాలుతున్న బండమీద వదలబడిన చీమవలె, సందెచీకటిలో ఆకటి గొన్న మిణుగురు పురుగువలె అతడు తిరుగుతున్నాడు. నడచిన దారిమీదుగానే తాను మళ్ళీ నడుస్తున్నట్లు అతనికి అప్పుడప్పుడు అనుమానం కలుగుతూ ఉంది. "ఈ అడవిలో సుక్కపంది ఏ మూలన ఉందో, ఏ పరిస్థితిలో ఉందో. అద్భుతాలకు ఆలవాలమైన ఈ అడవిలో, తామసానికి ఆటపట్టయిన ఈ అడవిలో, ప్రాణమెదిగినంతగా మనసు ఎదగని ఈ అడవిలో సుక్కపందికి ఏ ముప్పు వాటిల్లిందో'. అనుకున్నాడు ముసలివాడు.

# 6

అతని కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. కల్లు కలగ జేసిన మాయ క్రమక్రమంగా అంతరించిపోతున్నది. "ఏ సంభవానికైనా అవకాశ మున్న ఈ అడవిలో లీనమైపోయిన సుక్కపంది ఇక నాకు దక్కదేమో" అనుకున్నాడు ముసలివాడు. చుట్ట చుట్టుకుని నిద్రిస్తుందిన పాము పిల్ల మేలుకుని తల పైకెత్తినట్లు నిరాశ అతని మానసంలో ఒక మూల కదిలింది.

ఏడాది క్రితం ఒకసారి సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లోనే ముసలివాని పొరుగువాడైన ఎరుకల వాడు తన పందిని పోగొట్టుకున్నాడు. ఎరుకల వాడు పంది కోసం అడవంతా గాలిస్తూ మూడు పగళ్ళు, మూడు రాత్రులు గడిపాడు. చివరకు రిక్త హస్తాలతో తిరిగి వచ్చాడు. ఆరు నెలల తరువాత ఉప్పుచెక్క కోసం అడవికి వెళ్ళిన కాపు వాళ్ళు కొందరు ఆ పంది మాయమైన వైనం తెలుసుకోగలిగారు. దట్టంగా ఉన్న ఒక పొదలో పంది తాలూకు ఎముకలు తెల్లగా మెరుస్తూ వారికి కనిపించాయి. పంది మెడకు ఉండిన గజ్జెకూడా ఎముకల మధ్య వారికి కనిపించింది.



ఎలుగుబంటిగాని, పెద్దనక్కగాని దాన్ని చంపి, తిని ఉంటుందని కొందరు భావించారు. చెంచువాళ్ళు దాన్ని చంపి, విందు చేసుకుని ఉంటారని మరి కొందరు భావించారు.

"కాని, నేను ఎరుకల వాడివలె చవటను కాను" అనుకున్నాడు ముసలివాడు. అతడు చెట్ల మధ్య నడుస్తూ "నేను సుగాలోల్ల అడవిలో రెండు సంవత్సరాలపాటు కాపురమున్నాను. పందుల్ని కొనడానికి వచ్చే వాడుక దారుల మాటలకన్న సులువుగా నేను జంతువుల భాషను అర్థం చేసుకోగలను. చెట్లు తమ కొమ్మల కదలికలతో, ఆకుల గల గలతో ఇచ్చే సందేశాలు నాకు కరతలామలకం" అనుకున్నాడు.

సుగాలోల్ల అడవిలో తాను పశువుల కాపరిగా ఉండినప్పటి ఒకనాటి సాయంత్రం అతనికి జ్ఞాపక మొచ్చింది. జనం తొలి ముంగార్ల వానల కోసం ఎదురు చూస్తున్న రోజులవి. పశుల కాపరులందరు నిద్ర వచ్చేంత వరకు కథలు చెప్పుకుని గుడిసెలో పడుకున్నారు. ఆరు బయట పశువులన్నీ కట్టు గొత్తులకు కట్టివేయబడి ఉన్నాయి.

అర్ధరాత్రప్పుడు వాన ప్రారంభమయింది. వర్షంతో బాటు మంచురాళ్లు పడసాగాయి. రాళ్ళు గుడిసె కప్పుమీద దడదడ పడుతుండడంతో పశుల కాపరులందరు మేలుకుని బయటకొచ్చారు. బయటంతా చీకటిగా ఉంది. గాలి, వాన, ఉరుములు, కలిసి సృష్టిస్తున్న భీభత్సం వాళ్ళకు అనుభవమవుతున్నది. గాలి తూర్పు దిశనుండి బెస్సుమని వీస్తున్నది. గాలి పాటు వలన చినుకులు, మంచురాళ్లు ఏటవాలుగా పడుతున్నాయి. రాళ్ళు అవిరామంగా పడుతుండడం వల్ల పశువులు కట్టగొత్తుల వద్ద యిడుగులాడుతూ ఉండడం చీకటిలో లీలగా కనిపిస్తున్నది.

వాళ్ళు గబగబ పశువులన్నిటిని కట్టు గొత్తుల నుండి విప్పి చెట్ల కిందకు తోలుకొచ్చారు. ఒక కట్టుగొత్తు వద్ద తెగిపోయిన సగం పగ్గం ముసలివానికి కనిపించింది. చెట్లకింద గుంపుగా తోలిన పశువులను లెక్కపెట్టగా ఒక ఎనుబోతుమాయమై ఉన్నట్లు తెలిసింది. రాళ్ళ వాన ప్రారంభం కాగానే ఎనుబోతు పగ్గం తెంచుకుని ఎటో పారిపోయింది.

దాన్ని పట్టి తేవడానికై వెంటనే బయలు దేరాలని వాళ్ళు సంకల్పించు కున్నారు ఏ వైపుగా వెళ్ళాలన్న అంశం మీద ఇంచుక సేపు తర్జన భర్జన జరిగింది.

అక్కడి పరిసరాలన్నీ వాళ్లకు క్షుణ్ణంగా తెలుసు. వాళ్ళున్న చోటు నుండి తూరుపుగా ఒక సువిశాలమైన మైదానం ఉంది. ఆ మైదానంలో పచ్చ గడ్డి, గులక రాళ్ళు తప్ప మరేమీ లేదు. మిగిలిన మూడు దిక్కులలో మహోన్నతములైన వృక్షాలున్నాయి.

తప్పిపోయిన ఎనుబోతును తూర్పు దిశగా వెళ్ళి వెదకుదామని ముసలివాడు చెప్పగా అతని సహచరులు వొప్పుకోలేదు. అతని వాదనలో కించిత్తయినా ఇంగితం లేదని వారతన్ని ఎగతాళి చేశారు. తల దాచుకోవడానికై పశువు చెట్లున్న వైపుగా వెళ్ళుతుందేగాని మైదానం వెంబడి పరుగిడుతుందా? అని వాళ్ళు వాదించారు. వాళ్ళతో వాదిస్తూ కాలయాపన చేయడం ఇష్టంలేక ముసలివాడు తానొక్కడే తూర్పువైపుగా బయలుదేరాడు. బాగా ముదిరి దళసరిగా ఉన్న తాటిపట్ట నొకదాన్ని నరికి గొడుగువలె పట్టుకుని రాళ్ళ వాన నుండి తలను కాపాడుకుంటూ అతడు పరుగెత్తసాగాడు.

తూర్పువైపున మైదానం ఉండడం మాత్రం అతని సహచరులు గమనించారు గానీ, ఆ వైపు నుండే గాలి వీస్తుండడం, ఆ వైపు నుంచే చినుకులు ఏటవాలుగా పడుతుండడం వారు గమనించలేదు. కళ్ళు కనిపించని చీకటిలో తగులుకుని ఉన్నప్పుడు వర్షం ప్రారంభమైతే ఏ వైపు నుండి చినుకులు ఏటవాలుగా పడుతున్నాయో, ఏ వైపు నుండి గాలి వీస్తున్నదో ఆ దిక్కుగా ఎనుబోతులు పరుగెత్తడం ప్రారంభిస్తాయి. అప్పుడు వాటి పోకడ చేపలు ప్రవాహాని కెదురీదుతున్నంత స్వాభావికంగా ఉంటుంది. చీకటి, వర్షం, ఉరుములు మెరుపులు కలిగించిన భీతి వలన అవి మోరలను వంచుకుని, కొమ్ములను ముందుకు చాచుకుని దయ్యం పూనినట్టుగా పరుగిడతాయి. అవి అలా అవిరామంగా పరుగిడుతూ కేవలం అలసట వల్లనే ప్రాణాలు వదలడం, అగాధమైన లోయలలోకి దూకి దుర్మరణం పాలుగావడం కూడా కద్దు.



ఆ పూట అతడు రాళ్ళవానలోపడి జాము సేపు పరుగెత్తగా ఎనుబోతు అతని కంటబడింది. అల్లంత దూరాన అది తోక పైకెత్తుకుని, మూతి నేలకు తగిలేట్టుగా మోరవాల్చుకుని పరుగెత్తు తుండడం మెరుపు కాంతిలో కనిపించింది. దాని దారి కడ్డంగా మరి రెండు క్రోసుల దూరాన ఒక అగాధమైన లోయ ఉండడం ముసలివానికి గుర్తుకొచ్చింది. అతడు మరింత వేగంగా పరుగెత్తి దానిని కలుసుకున్నాడు. అర్ధోన్మాదియై పరుగిడుతున్న ఎనుబోతును రిక్త హస్తాలతో ఆపడం అతని తరం కావడం లేదు. అది తపతపమని అడుగులు వేసుకుంటూ వర్షపు నీటిని చెదరగొడుతూ, బుస కొడుతూ, నోటి అంచువద్ద నురగ కార్చుతూ పరుగిడుతుంది. అతడు పక్కగా కొంతసేపు పరుగెత్తి అదనుచూసి దాని ముందుకాలి మోకాలు వెనక పుష్టికొద్దీ తన్నాడు. ఆ తాపుకు దాని కాలు వంగి అది దభేలుమని ముందుకు పడిపోయింది. అతడు క్షణమాలస్యం చేయకుండా దాని మీద పడి ముక్కుదాడులో చేయివేసి దానిని అదుపులోకి తెచ్చాడు.

నలభై ఏండ్ల క్రితం జరిగిన ఆ ఉదంతాన్ని నెమరు వేసుకుంటూ ముసలివాడు నడుస్తున్నాడు.

"నేను ఆ అనుభవాన్ని ఎందుకు మననం చేసుకున్నాను?" అని అతడు తనను తాను ప్రశ్నించుకున్నాడు. అతడా విషయాన్ని ప్రయత్న పూర్వకంగా మననం చేసుకోలేదు. అది అసంకల్పితంగా జరిగింది. అది సత్ఫలితాన్నే యిచ్చింది. ఇప్పుడతనికి తన అనుభవాల మీద, యుక్తుల మీద, శరీర పటిష్టత మీద నమ్మిక కుదిరింది. అతని మనసులో పొడసూపిన నిరాశ మాయమయింది.

"ఈ ఉదంతాన్ని మళ్ళీ మననం చేసుకుంటాను. చిన్న చిన్న వివరాలను సైతం వదలకుండా తవ్వి తిరగేసి మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటాను" అనుకున్నాడతను.

# 7

అతడు హూచ్ హూచ్ అని అరుస్తూ బలసతుప్పల మీదుగా, కాసేరాకు పొదల మీద నడుస్తున్నాడు. బండల వంటి అతని పాదాలను బలసముండ్లు బాధించడం లేదు. కాసేరాకు దురద కలిగించడం లేదు.

బలసతుప్పల కవతల గురివెంద పొద ఒకటి అతనికి కనిపించింది. కాయలు పండి పగిలి ఎర్రని గింజలు వెన్నెలలో కనిపిస్తున్నాయి. దూరం నుండి ముసలివాడు పొదలోకి రాళ్ళు విసిరాడు. పొద అటు ఇటు ఊగింది. అతడు దాపుగా వెళ్ళి ఈటెతో పొదమీద బాదాడు. నల్లటి మచ్చలుగల ఎర్రని గింజలు జల్లుజల్లుమని కిందకు రాలాయి. రెండు కుందేళ్ళు పొదలలోనుండి చివుక్కుమని బయటకు దూకి చెంగు చెంగుమని ఎగురుతూ పారిపోయాయి. ముసలివాడు కనుమరుగయ్యే వరకు వాటిని చూసి, "ఆలి, మొగుడు. పాపం సరసాలాడుతూ ఉండినట్టున్నాయి." అనుకున్నాడు.

మరొక పొదలోనుండి పూరేడు పిట్ట కూస్తుండడం అతడు విన్నాడు. అది తన గుడ్ల మీద కూర్చుని పొదుగుతూ, తుర్రమని అవిరామంగా కూస్తున్నది. "ఆ పొదను వెదకనవసరం లేదు. ఆ పొదలో పంది లేనట్టే. ఉంటే పూరేడు అలా జంకుగొంకు లేకుండా కూస్తూ అక్కడ పడుకునేది కాదు." అనుకున్నాడతడు.

మరొక బొంతజెముడు పొదలో నుండి బుస్సు బుస్సుమని చప్పుడు వినిపిస్తూ ఉంది. పొదలలోపల ఒక పాము రాతికేసి తలను రాపాడుతూ తన కుబుసాన్ని వదలడానికి ప్రయత్నిస్తూంది. ముసలివాడు పాము బుసను వింటూ పొదదాపున కొంతసేపు నిలబడి మళ్ళీ నడవడం ప్రారంభించాడు. పొదలోపల మెలికలు తిరుగుతూ, దొర్లుతూ, నేల మీద దుమ్ము పైకి లేచేట్టుగా బుసకొడుతూ కుబుసాన్ని వదలడానికి ప్రయత్నిస్తున్న పామును తలుచుకుంటూ అతడు నడుస్తున్నాడు.

దారి పక్కన అతనికొక ముంగిస కనబడింది. అది గడ్డి ధాన్యాన్ని ఏరుకుని తింటూ ఉంది. దాన్ని చూడగానే ముసలివాడు "దీనికి



నూరేళ్ళాయుస్సు" అనుకుని దానినుద్దేశించి "ఈ గడ్డిత్తులు రాతిరంతా తిన్నా నీ పొట్టనిండదు. బొంత జెవుడు పొదలో కట్లపాము పెనుగులాడ్తా ఉండాది. పోయి దాన్ని తుండెమిట్ల, మొండెమట్ల తెగేసి తినేయ్" అన్నాడు. ముంగిసకు అతని మాటలు అర్థం కాలేదు. అది మీసాలను ఆడించుకుంటూ మెదరిక్కిరించి కొంతసేపు చూసి గబుక్కున వెనుదిరిగి పరుగెత్తి చెట్టు తొర్రలోకి మాయమైపోయింది.

అతడొక చదును ప్రదేశం మీద నడుస్తున్నాడు. అక్కడ గడ్డి స్వల్పంగా మొలిచి ఉంది. పొదలు దూర దూరంగా ఉన్నాయి.

"నాకు గూడా ఆకలవుతూంది" అనుకున్నాడు ముసలివాడు. అతడు తాగిన కల్లు పూర్తిగా ఆవిరి అయిపోయింది. మైకం దిగి చాలాసేపయింది. కడుపులో ప్రేవులు రావిడి చేస్తుండడం అతనికి వినిపిస్తూంది.

"గురివెంద పొదలో నుండి బయటకు దూకిన కుందేళ్ళలో ఒకదాన్ని నేను చంపి తిని ఉండాల్సింది" అనుకున్నాడు ముసలివాడు. అలా చేయనందుకు అతడు తనను తాను కాసేపు నిందించుకున్నాడు. "మరి అప్పట్లో నాకు ఆకలి లేదాయె. పైగా ఆ కుందేళ్ళు జంటగా ఉండే జంటను విడదీయడం మహాపాపం" అని అతడు సంజాయిషీ చెప్పుకున్నాడు.

"ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేముంది. ఈ అడవిలో కుందేళ్ళు దండిగా ఉంటాయి. నా చేతిలో ఈటె ఉంది. తలలో నానా యుక్తులున్నాయి. నేను దేనికీ వగచాల్సిన పనిలేదు" అనుకున్నాడతడు.

అతడు నడుం వంచి వెన్నెలలో కుందేళ్ళ అడుగు జాడల కోసం వెదకసాగాడు. గడ్డి తక్కువగా మొలిచి ఉన్నందువల్ల దుమ్ములో అసంఖ్యాకమైన అడుగులు కనిపిస్తున్నాయి. కొంత సేపటికి అతడు కుందేలు పాదాలను గుర్తించగలిగాడు. వంచిన నడుమెత్తకుండా అతడా అడుగులను వెంబడించి నడవసాగాడు. అలా కొంత దూరం పోయాక ఆ అడుగులు వంకర టింకరగా రెండు బారలు సాగి అదృశ్యమైపోయాయి. "అది దాక్కుని ఉన్న పొద ఈ దాపులోనే ఉండాలి" అనుకుంటూ ముసలివాడు నడుమెత్తి నిలుచున్నాడు.

తను నివాసముండే పొదను సమీపించినప్పుడు కుందేలు ఉద్దేశ పూర్వకంగా యిలా వంకర టింకరగా నడుస్తుంది. అలా చేయడం ద్వారా అది తనను వేటాడే జంతువులను తప్పుదారి పట్టిస్తుంది. "నన్ను తప్పుదారి పట్టించడం దాని తరం గాదు, దానబ్బతరము కాదు" అనుకున్నాడు ముసలివాడు.

దాపుననే ఒక చిట్టీత పొద ఉంది. ముసలి వాడు బొడ్లోని కత్తిని చేతిలోకి తీసుకుని అక్కడున్న తుమ్మ కంపలను, బలస కంపలను కొట్టి తెచ్చి చిట్టీత పొదచుట్టూ మూడు వైపులా నడుమెత్తు కంచె వేశాడు.

"పరుగులో కుందేలును మించిన జీవం లేదు. నువ్వు ఉమిసిన ఎంగిలి ఆరేలోగా అది ఈ అడవిని రెండు సార్లు ప్రదక్షిణ చేస్తుంది. ఐతే దారి కడ్డంగా మూరెడు కంచె అడ్డమొస్తే అది మరి ముందుకు సాగదు. మోకాలును నాకుకుంటూ కూర్చుంటుంది" అనుకున్నాడు ముసలివాడు.

అతడు చిట్టీత పొదకు మూడు వైపులా కంచె వేయడం ముగించి నాలుగో వైపున నిలుచున్నాడు. ఈటెను కుడిచేతిలో సిద్ధంగా పట్టుకుని పెద్దగా గొంతుపెంచి హోహో హూహూ అని అరుస్తూ పొదలోని కుందేలుకు గంగ వెర్రులెత్తించడం ప్రారంభించాడు. పొదలో నుండి ఏ ప్రాణీ బయటకు రాక పోవడంతో మరింత గట్టిగా అరుస్తూ నోరు లబలబ బాదుకుంటూ భీభత్సం సృష్టించాడు. దాంతో కుందేలు పొదలోనుండి చెంగున బయటకు దూకి మూడు వైపులా కంచె ఉండడం గమనించి మరింతగా బిత్తరపోతూ నాలుగో వైపుగా పరుగెత్తి రాసాగింది. ఇంతలో ముసలివాని ఈటె దాని ఎదలో దిగింది. అది కీచుమని అరుస్తూ ఎగిరి నాలుగు బారల కవతల పడి విలవిల తన్నుకోసాగింది.

"ఈ రోజు నువ్వు ఎడం ప్రక్కన నిద్రలేచావు" అనుకుంటూ అతడు విలవిల తన్నుకుంటున్న ప్రాణి చెంతకు నడిచాడు. అదిప్పుడు విలవిలలాడడంలేదు. దాని శరీరం నుండి కారిన నెత్తురు వెన్నెలతో నిగనిగ మెరుస్తున్నది. ఈటె దాని శరీరానికి గుచ్చుకుని ఇంకా అలాగే ఉన్నది. ముసలివాడు ఈటెను ఎత్తి భుజాన వేసుకుని, ఈటె చివరన కుందేలు మూటవలె వ్రేలాడుతుండగా నడవసాగాడు.



అతడొక బూరుగ చెట్టుకింద కుందేలును దించి పెట్టాడు. చెట్టుకింద బూరుగ కాయలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని కాయలు పొట్టవిచ్చుకుని ఉండగా లోపల ఉన్న బూరుగ దూది తెల్లగా కనిపిస్తున్నది. అతడొక కాయను తీసి దూదిని బయటకు తీసి తన బలమైన అరచేతుల మధ్య నలిపాడు. రెండు కణిక రాళ్ళను ఒక దాని మీదొకటి కొట్టి నిప్పు పుట్టించి దూదిని రగిలించాడు. దాపున ఉన్న ఎండు పుల్లలను ఏరి తెచ్చి పెద్ద మంట తయారుచేశాడు. ఈటెను బయటకు లాగివేసి కుందేలును మంటలో పడవేశాడు. మంట తగ్గకుండా పుల్లలను వేస్తూ కుందేలును అటూఇటూ దొర్లిస్తూ అతడు మంట పక్కనే కూర్చున్నాడు. చూస్తుండగానే దాని బొచ్చంతా కాలిపోయింది. కండలు చమురు కమ్ముతూ కమ్మని వాసన వెదజల్లుతూ కాలసాగాయి. బాగా పచనమయాక అతడు దానిని మంటనుండి బయటకు తీసి పడేశాడు. కత్తితో దాని కండలను ముక్కలు ముక్కలుగా కోశాడు. తన తలకు చుట్టుకుని ఉండిన గుడ్డను విప్పి నేలమీద పరచి మాంసపు ముక్కలను దాని మీద పోశాడు.

అతనికి అల్లంత దూరాన కిచ్చిలిచెట్టు కనిపించింది. దాని కాయలు గాలికి ఊగుతూ కొమ్మలనుండి వ్రేలాడుతున్నాయి. ముసలివాడు లేచివెళ్ళి రాళ్ళతో కొన్ని కాయలు పడగొట్టి తెచ్చాడు. కాయలను బద్దలుగా కోసి మాంసపు ముక్కలమీద పిండాడు. పుల్లటి కిచ్చిలి రసంతో తడిసిన మాంసపు ముక్కలను బూడిదలో అద్దుకుని అతడు తినసాగాడు.

పుల్లలమంట క్రమక్రమంగా తగ్గిపోయింది. బూడిద కింద ఉన్న నిప్పులు గాలి వీచినప్పుడల్లా తమ ఉనికిని బయటకు కనబరుస్తున్నాయి.

అతడు ఆవురావురుమని తింటున్నాడు. ఎముకలను పక్కకు గిరవాటు పెడుతున్నాడు.

కొంత సేపటికి మంట అణగారి పోయినట్టు అతని ఆకలి తగ్గిపోయింది. తుండుగుడ్డ మీద ఇంకా దోసెడు మాంసపు ముక్కలు మిగిలి ఉన్నాయి. కొన్ని కిచ్చిలికాయలు గూడా మిగిలి ఉన్నాయి.

వాటినన్నిటినీ అతడు మూటకట్టాడు. పైకి లేచి అరచేతులను రోమమయమై ఉన్న తొడలకు తుడుచుకున్నాడు. మూటను ఈటె చివరన వ్రేలాడగట్టుకుని ఈటెను భుజాన వేసుకుని నడవసాగాడు.

పల్లు కుట్టుకుంటూ ఏ చెట్టుకిందయినా కాసేపు కూచోవాలనుందతనికి. "ఇది సమయం కాదు. సుక్కపందిని ఎప్పుడు కండ్లజూస్తానో! అందాక నాకు విశ్రాంతి లేదు. పైగా ఇప్పుడు నేను సుష్టుగా భోంచేసి శక్తిని పుంజుకుని ఉన్నాను. కొంతసేపటికి మళ్ళీ ఆకలి ప్రారంభం కావచ్చు. రాత్రి గడిచేకొద్దీ నిద్ర ముంచుకురావచ్చు. లేక మరేదైన జరిగిన కర్తవ్య నిర్వహణకు అంతరాయం కలుగవచ్చు" అనుకున్నాడతడు.

## 8 .

అతడు త్వరత్వరగా నడుస్తున్నాడు. "హూచ్ హూచ్" అని నలుదిక్కులా తిరిగి అరుస్తున్నాడు. పొదలనుగుహలను గాలిస్తూ సాగుతున్నాడు.

సైరంధ్రిని కీచకుని బారినుండి తప్పించడానికై వెళ్ళుతున్న భీమ సేనునివలె అతడు వేగిరపడుతున్నాడు "వేగిరపడి సాధించగల పనికాదిది. ఇది నెత్తి బరువు కాదు దించుకోవడానికి. ఇలాంటి క్లిష్టపరిస్థితుల నెన్నిటినో నెగ్గుకొచ్చాను. "సుగాల్లో అడవి"లో తుఫానులో, జడివానలో, అమావాస్య, రాత్రిలో తప్పిపోయిన ఎనుబోతును తిరిగి పట్టుకొచ్చాను. ఈ పూటగూడా తూర్పున పటమెరిగేలోగా సుక్కపంది జాడను కనుగొంటాను. అందుకు ఒకింత అదృష్టంగా కలసిరావాలి. దేవుడు దయతలచాలి" అనుకున్నాడు ముసలివాడు.

చంద్రుడు నడి ఆకాశాన నిలిచి నల్లని వెన్నెలను కురిపిస్తున్నాడు. ముసలివాడు తలెత్తి ఆకాశంలోకి చూశాడు. ఒక పిట్ట తన సన్నటి రెక్కలను ఆడించుకుంటూ చంద్రబింబాని కడ్డంగా దూసుకుపోయింది. చంద్రగోళం నుండి వెన్నెల పరువంవలె, శోకం వలె, జ్ఞానం వలె



ఉబుకుతున్నది. చంద్రుడు తన దయానుకరణలతో అడివినంతటినీ ముంచెత్తుతున్నాడు.

బయలు ప్రదేశంలో నిల్చుని ఉన్నముసలివాడు స్వచ్ఛమైన వెన్నెలలో ప్రకాశిస్తున్న అడవిని కలయజూశాడు. "అడవి మౌనంగా స్వామికి తెలుసు. నువ్వు నీ అరచేతిలోని గీతలను చూసుకున్నంత సులువుగా స్వామి ఈ అడవిని చూడగలడు. సుక్కపందిని అతడు ప్రత్యక్షంగా చూస్తుంటాడు" అనుకున్నాడు ముసలివాడు.

ఒక నల్లటి మబ్బు గాలి పాటుకు మెల్లగా చంద్రుని వైపు సాగి వస్తున్నది. బాగా దగ్గరికి వచ్చాక ఆ మబ్బు రెండుగా చీలి, అటొక చీలిక ఇటొక చీలికగా వెళ్ళి పోయింది. చంద్రుడు తన పాటుకు తాను అవిరామంగా వెన్నెలను, చల్లదనాన్ని ఉత్పత్తిచేసి భూమిమీదకు రాలుస్తున్నాడు.

"స్వామి తలచుకుంటే నాకు సుక్కపంది ఉనికిని తెలియజేయగలడు. కాని నేను మూర్ఖుడను. అపండితుడను. నావంటి వారితో స్వామి మంతనాలు జరపడు. సూదులు గుచ్చబడిన అరచేతులమీద తలకిందులుగా నిలబడి తమ చుట్టూ పుట్టలు పెరిగిపోయేట్టుగా తపస్సు చేసేవాళ్ళకు స్వామి దర్శనమిస్తాడు, వరాలిస్తాడు."

అమృతప్రాయమైన వెన్నెలలో తడుస్తూ అతడు నిలుచున్నాడు చంద్రుడు నడి ఆకాశం మీద ఉండడం మూలాన అతని నీడ పొట్టిగా ఇసుకమీద పడుతున్నది. ఆ ఇసుక మీద పలురకాల జంతువుల అడుగులు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తూ అతడు నాలుగు అడుగులు వేశాడు. అతడు అకస్మాత్తుగా ఆగి జాగ్రత్తగా మోకాళ్ళమీద కూర్చుని ఇసుకమీద గుర్తులను పరిశీలించసాగాడు. "ఇవి పంది గిట్టలా? జింకపిల్ల గిట్టలా?" అని అతడు ఆలోచించసాగాడు. వెలుగు తక్కువగా ఇస్తున్న లాంతరు వత్తిని ఎగదోయడానికి ప్రయత్నిస్తున్నట్టు అతడొకసారి తల ఎత్తి చంద్రుని వైపు చూశాడు. పైకి లేవకుండా మోకాళ్ళమీదనే రెండు బారల దూరం సాగి మళ్ళీ పరికించసాగాడు. సూదికి దారాన్నెక్కిస్తున్న వాని ముఖంలోనూ, సగం బయటకొచ్చిన

పెయ్యి దూడను గర్భం నుండి లాగుతున్న జంతువైద్యుని ముఖంలోనూ ఉండే ఏకాగ్రత అతని ముఖంలో కనిపిస్తున్నది. ఏకాగ్రతతో అతడు కళ్లు చిట్లించుకుని, ఊపిరి బిగబట్టుకుని పరిశీలిస్తున్నాడు. ఆతురతతో అతడు మోకాళ్ళ మీద అడుగుల ననుసరించి సాగుతున్నాడు. కొంతసేపటికి అతని మోకాళ్ళు మండసాగాయి. అతడు లేచి నిలుచున్నాడు. నిటారుగా లేచి నడుస్తుంటే అడుగుజాడలు తప్పి పోవచ్చుననే భయంచేతను, అతని కంటిచూపు మరీ అంత ప్రస్ఫుటమైంది కాకపోవటం చేతను అతడు భూమికి వీలైనంత దగ్గరగా వంగి నడవసాగాడు.

మెలికలు తిరుగుతూ పారిపోతున్న పాముపిల్లను వెంబడిస్తూ అదనుచూసి పొడిచి చంపడానికై ప్రయత్నిస్తున్న అడవి కోడివలె అతడు నడుస్తున్నాడు.

అలా వంగి నడుస్తుండడం వల్ల నడుం నొప్పి పెడుతున్నది. అతడు ఈటెను ఊతకర్రవలె ఉపయోగించుకుంటూ శరీర భారాన్ని చాలా వరకు దానిపైన మోపుతూ మూడు కాళ్ళ పైన నడుస్తున్నాడు.

"ఈ అడుగులు తప్పకుండా సుక్కపందివేనని నా నమ్మకం" అనుకున్నాడు ముసలివాడు. "నేను భ్రమిస్తున్నానేమో! అయిష్టమైన సంభవం భ్రాంతిగాను, ప్రీతీ పాత్రమైన భ్రాంతి సంభవంగాను మానవునికి తోచడం కద్దు" అని మళ్ళీ అనుకున్నాడతడు.

అడుగుజాడలు దట్టంగా ఉండే ఒక గెచ్చ పొదలోకి ప్రవేశిస్తున్నాయి. ముసలివాడు తన మొలలోని కత్తిని తీసి అడ్డుగా ఉండే కొమ్మలను, తీగలను నరుకుతూ సాగుతున్నాడు. చంద్రుడు కారు మేఘాలను చీల్చుకుని వచ్చినట్లు ముసలివాడు పొదలో నుండి బయటపడ్డాడు.

"భ్రమలకు, భ్రాంతులకు ఇక్కడెవరూ లోనుకాలేదు. ఇవి నిజంగా సుక్క పంది అడుగులే. సందేహమేమీ లేదు. జింక అయివుంటే అది గెచ్చ పొదలోకి దూరి ఉండేదికాదు. పొదను గెంతి ఉండేది. లేదా చుట్టూ తిరిగిపోయి ఉండేది" అనుకున్నాడతడు అడుగుజాడలను వెంబడిస్తూ.



అతడు నడుం వంచుకుని ఒక వాగు వెంబడి నడవసాగాడు. క్రమంగా ఆ వాడు అతన్నొక కుంటలోకి తీసుకెళ్ళింది.

# 9

కుంటలో సగానికి మాత్రం నీళ్ళున్నాయి. అది మానవ నిర్మితమైనదిగాక ప్రకృతి సిద్ధమైనట్టిది. కుంట చుట్టూ రెల్లు గడ్డి విస్తారంగా పెరిగి ఉంది. రెల్లుపూత వెన్నెలలో తెల్లగా మెరుస్తున్నది. అడుగుజాడలు మోకాటెత్తు ఉన్న రెల్లు గడ్డిని దాటి నీటివద్దకు పోతున్నాయి.

"సుక్కపంది నీళ్ళు తాగేటందుకు ఇక్కడకొచ్చి ఉంటుంది. పాపం దానికి ఎంత దప్పిక అయిందో" అనుకున్నాడు ముసలివాడు.

సుక్కపంది నీటిలోకి దిగిన గుర్తులు కనిపిస్తున్నాయి కాని తిరిగి వచ్చిన జాడలు కనిపించడం లేదు. కుంటలోని నీటి మట్టంపైన చంద్రబింబం, చంద్రుని చుట్టూ ఉన్న మేఘాలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ నీటిమట్టం మీద రెల్లుపూత తేలుతున్నది. ఆరాటంతో వెదుకుతున్న ముసలివానికి నీటి మట్టం మీద ఒక కొబ్బరి చిప్ప తేలియాడుతుండడం కనిపించింది. మరుక్షణమే అతడు కత్తిని, ఈటెను కిందపడవేసి గుబిల్లున నీటిలోకి దుమికి కొబ్బరి చిప్పవైపు ఈదసాగాడు. అతడా కొబ్బరి చిప్పను స్వహస్తాలతో పంది మెడ చుట్టూ కట్టి ఉండినాడు. నెలలు నిండి కనులపండువుగా కనిపిస్తున్న సుక్కపందిని పొరుగువాళ్ళు ముక్కుపైన వేలు వేసుకుని పొగుడుతుండగా దిష్టి తగలకుండా ఉండేందుకు అతడా కొబ్బరి చిప్పను కట్టాడు.

కుంట చిన్నది కావడం మూలాన ముసలివానికి పొటుకు అది దబక లెత్తుతున్నది. అలలు ఒకదాని నొకటి తరుముకుంటూ నలువైపులకు విస్తరిస్తున్నవి.

ముసలివాడు కొబ్బరి చిప్పను దొరక బుచ్చుకుని వెనకకు ఈది గట్టును చేరాడు. సుక్కపందికి ఏదో ముప్పు వాటిల్లింది. ఈ చిన్న

కుంటలో మొసళ్ళుండడం అసంభవం. గజదొంగ లెవరైనా దానిని చంపి తిని ఎముకలను, కొబ్బరి చిప్పను నీటిలో పడవేసిపోయారేమో అని అతడు ఆలోచించసాగాడు. ఆలోచించేకొద్దీ అతని గుండె కరకర మండ సాగింది.

అతని ఈటె, కత్తి నీటి అంచువద్ద నత్తగుల్లల మధ్య అసహాయంగా పడి ఉన్నాయి. అతడు కాళ్ళీడ్చుకుంటూ వచ్చి నిస్పృహతో తన ఆయుధాల వద్ద కూర్చున్నాడు. అతడలా నిస్పృహతో తలమునకలై ఉండగా దాపున ఉన్న తాటి చెట్టులోని ఒక ఆకు టిక్కుటిక్కుమని చప్పుడు చేయడం ప్రారంభించింది. అతడు తలెత్తి చూశాడు. ఆడ గోరు వంకను పిలుస్తున్న మగ గోరువంక తోకలా తాటాకు టిక్కుటిక్కుమని ఆడుతూ ఉంది. "గాలి కూడా వీచడం లేదు మరి ఈ తాటాకు ఎందుకు కొట్టుకుంటూ ఉంది? నా అర్థం లేని ఆలోచనల పోకడలను సరిదిద్దు కొమ్మని హెచ్చరిస్తోంది కాబోలు" అనుకున్నాడు ముసలివాడు.

అతడలా తాటాకు వైపు చూస్తుండగా అతని చేతిలోని కొబ్బరి చిప్ప జారి కింద పడింది. చిప్పకు కట్టి ఉన్న దారాన్ని పరిశీలించాడు. "ఇది నూలు దారం. నేను సుక్కపంది మెడకు కట్టింది వెంట్రుక దారం" అనుకుంటూ అతడు దానిని నీళ్ళలోకి గిరాటు పెట్టాడు. "మరి నీళ్ళలోకి దిగిన సుక్కపంది ఏమైనట్టు? అని అతడు ప్రశ్నించుకున్నాడు.

"నా తెలివి మండినట్టే ఉంది.. కొబ్బరి చిప్ప కనబడగానే గుండె నీళ్ళయిపోయి నా అన్వేషణ ఆపేశాను." అనుకుంటూ అతడు కుంట చుట్టూ పంది అడుగుల కోసం వెదకడం ప్రారంభించాడు. నత్తగుల్లలను పరపరమని తొక్కుకుంటూ అతడు నీటి అంచువెంబడి నడవసాగాడు.

కొంతసేపు నడవగానే చంద్రుని వెన్నెలంతా తనమీద మెరిసినట్టు అతని ముఖం వెలిగింది. అతనికి సుక్కపంది అడుగులు కనిపించాయి. అది నీటి నుండి బయటకు వచ్చి ఈశాన్య దిశగా సాగిపోయింది. దాని అడుగులు కనబడుతన్నాయి, దాని వొంటినుండి



జారిన నీటితేమ కనబడలేదు. "తేమ ఆరిపోయింది. అంటే అది కుంటను వదిలి పెట్టి చాలా సేపయిందన్నమాట" అనుకున్నాడు ముసలివాడు. ఆ గుర్తుల మీద వానపాములు గాని, ఇతర కీటకాలుగాని పాకిన గుర్తులు లేవు. "అది ఈ కుంటను వదిలిపెట్టి మరీ అంత ఎక్కువసేపు కాలేదు" అనుకున్నాడతడు మళ్ళీ.

అతడు గబగబ వెనక్కువచ్చి కత్తిని బొడ్లో దోపుకుని, ఈటెను చేతబట్టుకుని అడుగుజాడల వెంబడి నడవసాగాడు. కొంతదూరం పోయాక అతనికొక పచ్చిక బయలు అడ్డువచ్చింది. ఏ దిక్కుగా పోవాలో పాలుపోక ముసలివాడు అలాగే నిలుచున్నాడు.

గాలి ఇప్పుడిప్పుడే మేలుకొన్నట్లు విసవిస వీచడం ప్రారంభించింది. దాపున ఉన్న బాగిమాను కొమ్మలు ఒక దానిమీదొకటి రాచుకుని కీచుకీచుమంటున్నవి. ఎండుటాకులు కిందకు రాలి పచ్చిక మీద పరుగిడుతున్నాయి.

## 10

కొంతసేపటికి అతనికి మార్గాంతరం తోచింది. అతడు బాగిమాను కిందకు నడిచి కత్తిని, ఈటెను కిందబెట్టాడు. కుందేలు మాంసం ఉన్న మూటను వాలాడు కొమ్మకు తగిలించాడు. గోచి బిగించి కట్టుకుని చెట్టెక్కడం ప్రారంభించాడు. వయసు హరించివేసిన దేహ పటిష్టతను స్వచ్ఛమైన క్రియా శీలతతో సంపాదించుకుని అతడు మాను మీద ఎగ బ్రాకుతున్నాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలను ఒకప్పుడు వదులుతూ, ఒకప్పుడు బిగబట్టుతు, శరీరంలోని కొన్ని కండరాలను బిగించుతు, మరికొన్ని కండరాలను సడలిస్తూ అతిలాఘవంగా సాగుతున్నాడు.

కొనకొమ్మ చేరేసరికి అతడు మిక్కిలిగా వగర్చుతున్నాడు. శరీరమంతా పల్చగా చెమటపట్టింది. అతడు కొమ్మమీద నిల్చుని కళ్ళతో అడవిని గాలించసాగాడు. వెన్నెలలో అడవి మనోహరంగా ఉన్నది. కుంటచుట్టూ ఉన్న రెల్లపూత ధగధగ మెరుస్తున్నది. గాలి

ప్రారంభం కావటం మూలాన కుంటలోని నీటిమట్టం అలలమయమై ఉన్నది. చంటిపాపలు తమ రొమ్ములను పీకుతుండగా మాగన్నుగ పడుకుని ఉన్న తల్లులవలె అడవిలోని మహావృక్షాలు కోతులు, పిట్టలు, ఎలుగుబంట్లు మొదలైన అడవి ప్రాణులను తమ కొమ్మలపైన తొర్రల లోపల ఉంచుకుని నిద్రిస్తున్నాయి. మోదుగ చెట్లు ఆకులన్నింటినీ రాల్చి వేసుకుని ఎర్రటి పూలు వొళ్ళంతా తొడుక్కుని యుద్ధభూమిలో క్షతగాత్రుల వలె అక్కడక్కడ నిల్చుని ఉన్నాయి. కొన్ని కోసుల దూరాన ఒక కొండ తగలబడుతున్నది. మంటలు అడుగువద్ద నుండి బయలుదేరి శిఖరం వైపు సాగుతున్నవి.

ముసలివాడు బాగి కొమ్మమీద నిలబడి అడవిని పరిశీలిస్తున్నాడు. గద్ద ఉదయాన్నే లేచి ఊరి మధ్య ఉండే చింత చెట్టు మీద కూర్చుని కుక్కితట్టల క్రింద నుండి బయటకొచ్చే కోడిపిల్లలకోసము, పెరళ్ళ నుండి గెంతుతూ వచ్చే కప్పలకోసము వెదుకుతున్నట్లు అతడు అడవిని పరిశీలిస్తున్నాడు.

క్రమక్రమంగా గాలి ఉరవడి హెచ్చుతున్నది. అది పలురకాలైన ధ్వను లను తనతో బాటు మోసుకొస్తున్నది. చెవియొగ్గి వింటున్న ముసలివానికి చిరపరిచితమైన ఒక ధ్వని వినిపించింది. అది తోటి గువ్వ తాలూకు ధ్వని. "ఈశాన్యపు దిక్కున ఎక్కడోతోటి గువ్వ అరుస్తున్నది" అనుకున్నాడతడు.

తోటి గువ్వ జిజ్ఞానువు. అడవిలో ఏ మూల ఏ వింత జరిగినా దాని దృష్టి పథంలో పడితీరవలసిందే. అది వింత జరుగుతున్న చోట చేరి విసుగూ విరామం లేకుండా అల్లరి చేస్తుంది. తాను చూసిన వింత అడివంతటికీ తెలిసేవరకు విశ్రమించదు. అడవిలో దాక్కుని ఉండే దొంగలకు పట్టియిస్తుంది. తప్పిపోయిన పెంపుడు జంతువుల ఆచూకీని తెలియజేస్తుంది. ఒక్కొక్కసారి అది హద్దులు మీరిన కుతూహలాన్ని ప్రదర్శిస్తూ ఉంటుంది. కుందేళ్ళ కోసం, నక్కలకోసం వేసిన బోనులను చూసి తన సహజ కుతూహలంతో బోను చుట్టూ తిరుగుతూ చివరకు తానే ఆ బోనులో చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకోవడం కద్దు.



ముసలివాడు సావధానంగా వింటూ ఈశాన్యపు దిక్కునుండి వీస్తున్న గాలిలో తేలివచ్చే ధ్వని తరంగాలను పరిశోధిస్తున్నాడు. "అది తోటి గువ్వే. సుక్కపంది ఆ ఈశాన్యపు దిక్కున ఎక్కడో సలుగులను ఈనేసింది. అది చూసి తోటి గువ్వ అల్లరి ప్రారంభించింది" అనుకున్నాడతడు.

అతడు ఈశాన్యపు దిక్కుగా తేలిపార జూశాడు. మరపరాళ్ళతో నిండిన లోయ సుదీర్ఘంగా, విశాలంగా కనిపిస్తున్నది. లోయ అడుగున ఒక సెలయేరు సన్నగా ప్రవహిస్తున్నది. లోయకు అవలి వైపున వెదురు పొదలు భారీ యెత్తున పెరిగి ఉన్నాయి. లోయకు ఇవతలిగట్టున ఘనమైన తీంట్ర పొదలున్నాయి. అక్కడక్కడ సుంక్రేసు చెట్లు నిల్చుని ఉన్నాయి.

క్రమక్రమంగా ముసలివానికి తోటి గువ్వ అరుపు మరింత స్పష్టంగా వినిపించసాగింది. "తోటి గువ్వ తీంట్ర పొదమీదనో, సుంక్రేసు చెట్టు మీదనో కూర్చుని ఉంటుంది. ఇక నేను చేయవలసింది చేయాలి" అనుకుంటూ అతడు చెట్టు దిగడం ప్రారంభించాడు. అతని ప్రాణలన్నీ లోయగట్టున ఉన్న తీంట్ర పొదల చెంతనే తారాడుతున్నాయి. తొడిమ వీడిన బాగికాయకన్న వేగంగా భూమి మీదకు చేరాలని ఉందతనికి. కాని తొడిమ వీడి కిందపడడానికి సిద్ధంగా ఉన్న కాయవలె అతడు పండిన వయసులో ఉన్నాడు.

తొడలు, జబ్బలు మంట పెడుతుండగా అతడు చెట్టు వెంబడి జారి కిందకు చేరాడు. కత్తిని బోడ్లో దోపుకుని, ఈటె చివరన మూటను తటిలించి భుజాన వేసుకున్నాడు. అతడు క్షణ మాలస్యం చేయకుండా ఈశాన్య దిక్కుగా నడవడం ప్రారంభించాడు.

## 11

అతడు చెట్టు మీదున్నప్పుడు వినబడినంత స్పష్టంగా పిట్టకూత ఇప్పుడు వినబడడంలేదు. సావధానంగా, దీక్షగా వింటూ అతడు

నడుస్తున్నాడు. గాలి పాటు ననుసరించి, పిట్ట కూత ఒకప్పుడు స్పష్టంగా, మరొకప్పుడు అస్పష్టంగా వినిపిస్తోంది. తదనుగుణంగా అతని నడక వేగము, ఉచ్ఛ్వాస నిశ్వాసాల లయ మారుతున్నది.

అతడు మరపరాళ్ళ లోయగట్టుకు చేరాడు. సుంక్రేసు చెట్లలో పసుపు పచ్చని పూలు వెన్నెలలో అందంగా కనిపిస్తున్నాయి. తీంట్రపొదలు బలమైన తీగలతో, వెడల్పయిన ఆకులతో భయం గొలుపుతున్నాయి. ఆ చెట్ల మధ్యగా, పొదల మధ్యగా అతడు నడవసాగాడు. రాను రాను పిట్ట అరుపులు మరింత గట్టిగా వినబడుతున్నాయి. కళ్ళతో అతడు సుంక్రేసు చెట్ల కొమ్మలను కదిలిస్తున్నాడు. తీంట్ర ఆకులను తిరగేస్తున్నాడు. కళ్ళను చెవులుగా మార్చుని, చెవులను కళ్ళుగా మార్చుకుని అతడు వెదకుతున్నాడు.

అలా కొంతసేపు నడవగా తోటిగువ్వ అతని కంటబడింది. అతడు గబాలున నేలమీద కూర్చుని, పాకుతూ ఒక బండ మాటుకు చేరాడు. తన రాక తోటిగువ్వను బెదురు పెట్టడం అతనికి ఇష్టం లేదు. అతడు బండ వెనక నుండి తొంగి చూడసాగాడు. నల్లని తోటిగువ్వ ఒక తీంట్ర పొదమీద కూర్చుని మెడను నలువైపులా తిప్పుకుంటూ, తోకను టిక్కుటిక్కు మనిపించుకుంటూ అరుస్తున్నది. పిడికెడు ప్రయాణమున్న ఆ పిట్ట అలుపూ లేకుండా యంత్రం వలె గొంతు చించుకుంటూ తన కంటబడిన వింతను లోకానికి చాటుతున్నది.

"పాపం. తోటిగువ్వ ఇలా ఎంతసేపటి నుంచి అరుస్తున్నదో" అను కున్నాడు ముసలివాడు. "దాని కంఠం సన్నగిల్లుతున్న సూచనలుగాని, శరీరం బడలిక చెందుతున్న సూచనలుగాని తోచడం లేదు. ఆ పిట్ట నా పిడికెడంత లేదు. దానికింత ఓపిక ఎక్కడిదో? అరిచేకొద్దీ దాని శరీరంలో సత్తువ పుట్టుకొస్తుంది గాబోలు" అనుకున్నాడు.

"ఓయ్ తోటోడా! అరచింది చాలు ఊరుకో. నేనొచ్చేశానుగదా. నీ బాధ్యత తీరిపోయింది. ఇక నువ్వు ఊరుకో" అనుకున్నాడు ముసలివాడు. కాని పిట్ట ఊరుకోలేదు. తోకను టిక్కుటిక్కుమని ఆడించుకుంటూ అరుస్తూనే ఉంది.



ముసలివాడు నవ్వుకున్నాడు. "ఆ గువ్వ నాకోసం అరుస్తూందనుకోవడం నా వెర్రి. ఇది ఏ ముసలివానికిగాని, ఏ సుక్కపందికి గాని సహాయపడాలనే ఉద్దేశంతో అరవడం లేదు. అది స్వలాభం కోసం అరుచుకుంటూ ఉంది" అనుకున్నాడు ముసలివాడు.

"అయితే దానికిప్పుడు ఒనగూడే స్వలాభం ఏమిటి?" అని అతడు ప్రశ్నించుకున్నాడు. "నాకు తెలియదు. బహుశ దాని పుట్టకే అంత గాబోలు. పిడికెడు నల్లని శరీరాన్ని, రెండు చీలికలుగల జానెడు తోకను, బీరగింజంతముక్కు పెట్టుకుని తోటిగువ్వగా పుట్టింది గదా - ఆ పుటకను సార్ధకం చేసుకునేందుకు అరుస్తూ ఉంది" అనుకున్నాడతడు.

ముసలివాడు బండ వెనక నుండి తొంగి చూస్తూనే ఉన్నాడు. తీంట్ర పొదపైన ఆకులమధ్య ఒక తీగపైన కూర్చుని తోటి గువ్వ "గిక్కూకు గిక్కూకు" అని అరుస్తూ ఉంది.

గాలి ఈశాన్య దిశనుండి తీంట్రపొద మీదుగా ముసలి వానివైపుకు వీస్తున్నది. తన అన్వేషణలో ఇంతసేపు కళ్ళను, చెవులను వినియోగించిన ముసలివాడు ఇప్పుడు ఘ్రాణేంద్రియాన్ని గూడా వినియోగించసాగాడు. పొదమీదుగా తన వైపు వీస్తున్న గాలులను అతడు పరీక్షించసాగాడు. కొంతసేపు గాలి వాసన పట్టి "పురిటివాసన కొడుతూ ఉంది. సుక్కపంది ఆ పొదలో సలుగల నీనేసింది" అనుకున్నాడతడు. క్షణమాలస్యం చేయకుండా తీంట్రపొదలో సలుగులదగ్గర వాలాలని ఉందతనికి. "సుక్కపంది ఈ పరిస్థితిలో రాక్షసివలె ప్రవర్తిస్తుంది. ఇప్పుడు గనక నేను దాని కండ్ల బడితే అది నన్ను చీల్చి చెండాడుతుంది. నేను గనక ఈ బండచాటు నుండి బయటి కొచ్చి ఒక్క అడుగువేస్తే చాలు, తోటిగువ్వ పొదమీద నుండి లేస్తుంది. అది ఇచ్చిన సంజ్ఞను గ్రహించి సుక్కపంది పొదలో నుండి బయటకు దూకి నామీద పడుతుంది" అనుకున్నాడు ముసలివాడు.

అతడు అసహనంతో ఉడికిపోతూ బండ వెనక నుండి తొంగిచూస్తున్నాడు. అక్కడికి తీంట్రపొద పదిబారల దూరానుంది.

"ఈ తోటి గువ్వ ఆ పొదను వదలి మరెక్కడికైనా పోయి విరగడైతే బాగుండును. కాని అది పోదు. దాని వొంట్లో ఉండే కండరాలన్నీ కరిగి ఆవిరైపోయి అస్థిపంజరం మిగిలేదాకా అది అలా అరుస్తూనే ఉంటుంది" అనుకున్నాడతడు.

"అందాక నేను తాళలేను. సలుగులను, సుక్కపందిని చూడకుండా నేను ఉండలేను" అనుకుని వేగిరపడుతూ, "కనీసం ఈ గాలిదేవుడన్నాదిశ మారితే బాగుండును" అని కోరుకున్నాడు.

కొంత సేపటికి ముసలివాని కోరిక ఫలించింది. గాలి దిశమారి నైరుతి దిక్కుగా వీచసాగింది.

అతడు తన మొలచెట్టూ ఉన్న బట్టను బిగపట్టుకుని కత్తిని, ఈటెను సర్దుకుని బండవెనక నుండి పిల్లి వలె ఇవతల కొచ్చాడు. మోచేతుల మీదను, మోకాళ్ళ మీదను ప్రాకుతూ తీంట్ర పొదవైపు సాగుతున్నాడు. చప్పుడు కలగకుండా ఉండేందుకై ఉచ్ఛ్వాస నిశ్వాసాలను మెత్తగా సలుపుతున్నాడు. నేల మీదుండే ఎండుటాకులకు తన శరీరం తగలకుండా జాగ్రత్త తీసుకుంటున్నాడు. మొలచుట్టూ ఉన్న బట్ట గాలికి రెపరెపలాడకుండా చూసుకుంటున్నాడు. ఈటె కణిక రాళ్ళకు తగలకుండా ఉండేందుకై దానిని పైకెత్తి పట్టుకున్నాడు. నీటి అడుగున చేప వలె నిశ్శబ్దంగా, గోదురు కప్పను మింగిన పాములవలె మెల్లగా తీంట్ర పొదవైపు సాగుతున్నాడు.

తీంట్రపొద ఇంకా మూడు బారల దూరాన ఉన్నది. ఇంతలో గాలిదేవుడు అతన్ని చిన్నచూపు చూశాడు. అకస్మాతుగా గాలి దిశమారి ఈశాన్య దిక్కుగా వీచసాగింది. ముసలివాడు తన గమనాన్ని ఆపి తక్షణ కర్తవ్యాన్ని గురించి ఆలోచిస్తుండగా పొదమీద నుండి తోటిగువ్వ చివ్వున గాలిలోకి లేచి తన కంఠాన్ని రెట్టింపుగా పెంచి అరవసాగింది. మరుక్షణమే సుక్కపంది పొద బయట ప్రత్యక్షమయింది. అది భయంకరంగా అరుస్తూ ముసలివాని వద్దకు శరవేగంతో వస్తున్నది.



ముసలివానికి తానేమయిపోతున్నాడో తెలియడం లేదు. భయంతో అతని శరీరము, మనసు గడ్డకట్టుకుపోయాయి. అడవిలోని కొండలన్నీ విరిగి తనమీద పడుతున్నట్లనిపిస్తున్నది. నేలమీద చెట్లన్నీ ఆకాశంలోకి ఎగిసి పోతున్నట్లు, ఆకాశంలోని మేఘాలన్నీ కిందకు రాలుతున్నట్లు అనిపిస్తున్నది. సుక్కపంది అతన్ని పడదోసి తన కోరలతో అందిన చోటల్లా గాట్లు పెడుతున్నది. భయంతో అతని నరాలన్నీ మొద్దుబారిపోయి ఉండడంవల్ల అతనికి నొప్పి తెలియడం లేదు. పచ్చటి వెన్నెద్రగడ్డిని, ఎండిన సుంక్రేసు ఆకులను నలగదొక్కుకుంటూ అతడు నేలమీద దొర్లుతున్నాడు. పంది తన వాడి కోరలతో అతని కాళ్ళ మీద, తొడలమీద జబ్బల మీద కండరాలను చీల్చుతున్నది. ఎముకలను తన పుష్టికరమైన ముట్టితో పట్టుకొని కొరికి విరచడానికి ప్రయత్నిస్తున్నది. గడ్డి మీద దొర్లుతూ, పొర్లుతూ, ఎగురుతూ పెనగులాడుతున్న మానవుడిని నుగ్గు నూచాడి చెయ్యాలనే దృఢ నిశ్చయంతో ఆ జంతువు విజృంభించింది.

ఈ చిత్ర హింస అలా ఓరంతసేపు సాగాక దాని కోరల నుండి అతడు తల్లి గర్భం నుండి వెలికి వచ్చినంత మార్మికంగా, అద్భుతంగా తప్పించుకుని దాపున ఉన్న సుంక్రేసు చెట్టును ఎగబ్రాకి కొమ్మమీద కూర్చున్నాడు. సుక్కపంది చెట్టు బోదెదాక అతనిని వెంబడించి వచ్చి మోరను పైకెత్తి భయంకరంగా గర్జిస్తూ చుట్టూ తిరగసాగింది. అది అలా గానుగెద్దు వలె వలయాకారంగా తిరుగుతుండగా చెట్టుకింద ఉన్న గడ్డి అణగారిపోయి బాట ఏర్పడసాగింది.

## 12

కొమ్మ మీద కూర్చుని వున్న ముసలివాడు, "నేనెలా తప్పించు కున్నాను. తప్పించుకోవడానికి నాకు శక్తి యుక్తులు ఎక్కడినుంచి వచ్చాయి?" అనుకున్నాడు. అతడు కిందికి చూసి "ఓయ్-సుక్కలం... ఇంక పోయి సలుగుల్దగ్గిర పడుకో. ఊరికే సుంక్రేసు చెట్టు చుట్టూ తిరిగి వొంటికి అల్త పెట్టుకోబాక" అనరచాడు.

సుక్కపంది మోర పైకెత్తుకుని చెట్టు చుట్టూ తిరుగుతూనే ఉంది.

"అది సలుగులను పొదలో వదిలి పెట్టి ఇక్కడ ఉండడం నాకేమి ఇష్టంలేదు. అది త్వరగా పొదలోకి వెళ్లి పోవాలంటే నేనేం చెయ్యాలి. ఎలుగెత్తి దానిమీద తిట్ల వర్షం కురిపించనా? ఈటెను చూపించి కండ్లు చితకబొడుస్తానని బెదిరించినా?" అని అతడు తనను తాను ప్రశ్నించు కున్నాడు. "అవన్నీ వొదిగేపనులు కావు. నేను రచ్చచేసే కొద్దీ దానికి నామీద అపనమ్మకం జాస్తవుతుంది. సలుగుల నొదిలేసి సుంక్రేసు చెట్టును ప్రదక్షిణం చేస్తూ రాత్రంతా ఉండిపోతుంది." అనుకున్నాడతడు. అతడు కొంతసేపు ఆలోచించి, "నేనుకదలకుండా మెదలకుండా రంపూరచ్చా చేయకుండా మధ్యాహ్నపుటెండలో నీటి అడుగున ఇసుక దొంది చేపలాగ ఈ కొమ్మ మీద ముడుచుకుని పడుకుంటాను" అనుకున్నాడతడు. అతడు ఈటెను పక్క కొమ్మమీద ఉంచి కాళ్ళు చేతులను మడిచి కొమ్మమీద పడుకుని "కావాలంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలను బిగబట్టి ఉంచుకుంటాను" అనుకున్నాడు.

అతని యుక్తి ఫలించింది. సుక్కపంది కొంతసేపు చెట్టు బోదె చుట్టూ తిరిగి చివరిసారిగా మోరను పైకెత్తి తెల్లని కోరలను చూపుతూ గర్జించి ముందరి కాళ్ళను నేలమీద నాలుగు సార్లు గుద్ది వెనకకు తిరిగి తీంట్ర పొదలోకి వెళ్ళిపోయింది.

చెట్టు కింద నుండి పంది తాలూకు అడుగుల సవ్వడి వినబడక పోవడంతో అతడు మెల్లగా తలెత్తి చూశాడు. సుక్కపంది తీంట్ర పొదలోకి ప్రవేశిస్తుండడం చూసి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

అప్పుడతడు తను ఇందాక గ్రహించని ఒక విషయాన్ని గ్రహించాడు. చాలా సేపటి నుండి అతని శరీరం యావత్తూ గడగడ వణకుతూ ఉంది. అతనితో బాటు అతడు కూర్చుని ఉన్న కొమ్మ కూడా కంపిస్తున్నది. ఆ కొమ్మలోని ఆకులు, పూలు కూడా కంపిస్తున్నాయి.

"నేను చాలా భయపడిపోయాను. ఈ దడ సరిగ్గా ఎప్పుడు ప్రారంభమయిందో మరి" అని అతడు ఆలోచించసాగాడు. "జ్ఞాపకం లేదు. బహుశా సుక్కపంది నా ఎదమీద నిలబడి నా మెడ చుట్టూ ముట్టెను బిగించినప్పుడు ప్రారంభమయిందేమో" అనుకున్నాడు.



ముసలివాని శరీరం ఇంకా వణకుతూనే ఉంది. శరీరాన్ని అదుపులో పెట్టటానికి అతనికి సాధ్యం కావడం లేదు. భయం అతని ఎముకలలోనికి ఇంకిపోయింది. తన పైన తనకే జాలి వేసింది ఎవరైనా తన భుజం పైన చరిచి ధైర్యవచనాలు పలికితే బాగుండుననుకున్నాడు అతడు. అతడు తలెత్తి చూశాడు. అతని పైన ఆకాశం సువిశాలంగా పరుచుకుని ఉంది. చంద్రుడు విసుగూ విరామం లేకుండా వెన్నెలను కుమ్మరిస్తున్నాడు. అసంఖ్యాకమైన నక్షత్రాలు మిలమిల మెరుస్తున్నాయి. వివిధ పరిమాణాలలో, రూపాలలో ఉన్న మేఘాలు ఏమీ తోచనట్లు తిరుగుతున్నాయి. అతనికింద భూమి ఆకాశంవలె అనంతంగా వ్యాపించి ఉన్నది. చెట్లు, కొండలు, నదులు, లోయలు ఒకదాని ఉనికి మరొకటి గుర్తించనట్లు ముడుచుకుని మౌనంగా ఉన్నాయి.

"ఇదంతా నిజంగానే జరిగిందా? సుక్కపంది నాకు నిజంగానే కనబడిందా? లేక నేను కలగన్నానా?" అని ప్రశ్నించుకున్నాడు. అతడు చెట్టుకింద కలయజూశాడు. తను పందితో పోరాడుతూ దొర్లుతున్నప్పుడు తన కిందపడి ఎండుటాకుల, పచ్చగడ్డి నలిగి ఉండడం కనిపిస్తున్నది. తన మొలనుండి జారిన కత్తి సుంక్రేసు చెట్టుకు అల్లంత దూరాన పడి ఉన్నది. పంది నడచిన బాట చెట్టుచుట్టూ వలయాకారంగా కనిపిస్తున్నది.

అతని శరీరం ఇంకా సన్నగా కంపిస్తున్నది. తొడల మీద, కాళ్ళ మీద కండరాలు చీలికలు చీలికలుగా వ్రేలాడుతున్నాయి. నెత్తురు బొట్లు బొట్లుగా కారుతూ నేల మీద ఎండిన సుంక్రేసు ఆకుల మీద పడి టప్పు టప్పు మని చప్పుడు చేస్తున్నది. గాయాలకు అంటుకుని ఉన్న ఇసుక రేణువులను అతడు వణుకుతున్న చేతులతో తుడవసాగాడు. క్రమ క్రమంగా గాయాలనుండి రక్త స్రావం తగ్గిపోతున్నది. "ఇంకెంతసేపు. గాయాలు పక్కులు కట్టేశాయంటే రక్త స్రావం ఆగిపోతుంది" అనుకున్నాడతడు.

గాయాలలో రక్త స్రావం తగ్గుతున్నది గాని ఆగడం లేదు. "ఆ గాయాలు పక్కులు కట్టడానికి చాలా సేపు పడుతుంది.

ఇవిసామాన్యమైన గాయాలు కావు. తొడలు చీలికలు పీలికలై పోయాయి. కాళ్ళు నంజర నంజరగా అయిపోయాయి. "ఇంతటి చిత్రహింస నేను ఎప్పుడు, ఎవరిచేతా అనుభవిచలేదు" అనుకున్నాడతడు.

"మరి ఇంతటి ప్రేమ నేను ఎప్పుడూ ఎవరిమీద చూపలేదు. పందిచేత కాట్లు తింటూ నేలమీద దొర్లానే గాని నడుంలోని కత్తిని గాని, చేతిలోని ఈటెను గాని, ప్రయోగించలేదు" అనుకున్నాడతడు మళ్ళీ.

ఇంతసేపు భయంవల్ల మొద్దుబారిపోయి ఉండిన నరాలు ఇపుడిప్పుడే మేల్కొంటున్నాయి. గాయాలు సలపరించడం ప్రారంభించాయి. "ఇంత నెత్తురు కారినా నాకు రణవాయువు కమ్మలేదు. నా స్థానంలో ఇంకొకడెవరైనా ఉండి ఉంటే ఈ పాటికి నీలిగి చచ్చి ఉండును. సుక్కపంది కనబడడంతో నాకు ఏనుగు నెక్కినంత సంతోషంగా ఉంది. ఈ పరిస్థితిలోఎంత రక్తం పోగొట్టుకున్నాగాని నాకు రణవాయువు కమ్మదు. యముని భటులందరూ తరలి వచ్చినా నన్ను చంపలేరు" అనుకున్నాడతడు.

"మరి ఇంతవరకు నేను సలుగులను కళ్ళ జూడనేలేదు" అనుకుంటూ ముసలివాడు ఉవ్విళ్ళూరసాగాడు. అతడు మెల్లగా కొమ్మమీద జరిగి మెడ రిక్కించి చూశాడు. తీంట్ర తీగలు నాలుగువైపులా చిక్కగా దడికట్టుకొని ఉంది. సుక్కపంది మోరను నేలమీద పడేసుకుని పడుకుని ఉంది. సలుగులు తల్లి రొమ్మును కరచుకుని పాలు తాగుతున్నాయి.

"ఓరి నీయమ్మల! సందమాంవలు మాదిరి ఎలగతా ఉండారు గదా!" అనరచాడు ముసలివాడు. దేవుడిని ప్రత్యక్షం చేసుకున్న భక్తునివలె, రత్నారాసులను పొందిన లోభివలె అతడు తత్తర పడసాగాడు. అతడు గబగబ సలుగులను లెక్క పెట్టడం ప్రారంభించాడు. లెక్కపెట్టడం మధ్యలో ఆపేసి వాటి అందాన్ని కళ్ళతో గ్రోలడం ప్రారంభించాడు. అతని కళ్ళు నిలకడగా లేవు. అతని చూపులు బంతువలె ఉన్న సలుగుల మీద, అరమోడ్పుగా ఉన్న పంది కళ్ళ మీద, చేపరించుకుని ఉన్న దాని రొమ్ముల మీద ముందునుంచి వెనక్కు వెనకనుంచి ముందుకు పరుగిడుతున్నాయి. హోరుమని మొరవ లెత్తుకుని, కట్టను ముంచడానికి సిద్ధమవుతూ దబక లెత్తుతున్న చెరువువలె అతని మనసు పొంగుతున్నది. అతడు అసంకల్పితంగా అర్థరహితంగా కొన్ని చప్పుళ్ళు చేశాడు.

"ఒకటి, రెండు–" అంటూ అతడు సలుగులను లెక్కబెట్టి, "పది. పదిమంది సుక్క నా కొడుకులు పుట్టినారు" అని పెద్దగా వికృతంగా నవ్వాడు. అతడు కూర్చుని ఉన్న కొమ్మ అదిరింది. నవ్వు ఆగాక, "పదిమంది సుక్క నా కొడుకులు పుట్టినారు. ఒరే సుక్క నా కొడుకుల్లారా! రొమ్ముల్దగ్గిరేందిరా తారుకులాడతా ఉంటారు? ఏఁవిజేస్తా ఉండాగ్రా ఆడ?" అనరుస్తూ పాటలోకి జారుకున్నాడు.

"ఏఁవిరో నీయమ్మ నాయాండ్లారా
ఏఁవి జేస్తా ఉండారు రో
పోలిగాని కూతురంట
తొలి సెవర్త ఆడిందిరో..."

ఆనంద పారవశ్యానికి లోనైనప్పుడు బూతు పాటలు పాడడం ముసలివానికి అలవాటు. ఆ పాటలోని బూతు మాటలను ఒత్తి పలుకుతూ అతడు పాడుతున్నాడు.

"------
సారి గాని పెద్ద కొడుకు
గడిసి ఎత్తి నాడురో---"

ఆ పాటలోని లయను గురించిగాని, రాగం గురించిగాని అతనికి ఖాతరు లేదు. అందులోని భావం గూడా అతనికి పట్టలేదు. తన ఆనందాన్ని ధ్వని తరంగాలుగా మార్చి బయటకు వెదజల్లుతున్నాడు. సలసల కాగుతున్న నీరు ఆవిరి రూపాన తన్నుకొచ్చినట్లు అతనిలోని ఆనందం ధ్వని రూపాన బయట కొస్తున్నది.

గొంతు రాచిపోయేదాకా అతడు పాడుతూనే ఉన్నాడు. బాగా పులిసి ఎండలో మరగ కాగినకల్లు తాగి విపరీతమైన కైపుకు

లోనైనప్పుడు అతడు చాలా అద్భుతాలు చేసేవాడు. ఒకేసారి పదిమంది కూర్చోగలిగినంత బండను భూమినుండి పెకలించేవాడు. కాడెద్దులకు అలవి గాని మోతగల బండిని అతడు జరజర లాక్కుపోయేవాడు. సాంప్రదాయ స్త్రీలు దారిన పోతుంటే వాళ్ళను పరసలు మార్చి పిలిచి తగువులు తెచ్చుకునే వాడు. పెద్ద పెద్ద గుట్టలను అవలీలగా ఈ వైపున ఎక్కి ఆ వైపున దిగేవాడు. దారి పక్కన చిన్న గులక రాళ్ళను తగిలించుకుని బోర్లపడేవాడు. నొళ్ళంతా గాయాలు చేసుకుని గుడిసెను చేరేవాడు. ఎవరైనా కడవెడు చన్నీళ్ళు నెత్తిన దిమ్మరిస్తే నేలమీద పడి మొద్దువలె నిద్రపోయేవాడు.

కాని అతడు ఈ పూట అనుభవిస్తున్న పరవశతను అతనికి ఏ పదార్థంగాని, ఎన్నడు గాని కలిగించలేదు. "కనుకనే నేను బతికాను. లేకపోతే సుక్కపందిచేత ఇన్ని కాట్లుతిని, ఇంత నెత్తురు పోగొట్టుకుని రణవాయువు కమ్మి చావకుండా బతికి ఉండేవాడినా?" అనుకున్నాడు. ముసలివాడు.

చంద్రుడింకా మబ్బుల వెనుకనే ఉన్నాడు. ముసలివాడు తలెత్తి సుంక్రేసు కొమ్మలగుండా చూస్తూ, "నువ్వేమీ బయటకు రానక్కరలేదు. ఇక్కడ తీంట్రపొదలో పది చందమామలున్నాయి. నువ్వు బయటకొస్తే ఎంత, రాకపోతే ఎంత" అనుకున్నాడు.

చంద్రుడు మబ్బులను చీల్చుకుని బయట కొచ్చాడు. "రా... వచ్చి చూసుకో. తీంట్రపొదలో నిన్ను పోలిన వాళ్ళు, నిన్ను మించిన వాళ్ళు పదిమంది ఉన్నారు" అనుకున్నాడు ముసలివాడు.

# 13

తోటిగువ్వ తీంట్ర పొదమీద వలయాలు తిరుగుతూ అరుస్తూ ఉన్నది. "ఓరి నీయమ్మ. నిన్ను మరచే పోయినాను గదరా. నువ్వు ఆనవాలు చూపించి పుణ్యం కట్టుకోకుండా ఉండి ఉంటే నేను సుక్కపందిని కండ్లజూసి ఉండేవాడినికాను. రాత్రి తెల్లవార్లూ అడవిలో తిరుగుతూ గడిపి ఉండేవాడిని. నీ మేలు జన్మలో మరచిపోను.



నీకెప్పుడైన అవసరమొస్తే చెప్పు, ఇంతకు రెండింతలుగా నీకు సహాయం చేస్తాను" అనుకున్నాడు ముసలివాడు.

తోటిగువ్వ "గిక్కూకు గిక్కూకు"మని అరుస్తూ తీంట్రపొదకు, సుంక్రేసు చెట్టుకు మధ్య గాలిలో వలయాలు తిరగసాగింది. అది చివ్వుమని పైకిపోతూ, మళ్ళీ దిగుతూ, పల్లటీలు కొడుతూ, వలయాలు తిరుగుతూ సందడి చేస్తున్నది. అది తన గొంతుకుగాని, రెక్కలకు గాని క్షణం పాటు కూడా విశ్రాంతి నివ్వడం లేదు.

"ఈ తోటిగువ్వకు నేను ఏ విధంగా సహాయం చేయగలను?" అని ముసలివాడు ఆలోచించసాగాడు. "ఉరులు వేసి పట్టి దానిని ఇంటికి తీసుకెళ్ళగలను. పంజరంలో ఉంచి పెంచుకోగలను. మామిడి ముట్టిలో అనుదినం నీళ్ళు పెట్టగలను. పంజరపు ఊచల గుండా ధ్యాన్యాన్ని, చెదపురుగులను చల్లి దానిని పోషించగలను" అనుకుంటూ అతడు పథకాలు వేయసాగాడు.

"అలా చేయడం ద్వారా తోటి గువ్వకువొనగూడే దేమిటి? నేను అల్లి ఇచ్చే పంజరం కన్న పదిలమైన చెట్టుతొర్రలు ఈ అడవిలోచాలా ఉన్నాయి. నేను మామిడి ముట్టిలో అందించే నీటికన్ను స్వచ్ఛమైన నీళ్ళు ఇక్కడ దొరుకుతాయి. ఇక దానికి కావలసిన ఆహారం పుష్కలంగా ఈ అడవిలో లభిస్తుంది. ఏ విధంగా ఆలోచించినా, ఈ పిట్టకు నేను చేయగల సహాయం ఏదీలేదు" అనుకున్నాడతను.

"ఇది చాలా దురదృష్టకరం.. నాకు చేదోదు వాదోడుగా నిలిచిన పిట్టకు నేనేవిధంగానూ, ప్రత్యుపకారం చేయలేకపోవడం చాలా దురదృష్టకరం. నేను దానిని చంపక వదిలి పెట్టడమే దానికి చేయగల ఉపకారం. పక్షికిగాని, జంతువుకుగాని మానవుడు చేయగల మహోపకారం - వాటి మానాన వాటిని వదిలిపెట్టడమే. వాళ్ల మధ్య ఉన్న సంబంధబాంధవ్యాలు అటువంటివి" అనుకున్నాడతడు చేదు కాయను నమిలినవాడివలె.

"అలాగనుకోవటం పొరబాటు. ఇప్పుడు నేను సుక్కపందికి రక్షణ ఇస్తున్నాను కానా. దీని రక్షణ కోసమే గదానేనీ అడవిలో చెట్టుమీద పడి ఉన్నది" అనుకున్నాడతడు చేదు కాయను ఉమ్మివేయదానికి ప్రయత్నిస్తున్నట్టు.

"నువ్వు అచ్చంగా అందుకోసం ఇక్కడకు రాలేదు. సుక్కపందిని నువ్వు కాపాడేదేమిటి? అది భీమసేనునివలె పరాక్రమించగలదు. అది ముట్టితో కొట్టిందంటే పచ్చి బండలు నెరియలు చీలిపోగలవు. ఐనప్పటికీ దానికి నా అవసరం చాలా ఉంది. అదిప్పుడు పురుడు తీర్చుకుంటూ ఉంది. అతి సుకుమారమైన సలుగులను పదింటిని కని చాలా బలహీనతకు, అసహాయతకులోనై ఉంది. ఈ అడవిలో నీచాతి నీచమైన మృగాలు చాలా ఉన్నాయి. ఈ మృగాల బారినుండి దానిని, దాని సలుగులను నేనురక్షించాలి" అని ఆలోచిస్తూ అతడు తన రాకను సమర్థించుకున్నాడు.

సుక్కపంది ఇంకా అలాగే పడుకుని ఉంది. సలుగులు దాని రొమ్ములను పీకుతున్నాయి. "నిశ్చితంగాపడుకో. నిన్నూ, నీ సలుగులను కంటికి రెప్పవలె, వ్రేలిని గోరువలె నేను కాపాడుతాను. మీరు నిర్భయంగా ఉండండి. ఈ ముసలివాడు కాపాడేదేమిటని అనుకోకు. నీకుండే కండలు, కోరలు నాకు లేకపోవచ్చు. కాని నా తలలో ఉండే యుక్తులు నీ తలలో లేవు. నా శరీరంలో ఉండే లాఘవం నీ శరీరంలో లేదు. పైగా నా చెంత ఈటె ఉన్నది" అనుకున్నాడతడు.

తోటిగువ్వ అరవటం మానేసి చివ్వన కిందకు వాలి పచ్చిక మీద కూర్చున్నది. చల్లని వెన్నెలలో వరుసగా నడుస్తున్న చెదపురుగులను అది పొడుచుకుతినడం ప్రారంభించింది. చెదపురుగులు చెల్లా చెదరై గడ్డి రిళలకింద, గులక రాళ్ళ క్రింద దాగుకొనసాగాయి. కొంత సేపటికి తోటి గువ్వకు కడపు నిండింది. అది దాపున ఉన్న గుండుకేసి తన ముక్కును రాచుకుంటూ తుడుచుకున్నది. తరువాత భారంగా గాలిలోనికి లేచి రెక్కలు కొట్టుకుంటూ వెళ్ళి పోయింది. అలా వెళ్ళిపోతున్న పిట్టను చూస్తూ ముసలివాడు, "నీళ్ళు తాగి రావడానికి కాబోలు వెళుతున్నది" అనుకున్నాడు.

"రేపు ఇంటికి వెళ్ళిన తరువాత ఈ సుక్కపందిని, సలుగులను ఎక్కడుంచాలి?" అని అతడు ఆలోచించసాగాడు. "ఇప్పుడున్న దొడ్డిలో మిగతా పందులతో బాటు ఈ సుక్కపందిని, దాని సలుగులను



ఉంచడానికి వీలుపడదు. ప్రత్యేకంగా ఒక దొడ్డి కట్టాల్సిందే. కాని దొడ్డి కట్టడం కేవలం మాటలతోనే అయిపోయే పనికాదు. ఇటుక రాళ్ళు కావాలి. ఎర్రమన్ను కావాలి. తాటి మట్టలను కొట్టుకొచ్చి బండల కింద అణగబెట్టాలి. కలబంద మట్టలను కొట్టుకొచ్చి మురగవేసి నార తీయాలి. తీరా దొడ్డి తయారయ్యేసరికి కనీసం ఇరవై రోజులవుతుంది. అంతవరకు అవి ఎండలో, వానలో అలమటించాల్సిందేనా?" అని అతడు దీర్ఘంగా ఆలోచించసాగాడు.

కొంత సేపాలోచించగా అతనికి మార్గాంతం తోచింది. "ఎండలో వానలో అలమటించాల్సిన ఖర్మ వాటికే మొచ్చింది. వాటిని నేరుగా తీసుకుపోయి నా గుడిసెలోనే దింపుతాను. అవసరమైనంత కాలం అవి నాగుడిసెలోనే ఉంటాయి. అందాక నేను, పిల్లవాడు గుడిసె ముందున్న సిగర చెట్టుకింద పడుకుంటాం. ఎక్కడున్నా మాకు పొద్దుపోతుంది" అనుకున్నాడతడు.

చెదిరిపోయి ఉండిన చెదపురుగులు తిరిగి వచ్చి వరుసగా నడవసాగాయి. అవి ఇసుక రేణువులను ఎక్కి దిగుతూ, పూచిన పుల్లల కింద దూరుతూ సాగుతున్నాయి.

దాహం తీర్చుకుని తోటిగువ్వ తిరిగొచ్చింది. కొత్తగా ఈనిన ఆవు తన లేగను చూసుకునేందుకు వస్తున్నట్టు అది అరుస్తూ వచ్చింది. నేరుగా వచ్చి తీంట్ర పొదమీద కూర్చుని అరవడం ప్రారంభించింది.

"తోటోడు సలుగులకు లాలి పాడుతున్నాడు" అనుకున్నాడు ముసలివాడు. చంద్రుడు పాల వెన్నెల కురిపిస్తున్నాడు. గాలి చల్లగా వీస్తున్నది. "అంతా సలుగుల కోసమే. నేను ఈటెను పక్కన పెట్టుకుని సుంక్రేసు చెట్టుమీద కూర్చుని ఉండడం గూడా సలుగుల కోసమే" అనుకున్నాడతడు.

"ఈ పూట నాకు చాలా ఆనందంగా ఉంది. నోట్లో చక్కెర పోసినట్టుగా ఉంది. కడుపులో పాలు పోసినట్టుగా ఉంది. ఉదయంలేచి ఎవరి ముఖం చూశానో మరి" అనుకున్నాడతడు.

ఈ రోజు తాను నిద్రలేస్తూనే చూసిన ముఖాన్ని అతడు జ్ఞాపకానికి తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. పై పంటితో క్రింద

పెదవిని కొరుక్కుంటూ, తల వెనక భాగాన వ్రేళ్ళతో గోక్కుంటూ అతడు ఆలోచించసాగాడు. ఎంత ప్రయత్నించిన అతనికి జ్ఞాపకం రాలేదు.

"బహుశ పిల్లవాని ముఖం చూసి ఉంటాను. కాదు కాదు వాడు నాకంట బడింది పొద్దు నాలుగు బారలెక్కినాకనే." అని అతడు అభిప్రాయపడ్డాడు. పిల్లవాడు పొరుగూర్లో వీధి నాటకాన్ని చూడడానికై వెళ్ళి ఉండినాడు. నిద్ర లేకపోవడం వల్ల ఎర్రనైన కళ్ళతో, వాడిపోయిన ముఖంతో వాడు పొద్దు నాలుగు బారలెక్కినాక కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు.

"మరయితే ఇంకెవరి ముఖం చూశాను." అని ముసలివాడు ఆలోచించసాగాడు. అతని గుడిసె గ్రామం వెలుపల విసిరివేయబడినట్టుగా ఉన్నది. ఉదయాన్నే నిద్రలేచి గ్రామస్థులెవరైనా ముసలి వాని గుడిసెకు రావడం కల్ల. ముసలివాడు ప్రముఖుడు కాదు. అతడు ఎవరి తలలోనూ నాలుక కాదు. ఎందులోనూ కీలకపాత్ర లేదు.

ఆలోచిస్తూ ఉండిన ముసలివాడు చేతి వ్రేళ్ళతో నుదుటి మీద కొట్టుకుని, "నామతి మండినట్టే ఉంది. నేను ఉదయం లేచి చూసింది సుక్కపందినే. భూజాన ఉన్న గొర్రె కోసం గొల్లవాడు అడవంతా వెదికినట్టుంది నా వ్యవహారం" అనుకున్నాడు.

ఉదయం లేవగానే అతడు మొదటి సారిగా చూసేది తన పందులనే. రాత్రి పడుకోబోయే ముందు చివరిసారిగా చూసుకునేది గూడా పందులనే. ఉదయం నుండి సాయంత్రం దాక అతడు జీవించేది పందులతోనే. సందెవేళ నుండి తెల్లవారేదాక అతడు కలలు గనేది గూడా పందులను గురించే.

ముసలివాడు మళ్ళీ అనుకున్నాడు."నా నోట్లో చక్కెర పోసినట్టుంది. కడుపులో పాలు పోసినట్టుంది." నెత్తిన కిరీటమున్నట్లు భూజాలకు భుజకీర్తులున్నట్లు అతనికి అనిపిస్తోంది.



# 14

సగం రాత్రయింది. బిలిబిత్రి పూలు వికసించడం ప్రారంభించాయి. ఆ పూల తాలూకు వాసన గాలిలో తేలివస్తున్నది. పచ్చటి పాచిలో చుట్టుకుని ఉన్న నత్తల వలె ఉండిన బిలిబిత్రి పూలు కొద్ది కొద్దిగా వికసిస్తూ తెల్లటి, ఎర్రటి రెక్కలను చూపిస్తున్నాయి. రంగు రంగుల రెక్కలుగల పూలతో నిండిన పచ్చిక బయలు శోభాయ మానంగా తయారవుతున్నది.

"ఇక నేను జాగ్రత్తగా ఉండాలి. అడవిలో క్రూర మృగాలు వేటకు బయలుదేరే సమయమయింది. పైగా ఇది చిత్రి నెల" అనుకున్నాడతడు.

నక్కలు, తోడేళ్ళు మొదలైన వాటికి వేసవి ఈత కాలం. పిల్లల్ని కనడానికి సిద్ధంగా ఉన్న నక్కలు, పురుడు పోసుకుంటున్న నక్కలు తమ తమ గుహలను వదిలిపెట్టి రాకుండా ఉంటాయి. తమను తామ పోషించుకోవడమే గాక తమ భార్యలను కూడా పోషించవలసి ఉన్నది గనుక మగ నక్కలు ఈ ఋతువులో రెట్టింపుగా ఆహారన్వేషణ సాగిస్తాయి. ఈ అన్వేషణలో అవి ఎంత సాహసానికైనా పూనుకుంటాయి. ఎంతటి నీచానికైనా వొడిగట్టుతాయి. "సమయా సమయాలే గదా ప్రాణుల ప్రవర్తనను శాపించేది." అనుకున్నాడు ముసలివాడు.

గాయాల మయమై ఉన్న అతని తొడలు, కాళ్ళు నొప్పి పెడుతున్నాయి. గాయాల మీద పక్కులు కట్టి రక్త స్రావం ఆగిపోయింది. పక్కులు కట్టడంతో బాధ ఎక్కువయింది. అతడు కొమ్మల మీద అటు ఇటు కదిలినప్పుడు పుట్టే బాధను నిభాయించుకొనడానికి పండ్లు కరుచుకున్నాడు. అతడు వ్రేళ్ళతో తొడలను తడిమి చూసుకున్నాడు. అతడు వ్రేళ్ళతో తొడలను తడిమి చూసుకున్నాడు. గడ్డలు కట్టిన నెత్తురు అతని చేతి వేళ్ళకు అంటుకున్నది. దాని వాసన గుప్పున వీచింది. అతడు తన రక్తాన్నెప్పుడూ వాసన చూడలేదు. మరి ఏ మానవుడి రక్తాన్ని గాని వాసన చూడలేదు. కాని లెక్కలేనన్ని జంతువుల రక్తాన్ని వాసన

చూశాడు. అతడు చేతులను కొమ్ములను తడుచుకుంటూ, "మనిషి రక్తానికి జంతువుల రక్తానికి తేడా ఏమీలేదు. కనీసం పంచేంద్రియాలు గ్రహించగల తేడా ఏమీలేదు" అనుకున్నాడు.

మూకుడు కింది పాత్ర పొంగుతున్నట్టు పక్కుల కింద గాయాలు సలపరిస్తున్నాయి. "ఈ పక్కులు ఇంత త్వరగా కట్టకుండా ఉంటే బాగుండును. మరి ఆ పక్కులు కట్టకుండా ఉండి ఉంటే రక్త స్రావం ఆగి ఉండేది కాదు. ఈ పాటికి రణవాయువు కమ్మి చచ్చి ఉండేవాడిని. దేవుడు అన్నిటికీ అన్ని సదుపాయాలు అమర్చి ఉంచాడు. అతడు కొందరికి బాధ రూపంలో వరాలిస్తాడు" అనుకున్నాడతను.

"మరి ఈ పూట నా నిద్రమాటేమిటి?" అని అతడు ప్రశ్నించుకున్నాడు. "ఈ పూట నేను నిద్రపోవడమన్నది అప్రస్తుతమైన విషయాలలో కల్లా అప్రస్తుతమైనది. నేను యుద్ధభూమిలో ఉన్నాను. శత్రువులను ఎదుర్కొనడానికి నేను •అప్రమత్తతలో ఉండాలి." అనుకుంటూ అతడు చేయి చాచి పక్క కొమ్మ మీదున్న ఈటెను అందుకోబోయాడు. అతడాలా కదలగానే తొడలు కత్తితో కోసినట్టు బాధ పెట్టాయి. అతడు పండ్లు కరచుకుని చేయి వెనక్కు తీసుకున్నాడు. "ఒంటినిండా ఇన్ని గాయాలుండగా నాకు నిద్ర మాత్రం ఎలా వస్తుంది. కనీసం ఒక దుత్త కళ్ళు తాగితేగాని ఈ గాయాలు మరపుకు వచ్చి కంటిమీద రెప్పపడదు." అనుకున్నాడతడు.

"అసలు నేను నిద్రపోవడానికై ఈ అడవికి రాలేదు. కుత్తుక దాక కల్లుతాగి, కాళ్ళు చాపి పడుకుని గుర్రు పెడుతూ నిద్రపోవాలని ఉంటే నేను గుడిసెలో ఉండేవాడిని. నేనిక్కడకు సుక్కపందికి కాపలా కాసేందుకు వచ్చాను. నేను దాని క్షేమాన్ని గురించి ఆలోచించాలి. దానికి నిద్ర ముంచుకొస్తుందేమో" అనుకుంటూ ముసలివాడు తీంట్ర పొదలోకి చూశాడు.

సుక్కపంది మోరను చాపుకుని, ముట్టెను, కండ్లు మూసుకుని ఉంది. కొన్ని సలుగులు పాలు తాగుతున్నాయి. మిగిలినవి దాని కాళ్ళ మధ్య తారాడుతున్నాయి. ప్రపంచంలోని తృప్తి సర్వమూ దాని ఆకృతిలో కన్పట్టుతున్నది. "దాని మనసులో సంతోషము అవడి నెలలో



గాలివలె సందడి చేస్తుండగా దానికి నిద్ర మాత్రం ఎలా వస్తుంది. దాని ఆనందానికి, నా ఆనందానికి ఎవరూ భగ్నం కలగజేయకుందురు గాక" అనుకున్నాడు ముసలివాడు.

నిద్ర మేలుకుని ఉండడం అతనికి కొత్తేమీ కాదు. భీమునికి సంబంధించిన ఘట్టాలుండే వీధి నాటకాలు జరుగుతుంటే అతడు రాత్రి పొడవునా మేలుకుని ఉండి చూస్తాడు. ఆ నాటకాలు ఎంత దూర గ్రామాల్లో జరుగుతున్నా సరే అతడు వెళ్లి వస్తాడు. వివిధ ఘట్టాలలో భీముడు పాడే పాటలను అతడు కంఠత నేర్చుకున్నాడు. అతడు తాదాత్మ్యం చెందే విషయాలు ఇంకా చాలా ఉన్నాయి. ఆకాశంలో గంభీరంగా నడయాడే నల్లని మేఘాలు, ఫెళ పెళార్భాటాలతో దూసుకువచ్చి గండశిలలను చీల్చే పిడుగులు, గూఢంగా దృఢంగా నిలుచుని ఉండే పర్వతాలు - ఇవన్నీ పితృదేవతల వలె తనను దీవిస్తూ గమనిస్తూ ఉన్నట్లు అతడు భావిస్తాడు. అతడు లయించిపోయే ప్రాణి సుక్కపంది. పటిష్టమైన దాని దేహనిర్మాణాన్ని, శత్రువు పైకి ఉరికేటప్పుడు దాని దూకుడులోని ఉరవడినీ అతడు గురుభావంతోను, మరొకప్పుడు వాత్సల్యంతోను చూస్తుంటాడు.

# 15

చల్లని వెన్నెలలో బిలిబిత్రి పూలు తమ సువాసనలను, సొగసులను వెదజల్లుతున్నాయి. "నడిరేయి మీరుతున్నది. శత్రువులు నిజంగానే వస్తారా?" అని అతడు ప్రశ్నించుకున్నాడు. "ఈ అడవిలో లెక్కలేనన్ని గుహలున్నాయి. పొదలున్నాయి. వాటిలో నక్కలు, తోడేళ్ళు, చిరుతపులులు ఉన్నాయి. అవి తమలో రక్తపిపాస పొంగుతుండగా, వాడియైన కొరతతో, పుష్టికరమైన పంజాలతో బయలుదేరుతాయి. బలహీనులను, అసహాయులను అవి వేటాడి చీల్చి చెండాడుతాయి. ఆ రక్త మాంసాలతో తమ భార్యలను, సంతానాన్ని పోషించుకుంటాయి" అనుకున్నాడతడు.

తోటిగువ్వ తీండ్ర పొద మీద కూర్చుని అరుస్తూ ఉంది. "అలా అరుస్తూ ఉంటే దానికి విసుగులేదేమో గాని వినడానికి నాకు విసుగ్గా ఉంది" ముసలివాడు తల తిప్పుకున్నాడు.

అతడలా తల తిప్పుకున్నప్పుడు మరపరాళ్ళ లోయలో అతనికొక గుంటనక్క కనిపించింది.

"ఆఁ! నక్కపోతూడొచ్చేసినాడు!" అన్నాడు ముసలివాడు.

లోయలో రెండు మరపరాళ్ళ మధ్య గుంటనక్క నిలుచుని ఉంది. మోరను పైకెత్తి గాలిలో వాసన పట్టుతున్నది. అలా కొంతసేపు వాసన పట్టి ఒక దృఢ నిశ్చయానికి వచ్చినట్లుగా బయలుదేరింది. లోయ మధ్య పారుతున్న సెలయేరును చెంగున దాటింది. అది లోయను ఎక్కుతున్నప్పుడు కాసేపు ముసలివాడికి కనిపించలేదు. గట్టు ఎక్కాక మళ్ళీ కొంతసేపు గాలిలో వాసన చూసి, అడుగులో అడుగేసుకుంటూ తీండ్రపొద వైపు బయలుదేరింది.

"ఓరినీయమ్మ! లోబి నాకొడకా. లిబ్బి పూడ్చి పెట్టి నట్టుగా నేరుగా వస్తాఉండావుగదరా" అనుకున్నాడు. అతడు దాని పోకడలన్నీ గమనిస్తున్నాడు. "తెలివిలో గుంటనక్కకు మించింది లేదు. గాలిలో వాసన పట్టుతూనే నూరామడల కవతల ఏమి జరుగుతున్నదీ అది గ్రహించగలదు. యుక్తులలో దాని పడగొట్టేవాడు లేడు" అనుకున్నాడతడు.

నక్క యుక్తులను గురించి అతనికి క్షుణ్ణంగా తెలుసు. అది నంద్రకాయల బొరియలలో తోకను జొనిపి తిప్పి, సంద్రకాయను బయటకు రప్పించే వైనం, పొలం వద్ద కాపలా ఉన్న రైతులను ఏమార్చి చెరుకు గడలను, వేరు శనగ కాయలను కాజేసే వైనం, అవసరమొచ్చినప్పుడు అది తన శరీరాన్ని గుండ్రాయి పరిమాణంలోకి కుదించుకుని నాగేటి చాలులో దాగుకునే వైనం అతనికి బాగా తెలుసు.

"యుక్తులను అడ్డం పెట్టుకుని బతకమని బ్రహ్మదేవుడు దాని నుదుట రాశాడు"అనుకన్నాడు.



గుంట నక్క బిలిబిత్రి చెట్ల మధ్య నడుస్తూ తీండ్ర పొదవైపు సాగుతున్నది. పొదసమీపించే కొద్దీ అది మెల్లగా అడుగేసుకుంటూ నడుస్తున్నది.

"రారా లోబి నా కొడకా." ఎక్కడ పుట్టి ఎక్కడ పెరిగితివో? ఈ తీండ్ర పొద దగ్గర నీకు చావు రాసిపెట్టివుంది." అనుకుంటూ ముసలివాడు ఈటెను కుడిచేతిలోకి తీసుకున్నాడు. గుంటనక్క తన కళ్ళను తీండ్ర పొదపైన నిలిపి ఏ మాత్రం చప్పుడు చేయకుండా నడుస్తూ పొదను సమీపిస్తున్నది. శరీరాన్ని విల్లులావంచి, కండరాలన్నిటినీ బిగించిపొదలోకి దూకటానికి సిద్ధమవుతున్నది. "దేవుడ్ని తలుచుకోరా లోబి నాకొడకా" అనుకుంటూ ముసలివాడు ఈటెను పైకెత్తి దాని రొమ్ముకు గురి చూసి వదలబోయాడు. ఇంతలో సుక్కపంది పొదలో చెంగుమని మెరుపుతీగ వలె ఎగిరింది. పొదలో ఎగిరిన ఎగురు నక్కవీపుమీద దిగింది. దిగీ దిగగానే తన కోరలను దాని జబ్బలలోనికి దించింది. నక్క మోకాళ్ళను వంచి నేల కూలింది. సుక్కపంది తన భయంకరమైన కోరలను దాని మెడ చుట్టూ దించి పీకతెంచేసింది. కంఠం నుండి రక్తం నలువైపులకు చిమ్ముతుండగా గుంటనక్క గడ్డిపైన దొర్లసాగింది. అందిన చోట్లల్లా దానిని తన కోరలతో చీలుస్తూ సుక్కపంది వీర విహారం చేయసాగింది.

సుంక్రేసు చెట్టు మీద కూర్చుని ఉన్న ముసలివాడు "అదిరా సుక్కలం...! అదీ!!" అనరచి వికటాట్టహాసం చేస్తూ నవ్వసాగాడు.

చచ్చిపడివున్న నక్క చుట్టూ సుక్కపంది మొరుస్తూ కొంత సేపు చూసింది. దానితల వద్ద ఆగి తన ముట్టి మీదున్న నెత్తురును నాలుకతో తుడుచుకుంటూ నిలుచున్నది. నక్క కదలడం జరుగుతుందేమోనని కొంతసేపు నిశితంగా, క్రూరంగా చూసి వెనకకు తిరిగి తీండ్ర పొదలోకి వెళ్ళి పోయింది.

చెట్టుమీదున్న ముసలివాడు ఇంకా నవ్వుతూనే ఉన్నాడు. నవ్వును ఆపుకోవాలనే స్పృహ గానీ, ఆపుకోవలసిన అవసరంగాని అతనికేమీ లేదు. అతడు సుఖదుఃఖాలకు అతీతుడు కాడు. వోటమి కలిగినప్పుడు దుఃఖపడకుండా ఉండడము, విజయం కలిగినప్పుడు సంతోషించ

కుండా ఉండము అతనికి చేతకాదు. నవ్వితే నవ్వినంత చేటు కలుగుతుందని ఆలోచించడానికి అతడు నిరాశావాది కాడు. ఈ ఆనందం క్షణికమని జ్ఞాపకం చేయడానికీ, ఈర్ష్యతో ముఖం ముడుచుకోవడానికీ ఈ అడవిలో మరొక మానవుడు లేడు. పైగా ఈ శకునాలను, శాస్త్రాలను గురించి,, ముందు వెనుకలను గురించి ఆలోచించుకునేందుకు అనువైన స్థితిలో అతడు లేడు.

తొడల మీద గాయాలకన్న ఎక్కువగా పొత్తి కడుపు మీద కండరాలు నొప్పి పెట్టేవరకు అతడు నవ్వాడు. నవ్వును సంబాళించుకుంటూ ఈటెను పక్క కొమ్మమీద ఉంచాడు.

నీటిమట్టం తీసిపోయాక కొలను అడుగున ఉన్న రాళ్ళు బయట పడినట్లు, ముసలివాని వికటాట్టహాసాలు ఆగిపోయాక తోటిగువ్వ అరుపు వినిపించసాగాయి.

"ఎక్కడున్నావురా తోటోడా!" అనుకుంటూ ముసలివాడు చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో ఎక్కడా ఆ పిట్ట కనిపించలేదు. కాని దాని అరుపులు మాత్రం యాథాప్రకారం వినిపిస్తున్నాయి.

"సుక్కపంది నడిపిన భీభత్సాన్ని చూసి తోటివాడు జడుసుకుని ఎక్కడో దాక్కున్నాడు గాబోలు. ఎంత భయపడినా సరే, నాలుకను కత్తిరించి పారేసినాసరే అరవడం మాత్రం మానడు. నేనీ సుక్కపందిని తీసుకుని అడవి వదలి వెళ్ళి పోయేవరకు అరుస్తూనే ఉంటాడు. వాని పుట్టకే అంత" అనుకున్నాడు ముసలివాడు.

తీంట్ర పొద దాపున నక్క శవం పడి ఉన్నది. ప్రేవులు బయటికొచ్చి పచ్చగడ్డి మీద పడి ఉన్నాయి. తెగిన కంఠం నుండి వచ్చిన రక్తపు నురగ ఎత్తుగా కనిపిస్తున్నది. నురగలోని బుడుగులు ఒక్కొక్కటే గాలకి పగులుతున్నాయి.

ఇంతటి భీభత్సాన్ని నడిపిన సుక్కపంది తీంట్ర పొదలో నిర్మలంగా పడుకుని ఉంది. సలుగులు తన శరీరాన్ని తొక్కుతూ రొమ్ములను పీకుతుండగా, మోరను నేలపైన పడవేసుకుని అరమోడ్పు కన్నులతో పడుకుని ఉన్నది. అప్పుడప్పుడు నాలుకతో ముట్టెను తుడుచుకుంటున్నది. "చూడడానికి అది ప్రశాంతంగా పడుకుని



ఉన్నదేగాని దాని ఎదలో ఉద్రేకం పొంగుతున్నది. రాక్షసుని సంహరించిన నరసింహుని వలె అది జ్వలిస్తున్నది. కాని ఏ ఉద్రేకాన్ని గాని, ఏవికారాన్ని గాని అది పైకి తెలియనియ్యదు. సముద్రం వలె, భూమి వలె, పర్వతం వలె, మేఘం వలె అది గంభీరమైనది. ఆ గంభీరతయే దాని సొగసు, దాని హంగు" అనుకున్నాడు ముసలివాడు.

సుక్కపంది డొక్కలు మెల్లగా కంపిస్తున్నవి. దాని కళ్ళలో నీళ్ళు, ముఖంలో దైన్యము కదులాడినట్లుగా ముసలివానికి అనిపించింది. "తాను నెరసిన హింసాకాండను తలచుకుని సుక్కపంది పశ్చాత్తాప పడుతుందేమో. కాని అది జరిపింది హత్య కాదు, యజ్ఞం" అనుకున్నాడతడు.

సుక్కపంది చెవులను టపటపలాడించింది.

"నంద్రకాయలను తిని బతికే లోభి వెధవ నిన్ను దోచుకోవడానికి వస్తే నువ్వు ఊరుకుంటావా? నువ్వు వాని పీకను తెంచకుండా ఉంటే, వాని పేగులు తియ్యకుండా ఉంటే నేను గొంతు పిసుక్కుని చచ్చి ఉందును. నువ్వు వానికి లొంగిపోయి వుంటే ఆ భీమసేనుడు, మేఘాలు, పర్వతాల, సలిపిడుగు అన్నీ అవమానంతో చిన్నబోయి ఉండును" అనుకున్నాడతడు.

నల్లమందు నాటు పెట్టి కాల్చగా గండశిల ఎగిరినట్లు సుక్కపంది తీంట్ర పొందలో నుండి ఎగరడం, మెరుపు వలె నక్కమీద దూకడం, చలిపిడుగు భూమిని చీల్చినట్టు అది తన కోరలతో నక్కను చీల్చడం అతడు మననం చేసుకున్నాడు.

అతడు మెచ్చుకోలు దృఃఖులతో సుక్కపంది వైపు చూస్తూ, "నీకేదైనా పారితోషికం ఇవ్వాలని ఉంది. ఏమి కావాలో కోరుకో" అనుకున్నాడు. సుక్కపంది మౌనంగా పడుకుని తోకను నేలమీద కొడుతున్నది. "నీకు ఏమి కొరత ఉన్నది గనుక. చందమామల వంటి సలుగులు పది ఉన్నాయి నీకు. ఇంత నిండార్లుగా వరాలు పొందిన ప్రాణి ఈ భూ ప్రపంచంలో మరిలేదు" అనుకున్నాడతడు.

అతడు తన చూపులను సుక్కపంది మీద నుండి మరల్చుకోలేదు. "నీలో లీనమైపోవాలని ఉంది. నీ చెంత కొచ్చి కూర్చుని నా చేత్తో నీ శరీరాన్ని తడమాలని ఉంది. కాని నువ్వు నన్ను దరిజేరనియ్యవు. నువ్వు మూర్ఖుడవు. తన, పర అని తెలుసుకోలేని అజ్ఞానుడవు. కాని నీవు వీరుడవు. మెరపువలె ఎగరగలవు. పిడుగువలె చీల్చగలవు" అనుకున్నాడతడు.

అతడు దీర్ఘంగా నిట్టూర్చి, "నీకు కానుక లేవీ ఇవ్వలేకపోయాను గనుక, నిన్ను నా చేత్తో నిమరలేకపోయాను గనుక, నిన్ను గురించి ఒక పాట పాడతాను" అనుకుని ముఖాన్ని ఆకాశానికెత్తి పాటను జ్ఞాపకం చేసుకోసాగాడు. అతనికి పాటలేవీ జ్ఞాపకం రాలేదు. "ఊహూ(నిన్ను గురించి ఎవరూ పాట రాయలేదు. నెమళ్ళను గురించి రాశారు. హంసలను గురించి రాశారు. కాని నన్ను గురించి రాయడానికి ఎవరికి పట్టకపోయింది. ఇప్పటికిప్పుడు పాట అల్లే చాతుర్యం నాకు లేదు" అనుకున్నాడతడు.

తీంట్ర పొదలో సుక్కపంది అలిగి మూలకూర్చున్న ఇల్లాలు వలె మూతి ముడుచుకుని ఉంది.

"ఫరవాలేదు. భీమసేనుని గురించి లెక్కలేనని పాటలున్నాయి. పద్యాలున్నాయి. ఏల కతలున్నాయి. ఆ పాటలు పాడతాను. భీమసేనుని గురించి పాడితే నిన్ను గురించి పాడినట్టు" అనుకున్నాడతడు.

అతడు ఈటెను పక్క కొమ్మ మీద ఉంచి, గొంతు సవరించుకుని, గుండెల నిండా గాలి పీల్చుకుని వీధి నాటకపు పాట పాడసాగాడు -

"వలలుడ లేరా
గుడ్డోని బిడ్డలను
గొడ్డలితో నరుక
వలలుడ లేరా..."

గాయాల మూలాన తొడలు నొప్పిపెట్టినట్లు, మితిమీరి నవ్వినందువల్ల పొత్తి కడుపు మీద కండరాలు నొప్పి పెట్టినట్లు, గొంతు ఎండిపోయి నొప్పి పెట్టేదాక అతడు పాడుతూనే ఉన్నాడు. తన పాటను తానే వంతపాడుతూ, పాడిన చరణాన్ని మళ్ళీ పాడుతూ అతడు మైమరచిపోసాగాడు.

అతడు గొంతుమీద తీసుకుంటూ, "గొంతు ఎండిపోయింది. గుక్కెడు నీళ్ళు దొరికితే బాగుండును. భుజాలకు రెండు రెక్కలుంటే ఆ తోటివాడిలా ఎగురుతూ వెళ్ళి కుంటలో నీళ్ళు తాగి వద్దును" అనుకున్నాడు.

అతడు కొమ్మ మీద అననుకూలమైన భంగిమలో చాలా సేపటినుంచి కూర్చుని వుండటం వల్ల అతని పాదాలు రెండు తిమ్మిరెక్కినాయి.

కొమ్మ మీద బాపన చీమలు తిరుగుతున్నాయి. "ఈ బాపన చీమలు పగలంతా ఎక్కడుంటాయో, బ్రహ్మదేవుడికి గూడా తెలియదు. రాత్రి పూట మాత్రం ఎక్కడ చూసినా ఇవే కనిపిస్తాయి" అనుకున్నాడు ముసలివాడు.

బాపన చీమలు అతని పాదాల మీదుగా, కాళ్ళ మీదుగా, తొడల మీదుగా పరుగెత్తుతున్నాయి. ఒక్కొక్కటి తుంటి పైకెత్తుకుని ఎక్కడో రాచకార్యాలు వెలిగించనున్నట్టు గుడుగుడుమని పరుగిడుతున్నాయి. ఆకుల ద్వారా ప్రసరిస్తున్న వెన్నెలలో ముసలివాడు వాటిని గమనిస్తున్నాడు.

'ఈ బాపన చీమలకు కుట్టడమూ తెలియదు. కొరకడమూ తెలియదు. ఎలా బతుకుతాయో ఏమో' అనుకున్నాడతడు. అవి తన శరీరం మీద ప్రాకుతుంటే ఆప్తులెవరో తనను ఆలింగనం చేసుకున్నట్లు అతడు అనుభూతి చెందసాగాడు.

కొంతసేపటికి అతడు తన తలపైన ఉన్న కొమ్మను ఆధారంగా పట్టుకుని లేచి నిలబడి మూత్ర విసర్జన చేశాడు.

# 16

ఆ సన్నటి కొమ్మమీద వొదిగి కూర్చుని ఉండడం చాలా కష్టంగా అతనికి తోస్తున్నది. ఇలా ఎంతసేపు కూర్చొని ఉండడం? తెల్లవారేదాకా ఇలా ఉండవలసిందేనా?

'మరయితే కష్టపూరితం కానిదేది? శ్రమతో, బాధతో ప్రమేయం లేకుండా అవలీలగా ఏది మాత్రం వొనగూడుతుంది. కడుపు పగిలేట్లు కల్లు త్రాగి ఈతచెట్ల కిందే పడి మూలగడం అవలీల. ముక్కుదాకా కతికి అటకమూల పడి గుర్రుపెట్టడం అవలీల. సుక్కపందినీ, దాని సలుగులనూ క్రూరమృగాల పాలుజేసి గుడిసెకు వెళ్ళిపోవడం అవలీల. కానీ బాధ్యతలను గుర్తించని వాళ్ళకు, లోయలోని మరపరాళ్ళకూ ఏమి తేడా?' అనుకున్నాడు ముసలివాడు.

కొమ్మ మీద సర్ది కూర్చుంటుండగా అతనికి ఆవులింత వచ్చింది. 'ఛీ. ఇది చాలా అవమానకరం చేతినిండా పని ఉంచుకుని విసుగును, అలసటను దరిజేరనియ్యడం చాలా అవమానకరం.' అని అతడు తనను తాను నిందించుకున్నాడు. 'కానీ ఈ ఆవులింత శారీరకమైనది. నేను శారీరకంగా నిజం గానే అలసి ఉన్నాను.' అనుకున్నాడతడు.

'నేను కాటికి కాళ్ళు చూపుకుని ఉన్నవాడ్ని. ఒక్కసారిగా ఇన్ని గాయాలు తినడం, ఇంత నెత్తురు పోగొట్టుకొనడం నాబోటివానికి లాయకీకాదు.' అనుకుంటూ అతను తన తొడలవైపు చూసుకున్నాడు. 'కానీ అలసి ఉన్నది నా శరీరం మాత్రమే. నా మనోధైర్యం చెక్కుచెదరలేదు. ధైర్యం సడలవలసిన అగత్యం మాత్రం ఏమొచ్చింది. అదిగో, నా శత్రువు కడుపు తెగి పేగులు బయట వేసుకుని పడి ఉన్నాడు. సుక్కపంది దాని సలుగులతో తీంట్ర పొదలో సురక్షితంగా ఉంది' అనుకున్నాడతడు.

ఇంతలో అకస్మాత్తుగా గాలి దిశ మారి వీచసాగింది. గాలి పాటుకు చెట్టుకొమ్మలు కీచుకీచుమంటూ ఒక దానికొకటి రాచుకొనసాగాయి. ముసలివాడు కూర్చుని ఉన్న సుంక్రేసు కొమ్మ ముందుకు, వెనుకకు, పైకి, కిందకు ఊగసాగింది. పండి ఉన్న సుంక్రేసు ఆకులు నిశ్శబ్దంగా తొడిమలు వీడి అంతకన్న నిశ్శబ్దంగా భూ పతన మవుతున్నాయి.

గాలి ముసలి వానిని చికాకు పరచింది. అతడు తల తిప్పి గాలి వీస్తున్న దిశగా చూశాడు. లోయలో నాలుగు గుంటనక్కలు కనిపించాయి. క్షణ కాలం పాటు తను వెల్లా కొయ్యబారి పోయినట్లు అతనికి అనిపించింది.

మునుపటి నక్కవలె ఆ నాలుగు గుంటనక్కలు కూడా లోయలో మరపరాళ్ళ మధ్య నిలుచుని ఉన్నాయి. ఈశాన్య దిక్కుగా తిరిగి ఒకే భంగిమలో నిలుచుని ఉన్నాయి. మోరలను ఆకాశంవైపు తిప్పి కొంతసేపు గాలిలో వాసన పట్టి తలలు దించుకున్నాయి. వేటగాడు తన దృష్టికి అడ్డు వచ్చిన సాలెగూడును లాగివేసినట్లు అవి తమ ముందరి కాళ్ళతో ముక్కుల మీదున్న చెమటను తుడుచుకుని మళ్ళీ మోరలెత్తి గాలిని పరిశీలించాయి. తమ పరిశోధన ఫలించింది గాబోలు - అవి ఈత పట్టల వంటి తమ తోకలను నేలమీద జీరాడించాయి. తరువాత నాలిగింటికి కలిసి ఉమ్మడిగా ఒకే ఆత్మ, ఒకే హృదయం, ఒకే తనువు ఉన్నట్టుగా అవి తామున్న తావు నుంచి కదిలి బయలదేరాయి.

'సుక్కపంది తీంట్ర పొదలో పురుడు పోసుకుని ఉన్న విషయం ఈ నక్కలకు ఎలాగ తెలిసింది?' అనుకున్నాడు. పురిటి వాసన ద్వారా తెలుసుకుని ఉంటాయి. అడవి మృగాల ఘ్రాణేంద్రియాలకు అతీతమైనదేదీ లేదు. శత్రువుల ఆగమనాన్ని అవి వాసన ద్వారానే గ్రహించగలవు. పైగా తోటోడు గొంతు చిరిగిపోయేలా అరుస్తూ తను కనుగొన్న వింతను చాటుతూనే ఉన్నాడు.

ఇంత వరకు అదృశ్యంగా ఉండిన తోటి గువ్వ ఇప్పుడు తీంట్ర పొదమీద కూర్చుని అరుస్తూ కనిపించింది. నల్లని దాని ఆకృతి, పదునైన దాని కంఠం ముసలివానిలో అసహ్యాన్ని రేకెత్తిస్తున్నాయి. 'ముప్పు తెచ్చి పెడుతున్నావు గదరా తోటోడా. నువ్వు ఇలా రచ్చ చేస్తూ నాకు కీడు కలిగిస్తున్న విషయం బహుశ నీకు తెలియదేమో.' అనుకున్నాడతడు.

ఇంతలో ఆ నాలుగు నక్కలూ లోయ గట్టున ప్రత్యక్షమయ్యాయి. ఉజ్జ్వలమైన కాంతి ప్రసరించగా కనుపాప సంకుచించినట్టుగా అతని వేళ్ళు ఈటె చుట్టూ బిగుసుకున్నాయి.

గుంటనక్కలు తీంట్ర పొదవైపు సాగుతున్నాయి. ఎర్రని నాలుకలను బయట వేసుకుని తోకలను పైకెత్తుకుని నడుస్తున్నాయి. పొద దగ్గరవుతున్న కొద్దీ వాటి అతురత, వేగము హెచ్చుతున్నాయి.

తీంట్రపొద దాపున చచ్చిపడి ఉన్న నక్కను చూసి అవి టక్కున ఆగిపోయి. ముందుకు వేయడానికై ఎత్తిన కాళ్ళను వెనుకకు తీసుకున్నాయి. నాలుకలను లోపలకు తీసుకుని తోకలను దించుకున్నయి. కొంతసేపు అవి అలాగే నిలబడి తరువాత మెల్లగా నడిచి శవం చుట్టూ నిలుచుని పరిశీలించసాగాయి. దాని కంఠం తెగి ఉన్నది. కడుపు చీల్చబడి పేగులు బయటపడి ఉన్నవి. శరీరమంతా గాయాలతో నిండి ఉంది.

తమ పరిశీలన ముగించి ఆ నాలుగు నక్కలూ ఒక దాని ముఖం మరొకటి చూసుకున్నాయి. ఒక దాని చెవిలో మరొకటి గుసగుస లాడుకోసాగాయి.

ముసలివాడు ఈటెను గురిచూసి ఉంచుకున్నాడే గాని ప్రయోగించలేదు. 'ఒకసారి ఈటెను ప్రయోగించానంటే మరి నేను నిరాయుధుడనైపోతాను. అనవసరంగా నిరాయుధుడనై పోవడం నాకు యిష్టం లేదు. పైగా ఈటెను వదలవలసిన అవసరం గూడా కలిగేట్టు లేదు. పేగులను బయట పడవేసుకుని చచ్చిపడి ఉన్న తమ సోదరుడిని చూసిన తరువాత ఆ నాలుగూ నక్కలూ ఇక ముందుకు సాగవు. వాటి గుండె నీరైపోయి ఉంటుంది. తోకలను తొడల సందున ఉంచుకుని వచ్చిన దారి పడతాయి.' అనుకున్నాడతడు అతడు నక్కల పోకడలను ఆసక్తితో చూడసాగాడు.

అవి నాలుగు అక్కడి నుండి కదిలి దిక్కుకొకటిగా వెళ్ళిపోయాయి. అలా కొంతదూరం వెళ్ళి, వెనుకకు మళ్ళి, తూర్పు నుంచి ఒకటి, పడమరనుంచి ఒకటి, ఉత్తరం నుండి ఒకటి, దక్షిణం నుండి ఒకటి తీంట్రపొదను కొల్లగొట్టడానికి రాసాగాయి.



'నక్కకు తెలియని యుద్ధతంత్రమా!' అనుకున్నాడు ముసలివాడు. 'నాలుగూ ఒకే దిక్కు నుంచి వెళితే పంది దగ్గర మిగిలిరావడం కుదరదని తెలుసుకున్నాయి. నాలుగూ నాలుగు దిక్కుల నుంచి వస్తే పందితో ఉప్పర పట్టి ఆడవచ్చు ననుకున్నాయి' అనుకుంటూ అతడు ఈటెను సరి చేసుకున్నాడు.

కప్పను మింగిన పాముపలె మందగమనంతోను, చంద్రుని మింగనున్న రాహువువలె దృఢ నిశ్చయంతోను ఆ నక్కలు తీంట్ర పొదవైపు సాగుతున్నాయి.

అవి పొదకు నాలుగు బారల దూరంలోకి వచ్చే సరికి సుక్కపంది పీడకలలు కంటూ ఉండినట్లు తృళ్ళి పడి లేచింది. ఒక్కొటొక్కటిగా నాలుగు నక్కలు దాని కంటబడ్డాయి. అది జల్లు కట్టులో ఆ బోతువలె తనున్న చోటునే పొదలో గిరగిర తిరిగింది.

ముసలివాడు ఈటెను భుజానికి పైగా ఎత్తిపట్టుకుని గురి చూశాడు. 'ఈ గుంటనక్కల ఆటలు ఇక్కడ చెల్లవు. సుక్కపంది చలిపిడుగువలె దుమికి శత్రువును హతమార్చగలదు. పైగా నాచేతిలో ఈటె ఉన్నది. దాని మొన ఇది వరకే లెక్కలేనన్ని జంతువుల తలలు చీల్చింది." అనుకున్నాడతడు.

ఇంతలో సుక్క పంది ఎగిరి తూర్పువైపు నుంచి వచ్చిన నక్క దాపున దూకింది. నాలుగు కాళ్ళపై దృఢంగా నిలుచుని ముట్టితో నక్క కడుపుకింద బలంగా కుమ్మింది. నక్క కీచుమని అరుస్తూ గాలిలోకి నిట్టనిలువుగా ఎగిరి దబ్బున వెల్లకిల పడింది. అది వెల్లకిలా పడి నాలుగు కాళ్ళు కొట్టుకుంటూ పైకి లేవడానికి ప్రయత్నిస్తుండగా సుక్కపంది దాని మీద నిలుచుని తన భయంకరమైన కోరలతో కాటువేసి ముట్టితో పేగులను తీసి పచ్చికమీద పడవేసింది. కాళ్ళను, జబ్బలను, మెడలను, మూతిని నంజర నంజరగా కొరకసాగింది.

ఇంతలో పడమరవైపు నుంచి వచ్చిన నక్క తోక పైకెత్తుకుని, నోరు ఇరకల కట్టెవలె తెరచుకుని తీంట్ర పొదలోకి దూకబోయింది. ముసలివాడు ఈటెను గురి చూసి దాని మీదకు వదిలాడు. అది రయ్యిమని పోయి దాని రెండు కండ్ల మధ్యన దూరి ముచ్చిలి గుంలో

బయటకొచ్చింది. నక్క రెండు బారల ఎత్తు ఎగిరి కిందపడి గిలగిల కాళ్ళు కొట్టుకుంటూ ప్రాణం వదిలింది.

సరిగ్గా అప్పుడు ఉత్తరం నుంచి, దక్షిణం నుంచి వచ్చిన రెండు నక్కలూ వలసబోయిన ఊర్లోకి దొంగలు జొరబడినట్టు పొదలోకి దూకాయి. చెరొక సలుగును నోటికి కరిపించుకుని అవి పరుగు పుచ్చుకున్నాయి. సలుగుల్ని నోట కరిపించుకుని పరుగిడుతున్న నక్కలను చూడగానే ముసలివాడు కడుపుమీద రోకలిపోటు తగిలిన నిండు చూలాలివలె అరచాడు. ఎవరో వేటగాడు వదిలిన బాణాలు మోకాళ్ళలోకి గుచ్చుకున్నట్లు అతడు అలాగే కొమ్మమీద మోకరిల్లి కూర్చున్నాడు. విషపూరితమైన ముండ్లు దిగినట్లు అతని శరీరం తీవ్రమైన బాధతో వణకసాగింది. సూర్యుడు లేని ఉదయాన పట్టిన పొగమంచువలె వేదన అతనిని ముమ్మరంగా ఆవరించింది.

అతడు బాధాక్రాంతమై ఉన్న ముఖాన్ని పైకెత్తి చూశాడు. పొదలో సుక్కపంది తన సలుగులను ముట్టితో దగ్గరకు తోసుకుంటూ ఉంది. దాని ముట్టి రక్తసిక్తమై ఉంది. దాని వీపు మీద పొడవున్న గాయం విచ్చుకుని కనిపిస్తున్నది. గాయం నుండి రక్తం జబ్బ వెంబడి, కాలి వెంబడి కారుతున్నది.

ముసలివాడు గబ గబ సలుగులను లెక్కపెట్టాడు. ఎనిమిది మాత్రమే ఉన్నాయి. "రొండు సలుగుల్ని పోగొట్టుకుంటి." అనుకున్నాడు. అతని కంఠం గద్గదమై ఉండి మాటలు సరిగా వెలువడడం లేదు. "పాపిష్టి ముండాకొడుకును. రొండు సలుగుల్ని పోగొట్టుకుంటి" అంటూ అతడు కొమ్మ మీద లేచి నిల్చున్నాడు. నిఠారుగా నిలబడి సలుగులను నోట కరిపించుకొని రెండు నక్కలు పారిపోయిన దిశగా తేరిపార చూశాడు.

పిండారబోసినట్లుగా వెన్నెల కాస్తున్నది. గాలి తన ఉరవడిని కోల్పోయి చడీచప్పుడు లేకుండా వీస్తున్నది. అడవి నిశ్శబ్దంగా ఉన్నది. నక్కల పొలకువ గాని, అలికిడిగాని ఎక్కడా తోచలేదు. దట్టమైన పొదలు, నోర్లు తెరుచుకుని ఉన్న గుహలు కనిపిస్తున్నాయి. 'లోభినాకొడుకులు ఆ పొదల్లో ఎక్కడో దాగుకొని ఉంటారు. ఆ



నక్కలు, వాటికి ఆశ్రయమిచ్చే పొదలు, గుహలు అన్నీ సర్వనాశనమై పోవుగాక!' అనుకున్నాడతడు.

అతనిలో ఉక్రోషం హెచ్చుగా రేగింది. పరుగిడుతున్న నక్కల నోళ్ళ నుండి వ్రేలాడుతుండిన సలుగులు అతని తలపుకు వచ్చాయి. ఆ పొదలలో, గుహలలో సలుగులిప్పుడు ఏ గతి పట్టి ఉంటాయోనని అతడు ఊహించుకున్నాడు.

తన మెదడులోని ఊహలను, తలపులను వెలికి నెట్టడానికి ప్రయత్నిస్తూ అతడు శ్వాస ఆడవి ప్రాణివలె గిలగిల కొట్టుకున్నాడు. అశ్రువులతో అతని కనుకొలకుల నిండాయి. నిస్తేజుడైన సూర్యుడు పడమటి కొండమీది చతికిలబడినట్లు అతడు కొమ్మమీద కూర్చున్నాడు.

'నేను చెట్టుదిగి ఈటె చేతబట్టుకుని పొదచెంత నిలబడి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదు. కాని సుక్కపంది నన్నుచెట్టు దిగనివ్వదు. దాని మొరటుతనమే దాని అందం, దాని హంగు, ఈ సృష్టిలో మొరటుతనం అనే గుణం ఉన్నవాళ్లూ ఆ గుణం సుక్కపందిని అంటిపెట్టుకునే ఉంటుంది. కాదు, కాదు. సుక్కపంది బతికి ఉన్నన్నాళ్లూ అది మొరటు తన్నాన్ని పోషిస్తూ ఉంటుది' అనుకున్నాడు ముసలివాడు.

'నాగరికుడైన ఒక మానవుని సుఖదుఃఖాలు ఒక మొరటు జంతువుపైన ఆధారపడి ఉండడం ఎంత విచిత్రం! జీవితం నానా విధాలైన వైరుధ్యాలతో నిండి ఉంది' అనుకున్నాడతడు.

నక్క తలలో గుచ్చుకుని నిఠారుగా నిలుచుని ఉన్న ఈటె మీద తోటి గువ్వకూర్చున్నది. తన కంఠాన్ని ఏ మాత్రం తగ్గించకుండా, మార్చకుండా అవిరామంగా అరుస్తున్నది. అప్పుడప్పుడు తలను వంచి గాజు పెంకులవలె ఉన్న నక్క కళ్ళను చూస్తున్నది. అది మృతదేహానికి ఇంత సమీపంగా ఇదివరకెప్పుడూ రాలేదేమో! విపరీతంగా గొంతు పెంచి అరవసాగింది.

'ఈ తోటివాడు నాకు తోడ్పడటానికి వచ్చాడో లేక నా కొంప ముంచడానికి వచ్చాడో తెలియకుండా ఉంది. తానొక వింతను

కండ్లజూసినంత మాత్రన అంతుపొంతూ లేకుండా అరుస్తూ ఉండడమేనా? బహుశా ఈ తోటివానికి గూడు లేదేమో. ఒకవేళ గూడు వున్నా అందులో భార్యా, పిల్లలూ లేరేమో. వీడు గూటికి వచ్చినా రాకపోయినా పట్టించుకునే వారెవరూ లేరేమో. కాని ఈ వెకిలి వెధవ నా సుక్కపంది ఉన్న పరిసరాల్లో అరుస్తూ గోల చేస్తుండడం ఇక నేనెంతమాత్రం సహించను' అనుకున్నాడు ముసలివాడు.

తోటిగువ్వ ఆ ప్రాంతంలోని నిశ్శబ్దాన్ని ఛిన్నాభిన్నం చేస్తూ రావిడి చేస్తున్నది. తానొక తపస్సు ఆచరిస్తున్నట్లు దీక్షగా, శ్రద్ధగా అరుస్తున్నది.

'ఇది ఇలా అరుస్తూ ఇంకొకసారి నక్కల దాడిని తెచ్చి పెడుతుందేమో' అనుకున్నాడు ముసలివాడు. ఆ తలపు రాగానే అతని మనసు భగభగ మండింది. ఇంత వరకు కన్నీటి పొరచేత కప్పబడి ఉండిన కనుగుడ్లు ఎర్రనయ్యాయి. 'వీలు లేదు. అవసరమైతే ఈ అడవినంతటినీ భస్మం చేస్తాను' అనుకుంటూ అతడు మొలలో నున్న కత్తినితీసి తోటి గువ్వమీదకు గురిచూసి వదిలాడు. పిట్ట విసురుగా వెళ్ళి అంత దూరాన పచ్చికమీద పడి రెక్కలను కొట్టుకోసాగింది. ఇప్పుడు దాని అరుపులకు బదులు దాని రెక్కల తపతపలు వినిపించసాగాయి. అది తన రెక్కలతో ఇసుక రేణువులను ఎగరగొడుతూ కొంతసేపు గిలగిల తన్నుకుని గాలిలోకి లేవబోయి రెండు పల్లటీలు వేసి పడరెక్కలు వేసుకుని గబాలున కిందపడి ప్రాణం విడిచింది.

కొమ్మమీద కూర్చుని వున్న ముసలివాడు పండ్లు కరుచుకుని కసిగా చూస్తున్నాడు.

తొటిగువ్వ చనిపోవడంతో ఆ ప్రాంతాన్ని నిశ్శబ్దం ఆవరించింది. గాలి తగ్గిపోయి ఆకు అల్లాడకుండా ఉంది. నల్లని మేఘాలు నిశ్శబ్దంగా చంద్రుని కడ్డంగా పయనిస్తున్నాయి. మిణుగురులవలె, నక్షత్రాల వలె అసంఖ్యాకంగా ఉన్న బిలిబిత్రిపూలు వాసనలను వెదజల్లుతున్నాయి.



# 17

రాత్రి గడిచేకొద్దీ ముసలివాని ఎదలో భారం అధికం కాసాగింది. పరిసరాలన్నీ జుగుప్సాకరంగా ఉన్నట్లు అతనికి అనిపించసాగింది. అక్కడ మూడు నక్కలు చచ్చిపడి ఉన్నాయి. ఒకదాని పొట్ట చీల్చబడి ప్రేవులు బయటపడి ఉన్నాయి. మరొకదాని గొంతు తెగి పీక కని పిస్తున్నది. ఇంకొక దాని తలలో ఈటె గుచ్చుకుని ఉంది. వీటన్నిటికీ కొంతదూరంగా తోటి గువ్వ పెడరెక్కలు వేసుకుని బోర్లపడి ఉంది.

మూర్తీభవించిన దుష్టత్వం వలె ఉన్న నక్కల కళేబరాలను అతడు కసితో చూడసాగాడు. కాని తోటిగువ్వను చూస్తుండగా అతనికి అనుకంప కలిగింది. 'ఈ నక్కలకున్న లోభత్వంలో లవలేశం కూడా తోటివానికి లేదు. వాడు అరవడంలో దురుద్దేశం లేదు. ద్రోహ తలంపు లేదు. వానిలో అమాయకత్వం తప్ప మరేమీ లేదు. ఐతే ఒక్కొక్కసారి దుర్మార్గునికన్నా అమాయకుని వల్ల ఎక్కువ కీడు జరగడం కద్దు.' అనుకున్నాడు ముసలివాడు.

'ఏది ఏమైనప్పటికీ నా మన్ననకు పాత్రుడైన తోటివాడిని నేను చంపడం తగని పనే' అని అతడు తనను తాను గర్హించుకున్నాడు.

'తోటివాడు తన అమాయకత్వం వల్లను, సుక్కపంది తన మూర్ఖత్వం వల్లను నా కర్తవ్య నిర్వహణలో అడ్డువస్తున్నారు. ఇది చాలా చిత్రమైన పరిస్థితి. ఏ సుక్కపంది కోసమైతే నేను ఇన్ని వెతలు పడుతున్నానో, ఆ సుక్కపంది కించిత్తు అవకాశం దొరికితే నన్ను నుగ్గునూచాడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఇందులోని వైరుధ్యాన్ని గురించి తల పగిలేట్టుగా ఆలోచించుకోవచ్చు.' అనుకున్నాడు ముసలివాడు.

'జీవితం నానా విధాలైన వైరుధ్యాలతో నిండి ఉంది' అని అతడు మళ్ళీ ఒకసారి అనుకున్నాడు.

అతడనుభవిస్తున్న వేదన కన్న ఎక్కువ వేదనను ఎదలో వుంచుకుని సుక్కపంది పడుకుని ఉంది. దాని వీపు మీదున్న గాయం మీద ఈగలు వాలుతుండగా అది తన తోకతో తోలుకుంటూ ఉంది.

'ఈ దిక్కుమాలిన ఈగలు దాని గాయం మీద వాలి దానిని చికాకు పరచకుండుగాక. ఈ అడవి ఈగలు ఛండాలమైనవి. అవి ఎడ్ల పుండ్ల మీద వాలి వాటికి గంగవెర్రులెత్తించి అడవంతా పరుగెత్తించడం కద్దు' అనుకున్నాడతడు.

పంది ముట్టిమీదున్న నెత్తురు ఆరిపోయి ఉంది. వీపు మీద గాయం నుండి మాత్రం నెత్తురు వెన్నెలలో నిగనిగమెరుస్తూ కారుతున్నది. 'గాయం చీము పడుతుందేమో. గాయాన్ని వెంటనే ఉప్పు నీటితో కడిగి వెంపిలాకు పత్రిని వేసి కట్టుకట్టితే కనం కూడా కనపడకుండా మానుతుంది. కానీ నేనిప్పుడు చెట్టునుండి దిగలేని దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నాను.' అనుకున్నాడతడు కొమ్మమీద అసహనంగా కదులుతూ.

రేపు ఉదయం ఇంటికి వెళ్ళగానే చేయవలసిన పనిదే. వెంపిలాకును తేవడానికై పిల్లవాడిని పంపాలి. దాని గాయానికి కట్టుకట్టిన పిదపగాని మరొక పని తలపెట్టకూడదు. అని అతడు నిశ్చయించుకున్నాడు.

'దాని శరీరానికి తగిలిన గాయాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తున్నాను. దాని మనసుకు తగిలిన గాయం మాటేమిటి? తొలి ఈతలో పుట్టిన రెండు సలుగులను పోగొట్టుకోవడం సాధారణ విషయం కాదు. ఇప్పుడు దాని మనసు పచ్చి పుండువలె ఉంటుంది. దాని చెంత కూర్చుని వీపు నిమురుతూ అనునయ వాక్యాలు చెబితే బాగుండును. ఏమని చెప్పాలి. అసలు నా మనసు స్థిమితంగా ఉంటే గదా నేను దానిని ఊరడించగలిగేది' అనుకున్నాడతడు.

అణగి ఉండిన గాలి మందంగా వీచడం ప్రారంభించింది. చెట్ల ఆకులు నిశ్శబ్దంగా మెల్లగా ఆడసాగాయి.

'ఈ పూట చనిపోయిన సలుగులు రెండూ అల్పాయువు కోరుకుని పుట్టాయేమో? అసలవి రెండూ పుట్టనే లేదనుకుంటే సరి. ఎనిమిది మాత్రమే పుట్టాయనుకుంటే సరి. ఎనిమిది మాత్రమే పుట్టాయని రేపు ఊర్లో చెబుతాను. గ్రామస్థులంతా నమ్ముతారు. పిల్లవాడు నమ్ముతాడు.' అనుకున్నాడతడు.



మందమారుతంలో తేలివస్తున్న బిలిబిత్రి పూలవాసన మత్తుగా తాకుతున్నది.

'నేను ప్రపంచాన్నంతటినీ నమ్మించవచ్చు. కాని వాస్తవం సుక్కపందికి తెలుసు. ఈటెకు తెలుసు, నా అంతరాత్మకు తెలుసు' అనుకున్నాడతడు.

మందామారుతం వేడిమిని సంతరించుకున్నట్టు గాను, పూల వాసన వెగటుగా మారినట్టుగాను అతనికి అనిపించింది.

'కనుక ఈ పూట సంభవించిన దురదృష్టాన్ని నేను గాని, సుక్కపందిగాని ఇప్పుడిప్పుడే మరిచిపోవడం జరుగదు. కానీ కాలం అన్ని దురదృష్టాలను మరపిస్తుంది. ఎండుటిసుకలో కాలిబాటను ప్రవాహం రూపుమాపినంత సునాయసంగా, కలాపినీళ్ళ తేమను ఉదయపు సూర్యుడు హరించినంత సునాయాసంగా కాలం దురదృష్టాలను మరిపిస్తుంది' అనుకున్నాడతడు.

చంద్రుడు పడమరకు వాలడంతో తీంట్ర ఆకుల నీడ సుక్కపంది మీద పడుతున్నది. దాని వీపు మీదున్న గాయం నుండి రక్తం ఇంకా స్రవిస్తున్నదో ఆగిపోయిందో తెలియడం లేదు. పంది దేహం సగం నీడలోను, సగం వెన్నెలలోనూ ఉన్నది. కొన్ని సలుగులు పాలు తాగుతున్నాయి. మరి కొన్ని గుడ్డి వాళ్ళవలె తల్లికి సమీపాన తారాడుతున్నాయి.

"సుక్కపంది దేనిని గరించి ఆలోచిస్తూ ఉంది? తను పోగొట్టుకున్న రెండు సలుగులను గురించి వెతజెందుతున్నదేమో, మిగిలివున్న ఎనిమిది సలుగుల్ని కాపాడమని భగవంతుడ్ని వేడుకుంటూ ఉండేమో! అది తన వెతలను నాకు చెప్పి,నా వెతలను వింటే ఎంత బాగుండును' అనుకున్నాడతడు.

బాపన చీమలు కనబడడం లేదు. 'ఒక్కటీ కనిపించడం లేదు. ఏమైపోయినట్టు? భుక్తి కోసం వెళ్ళి ఉంటాయి. నేను కుందేలును చంపి తిన్నట్టుగా, నక్కలు సలుగుల్ని చంపి తినినట్టుగా ఈ చీమలు గూడా దేన్నో చంపి తినడానికి వెళ్ళి ఉంటాయి. చచ్చి పడివున్న నక్కల కనుగుడ్లను కొరికి తినడానికి వెళ్ళాయేమో! చివరకు బాపన చీమల

వంటి సాధుజీవులు గూడా హింసనంటి పెట్టుకునే జీవిస్తున్నాయి.' అనుకున్నాడతడు.

పరిసరాలపైన అసహ్యభావం అతనిలో ఉవ్వెత్తున లేచింది. నక్కల కళేబరాలవైపు తిరిగి కాండ్రించి ఉమ్మాడు. పాలవెల్లువ వంటి వెన్నెల అతనికి చల్లదనాన్ని ప్రసాదించడం లేదు. వివిధ సౌరభాలను మోసుకుని తిరుగుతున్న గాలి అతనికి హాయిని కలిగించడం లేదు. ఈ వాతావరణంలో అంతర్లీనమై వున్న హింసా ప్రవృత్తి, దోపిడితనము అతని పంచేంద్రియాలను తాకతూ అతనిలో అసహ్యాన్ని రేకెత్తిస్తున్నాయి."కోరలు, గోళ్ళు కలిగిన క్రూర మృగాలు మాత్రమే ఈ అడవిలో మనగలవు' అనుకున్నాడతడు. అతడు మళ్ళీ కాండ్రించి నక్కల శవాలవైపు ఉమ్మబోయి ఆగిపోయాడు. 'ఇప్పుడిక్కడ హింసను నెరపనిదెవరు? కడుపులో ఒకింత ఆకలి తోచగానే నేను కుందేలును చంపి తినలేదా? అనుకున్నాడతడు. అతడు తలవంచుకుని కొమ్మ కిందకు ఉమిసి, 'ఈ ప్రకృతిలో నేనూ ఒక భాగమే' అనుకున్నాడు.

అతని మనసులో అసహనత పేరుకుంటున్నది. 'త్వరగా తెల్లవారితే బాగుండును' అనుకుంటూ అతడు ఆశతో తూర్పుదిక్కుగా చూశాడు. తూర్పు ఆకాశం తేంద్రగించలేదు. కురం సోకిన అవువలె, రెక్కలు తుడిసిన పిట్టవలె ముడుచుకుని వున్నది.

'తెల్లవారాక సుక్కపంది తెలివి తెచ్చుకుని నా స్వాధీనంలోకి వస్తుంది. నేను వెదురు బద్దలతోను, తీంట్ర తీగలతోను గంపను అల్లి సలుగులను అందులో వేసుకుని పందిని వెంట పెట్టుకుని అడవి వదిలి వెళ్ళి పోతాను. ఈలోగా మరే ఉపద్రవం సంభవించకుండుగాక' అనుకున్నాడతడు.

'నేను ఇక్కడనుండి వెళ్ళిపోయాక చాలా కాలందాకా ఈ తీంట్ర పొదను, ఈ సుండ్రేసు చెట్టును జ్ఞాపకముంచుకుంటాను. ఈ స్వల్ప వ్యవధిలోనే నాకు వీటితో అవినాభావ సంబంధం ఏర్పడింది. స్నేహకాలం కన్న, స్నేహంలోని తీవ్రతయే ప్రధానం' అనుకున్నాడు ముసలివాడు.



'కొంతకాలం పిదప నేనీ అడవికి వచ్చి ఈ ప్రదేశాన్ని సందర్శించడం జరగవచ్చు. అప్పటికి ఈ రక్తపు మడుగులు మాయమై పోయి ఉంటాయి. తీంట్రపొద కూలిపోయి వుంటుంది. సుండ్రేసు కొమ్మలు దుల్లిపోయి ఉంటాయి. నక్కల పుర్రెలు, ఎముకలు పచ్చికలో కూరుకు పోయి కనిపిస్తూ ఉంటాయి' అనుకున్నాడతడు.

నక్కల శవాలకు పుట్టబోయే దుర్గతిని గురించి అతడు కసిగా ఆలోచించసాగాడు. 'రేపు పొద్దు రెండు బారలెక్కేసరికి ఈ ప్రదేశం రాబందులతో నిండి ఉంటుంది. రాబందులు తిని వదలిన కందరాలను క్రమంగా చెద తినివేస్తుంది. వాటి పుర్రెలలో తేళ్ళు, పాములు చోటు చేసుకుంటాయి.' అనుకున్నాడతడు.

నీచత్వాన్ని మూటలుగా కట్టి పడవేసినట్లు ఆ మూడు నక్కలూపడి ఉన్నాయి. తీంట్రపొదకు పడమరగా పడి ఉన్న ఒక దాని తలలో గుచ్చుకుని వున్న ఈటె నిటారుగా నిలుచుని ఉంది. గింజుకుని వున్న దాని కోరలు, తెరచుకుని వున్న దాని కళ్ళు వెన్నెలలో మెరుస్తున్నాయి. ఏ క్షణానైనా అది లేచి ఉరకవచ్చుననే భ్రమ కలుగజేస్తున్నది.

'ఇంకెక్కడ లేస్తుంది, ఈటె దాని కళ్ళ మధ్య దూరి ముచ్చిలిగుంటలో బయటకొచ్చేసింది' అనుకున్నాడతడు.

'ఈ మూడింటి పుర్రెలను తీసుకెళ్ళి గుడిసెలో పెట్టుకుంటే అవి నేనీ రాత్రి పొందిన అనుభవాలకు జ్ఞాపకార్థంగా ఉంటాయి. సుక్కపంది యొక్క రౌద్రానికి, నాభుజబలానికీ గుర్తుగా ఉంటాయి. కానీ ఇది చాలా దారుణమైన రాత్రి. పీడకలలతో నిండిన నిద్ర లాంటిది. రెండు సలుగులను పోగొట్టుకొన్న ఈ రాత్రిని నేను జ్ఞాపక ముంచుకోవడం మంచిది కాదు. వీలయినంత త్వరగా మరిచిపోవాలి. మరిచిపోవడం కన్న ముఖ్యం గుణపాఠం నేర్చుకోవడం, ఐతే ఇప్పుడు సంభవించిన దురదృష్టం ద్వారా ఏమి గుణపాఠం బోధపడింది?' అని అతడు తనను తాను ప్రశ్నించుకున్నాడు.

'నా పొరపాటు బాహాటంగానే తెలుస్తోంది. నేడో రేపో సలుగులను ఈనడానికి సిద్దంగా ఉన్న సుక్కపందిని బయటకు

వదలడమే నేను చేసిన పొరబాటు. దానిని దొడ్డిలోనే ఉంచి తిండీ, నీళ్ళూ పెట్టవలసింది.' అనుకున్నాడతడు.

సూర్యుని సూటి కిరణాలు కళ్ళను పొడిచినట్టుగా అతడుచేసిన పొరబాటు అతనిని బాధించసాగింది.

'ఉదయం నాకు వొంట్లో నలతగా వుండింది. పిల్లవాడు దొడ్డితడక తీయడం, పందులను బయటకు వదలడం గుడిసెలో పడుకుని వినగలిగానే గాని లేచి బయటకు వచ్చి వానికి తగిన సూచనలిచ్చే ఓపిక లేకపోయింది.' అనుకున్నాడు ముసలివాడు.

'ఈ ఆలోచనలకు నేను స్వస్తి చెప్పలేను. ఈపూట నేను చేసిన పొరబాట్లు ఒకటి కాదు. రెండు కాదు. అవి అనేకంగా కనబడు తున్నాయి. బయలదేరి వచ్చేటప్పుడు కనీసం పంగల కర్రనైనా చేత బట్టుకుని రావలసింది. ఈటె ఎంత శక్తివంతమైన దైనప్పటికీ దానిని ఒకేసారి ప్రయోగించగలను. జోలెడు గులకరాళ్ళను పక్కన పెట్టుకొని పంగల కర్రను చేత బట్టుకుని వుంటే వచ్చే నక్కలన్నిటినీ కనుగుడ్లు పగలగొట్టి ఉండేవాడిని. ఒక్క సలుడు గూడా పోయి ఉండేది కాదు.

అతడు పంగల కర్రను ఉపయోగించి చాలా కాలమయింది. చిన్ననాడతడు ఎంత చిటారు కొమ్మమీదున్న ఉడతనైనా సరే, ఎంత వేగంగా ఎగురుతున్న పిట్టనైనా సరే చుక్కపెట్టినట్టు కొట్టి కింద పడవేసే వాడు.

అతనికి పిల్లవాడు జ్ఞాపక మొచ్చాడు. 'వాడు పంగల కర్రను ప్రయోగించడంలో అఖండుడు. వానికి గురి నేర్పింది నేనే.' అనుకున్నాడతడు గర్వంగా. 'ఇంకాస్తకండ పట్టాకవానికి ఈటె నేర్పాలి. భుజాల మీద, దండలమీద పటిష్టమైన కండ ఉంటేగాని ఈటె విసరడం కుదరదు.' అనుకున్నాడతడు.

రాత్రి గడుస్తున్నది. చంద్రుడు నడి ఆకాశం నుండి దిగడం ప్రారంభించి చాలా సేపయింది. మేఘాలు అప్పుడొకటి అప్పుడొకటి చంద్రుని కడ్డంగా వస్తుండగా వాటి నీడలు అడవి మీద నిశ్శబ్ధంగా ప్రాకుతున్నాయి.



# 18

రాత్రి గడిచేకొద్దీ ముసలివానిలో నిరుత్సాహం అలుము కొనసాగింది. 'ఇది శుభసూచకం కాదు. నిరుత్సాహం కార్యశూరునికి లక్షణం కాదు' అనుకున్నాడతడు. 'నా చుట్టూ ఉన్న వాతావరణం చాలా చెడ్డది. కళ్ళు తెరిస్తే మృత్యువుపాలైన ప్రాణులు, హింస పాలైన ప్రాణులు కనిపిస్తున్నాయి. ఈ అడవిలోని ప్రతి పొదలోనూ, గుహలోనూ లోభత్వము, నీచత్వము దాగి ఉన్నాయి. ఈ గాలిలో మృత్యువు తాండవిస్తున్నది.' అనుకున్నాడతడు.

సన్నగిల్లుతున్న ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవటానికై అతడు తన ఆలోచనలను ప్రస్తుతాంశాల నుండి వెనుకకు మరల్చాడు.

అతడు ఎట్టి పరిస్థితిలోగాని, ఎవరికి గాని తలవంచి ఎరుగడు. అతడు నూనూగు ప్రాయంలో ఉండగా ఒకసారి అతని గ్రామానికి పెద్ద ఉపద్రవం సంబవించింది. గ్రామానికి సమీపాన రోడ్డుకవతల మిలటరీ దండు విడిసింది. వాళ్ళు అక్కడ డేరాలు వేసుకుని నివసిస్తూ ఎందుకున్నారో గ్రామస్థులేవరికీ తెలిసేది కాదు. ఎక్కడో ప్రపంచ యుద్ధం జరుగుతోందనీ, అందులో పాల్గొనడానికి ఈ సిపాయి లందరూ తరలి వెళుతున్నారనీ జనం చెప్పుకునేవారు. ఆ సిపాయిలు కారునలుపుగా, చాలా ఎత్తుగా ఉండేవారు. వాళ్ల పెదవులు కందిరీగలు కుట్టినట్టు ఉబ్బిఉండేవి. నెత్తి మీద వెంట్రుకలు పొట్టిగా ఉంగలు చుట్టుకుని ఉండేవి.

వాళ్ళ రాకతో గ్రామంలో చాలా సంచలనం కలిగింది. ఆ సిపాయిలు బరువైన బూట్లు, తొడుగుకుని, దళసరియైన బట్టలు వేసుకుని, ఉక్కుటోపీలు నెత్తిన ఉంచుకుని, భుజాలపైన తుపాకులు ఉంచుకుని తిరుగుతుండేవారు. వాళ్ళకు భయపడి గ్రామస్థులు రోడ్డుదాటి వెళ్ళేవారు కారు. చీకటిపడ్డాక వీధుల్లోకి వచ్చేవారు కారు.

కానీ క్రమంగా ఆ సిపాయిలు గ్రామస్థులను ఆరడి పెట్టడం ప్రారంభించారు. వాళ్ళు పట్టపగలే గ్రామంలోకి జొరబడి ధాన్యాన్ని,

కోళ్ళను, మేకలను ఎత్తుకునిపోయే వారు. అడ్డుపడిన గ్రామస్థులను చితక తన్నేవారు.

ఊరి చివరన ముసలివాని (అప్పుడు యువకుడు) గుడిసె ఉండేది. ఒకనాటి ఉదయం ఇద్దరు సిపాయిలు అతని గుడిసెకొచ్చి రెండు గున్నల నివ్వమని ఆర్భాటం చేశారు. అతడప్పుడే చద్ది తాగి పందులను మేతకు తోలుకుని పోవడానికి సిద్ధంగా ఉన్నాడు. గున్నలను ససేమిరా ఇవ్వనన్నాడు. వాళ్ళు హుంకరిస్తూ తమ భుజాలమీదున్న తుపాకులను తీసి చప్పుడు చేసుకుంటూ మీటలను సవరించారు. అతడొకసారి ఎదనిండా గాలి పీల్చుకున్నాడు. రోమమయమైన తన ఎదమీద మెరుస్తున్న పులిగోరును ఒకసారి చూసుకున్నాడు. కండలు తిరిగి ఉన్న దండకు ఉన్న తాయెత్తును చూసుకున్నాడు. తరువాత ఆ సిపాయిల వంక చూసి, "కూలికి యుద్ధంచేసే ఈ నాచు వెధవలకు లొంగిపోవడమా?' అనుకున్నాడు. తను నిలుచుని ఉన్న చోటునుండి కుప్పించి ఎగిసి, వాళ్ళనిద్దర్నీ ఒక్కసారిగా ధబీమని తన్నాడు. తుపాకులను జారవిడిచి వాళ్ళిద్దరూ వెల్లకిలా పడ్డారు. అతడా తుపాకులను తీసి నాలుగు నిలువుల ఎత్తున్న గోడకవలతల గిరవాటు పెట్టాడు. ఇంతలో వాళ్లిద్దరూ లేచి అతనిమీద విరుచుకుపడ్డారు. అతడు వారితో ఘోరమైన యుద్ధం జరిపాడు. ఆ ముగ్గురి ముష్టిఘాతాలతో, మోకాటి పోట్లతో, మూలుగులతో, హాహాకారాలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. యుద్ధం ముగిసేటప్పటికి వాళ్ళిద్దరిలో ఒకడికి తుంటి బెణికింది. మరొకడికి మోకాలు బెణికింది. వాళ్ళిద్దరూ బెణికిన కీళ్ళను నెట్టుకుంటూ రోడ్డుదాటుకుని తమ డేరాలవైపు సాగిపోయారు.

ఆ యిద్దరినీ కూలదోయడంలో తానుపయోగించిన పద్ధతులను వివరంగా మననంచేసుకుంటూ ముసలివాడు సుంక్రేసు చెట్టుమీద కూర్చున్నాడు. క్రమక్రమంగా అతని మనసు ఉల్లాసాన్ని సంతరించుకున్నది. కడుపునిండా పాలుకుడిచిన పసిపాపవలె కేరింతలు కొట్టసాగింది. 'నేను ఉత్సాహాన్ని మనోధైర్యాన్ని కలిగి



ఉండడం చాలా అవసరం. అర్ధరాత్రి దాటి చాలా సేపయింది. ఇది మొదలు వేగుచుక్క పొడిచేదాక క్రూరమృగాల బెడద ఎక్కువగా ఉంటుంది' అనుకున్నాడతడు.

'తోటి వాడిని చంపి పడవేసినంత మాత్రాన శత్రువులందరినీ నిర్మూలించేసినట్టు కాదు. భీకరమైన పోరాటానికి నేను సన్నద్ధుడనై ఉండాలి' అనుకుంటూ అతడు తన రెక్కలను పైకెత్తి మెడను వెనకకు విసిరి వొళ్ళు విరుచుకున్నాడు. రణోత్సాహం అతనిలో ఉబుకుతున్నది. అతని కుడిచేతి పిడికిలి ముడుచుకుంటూ తెరుచుకుంటూ వున్నది. ఆ వ్రేళ్ళు దేనికోసమో వెదుకుతున్నట్లు అతనికి అనిపించింది. అప్పుడతనికి ఈటె జ్ఞాపకమొచ్చింది.

తీంట్రపొద వద్ద నక్కతలలో ఈటె గుచ్చుకుని ఉన్నది. 'నేను నిరాయుధుడనై ఒక క్షణమైనా ఇక ఉండడానికి వీలుపడదు' అనుకుంటూ ముసలివాడు కొమ్మమీద నుండి బోదె వైపుకు కూర్చునే జరపసాగాడు. బోదె నుండి కొమ్మ ప్రారంభమవుతున్న చోట అతడు కూర్చున్నాడు. అతనికి సుక్కపంది కోరలు జ్ఞాపకమొచ్చాయి. తన తొడలవైపు చూసుకున్నాడు. 'ఈటెను తీసుకుని పందికోరల నుండి తప్పించుకుని రావడంలోనే ఉంది నా చాక చక్యం' అనుకుంటూ అతడు తీంట్రపొదలోకి చూశాడు.

సుక్కపంది ముట్టిని నేలమీద వేసుకుని మౌనంగా నిశ్చలంగా పడుకుని ఉన్నది. దాని వీపు మీది గాయం నుండి రక్తస్రావం ఆగిపోయి ఉంది. గాలి తీంట్రపొద వైపు నుండి మందంగా వీస్తున్నది.

ముసలివాడు కొమ్మ మొదటన కూర్చుని, 'గాలి ఆగగానే కిందకు దిగుతాను. మళ్ళీ గాలి ప్రారంభం కాకముందే ఈటెను దొరక బుచ్చుకుని చెట్టెక్కుతాను' అనుకున్నాడు.

చెట్ల కొమ్మలు మెల్లగా కదులుతున్నాయి. బూరుగ దూది బంతులు బంతులుగా గాలిలో తేలియాడుతున్నది. ముసలివాడు చెట్లకొమ్మలను, బూరుగుదూదిని గమనిస్తూ కూర్చున్నాడు.

కొంతసేపటికి గాలి గప్పున అణగారి పోయింది. చెట్ల కొమ్మలు నిశ్చలమయ్యాయి. బూరుగదూది మెల్లగా కిందకు దిగసాగింది.

ముసలివాడు లాఘవంగా, చప్పుడు కాకుండా కొమ్మమీద నుండి కిందకు దూకాడు. క్షణ మాలస్యం చెయ్యకుండా ఉరికి నక్కతలలో ఉన్న ఈటెను లాగి చేత బట్టుకుని మెరుపువలె వెనుదిరిగి చెట్టెక్కి కూర్చున్నాడు.

'గాలి దేవుడు నన్ను దయచూశాడు. లేకుంటే నేను చెట్టు దిగడానికి సాహసించి ఉండే వాడని కాను. ఒక వేళ దిగి ఉన్నా పందిచేత కాట్లు తినకుండా ఉండేవాడిని కాను' అనుకున్నాడతడు.

బూరుగ దూది బంతులు ఒక్కటొక్కటిగా భూమి మీదకు వాలుతున్నాయి.

ఈటె చేతిలోకి రావడంతో తన యుద్ధ సన్నాహాలన్నీ పరిపూర్ణమైనట్లు ముసలివానికి అనిపించింది. ఆ ఈటె దాదాపు ముప్ఫై ఏండ్ల క్రితం అతనికి స్వంతమయింది. అప్పట్లో దాని పొడవు ఇప్పటికన్నా జానెడు ఎక్కువగా ఉండేది. అవిరామంగా ఉపయోగిస్తుండడం వల్లను, సాన బెడుతుండడం వల్లను అది జానెడు కుంగి పోయింది. ఈటె చేతిలో లేకుండా అతడెప్పుడు గుడిసెను వదిలేవాడు కాదు. దానినతడు తన అంగాంగాలలో ఒకటిగా భావించేవాడు.

ముసలివాడు ఈటెను వొడిలో అడ్డంగా ఉంచుకుని కూర్చున్నాడు. 'ఈ సన్నాహాలన్నీ అనవసరమేమో. ఇక క్రూరమృగాలేవీ తీంట్ర పొదపైన దాడి జరపకపోవచ్చు. శేషరాత్రి ప్రశాంతంగా గడిచి పోవచ్చు' అనుకున్నాడతడు. 'అది అసంభవం. ఏప్రాణి జీవితంగాని శత్రుభీతి లేకుండా గడవడం ఏ యుగంలోనూ జరగలేదు' అని అతడు తనను తాను ఖండించుకున్నాడు.

## 19

సుంక్రేసు చెట్టు వెనుకనున్న పొదలో నండి జెముదు కాకి 'గూ-గూ గూ' అని అరుస్తోంది. అది మిడతలను తిన అజీర్తితో మూలుగుతోంది.



ఉన్నట్టుండి పిశాచాల ఆగమనాన్ని సూచించినట్టు గాలి ఉధృతంగా వీచసాగింది. బూరుగదూది బంతులు గాలిలో తేలుతూ పరుగెడుతున్నాయి. చెట్ల కొమ్మలు ఒకదాని కొకటి రాచుకొని కీచుకీచుమని సందడి చేస్తున్నాయి. ఈ సందడిలో సుదూరంలో ఎక్కడో కొన్ని నక్కలు ఊళ వేయడం ముసలివానికి వినిపించింది.

అతని వొళ్ళు ఝల్లుమన్నది. వీపుమీద కొరడా తాకినట్టు అతడు వెనుదిరిగి చూశాడు. కనుచూపు మేరలో అసంఖ్యాకంగా నల్లని పొదలు గుహలు పాపాలు రాసిపోసి ఉన్నట్టుగా అతనికి కనిపించాయి. నక్కలు మాత్రం కనిపించలేదు.

క్రమక్రమంగా నక్కల ఊళలు అధికం కాసాగాయి. ఒక దాని నొకటి తరుముకుని వచ్చే సముద్రకెరటాలవలె ఊళలు ఒకదాని వెంబడి మరొకటి వినబడుతున్నాయి. అలా కొంతసేపు అవి వంతుల ప్రకారం అరచి పిదప ఒక్కుమ్మడిగా ఏక కంఠంతో అరవడం ప్రారంభించాయి. వాటి మనసులలోని విషం ధ్వని తరంగాలుగా మారి అడవి నంతటినీ మాడబెడుతున్నట్లు ముసలివానికి అనిపించింది.

అతని అరికాళ్ళలో చెమటలు పోస్తున్నాయి. నోరు ఎండిపోతున్నది. 'ఒకటీ, రెండూ కాదు, పదులు, ఇరువైలుగా వస్తున్నాయి. బహుశ యాభై ఉంటాయేమో' అనుకున్నాడతడు.

క్రమక్రమంగా ఊళలు దగ్గరయ్యాయి. అతడు జంకుతూ ఊళలు వినవస్తున్న దిశగా చూశాడు. గుంట నక్కలు లోయనంతటినీ పరుచుకుని ఉన్నాయి. అవి నిర్భీతిగా, నిస్సంకోచంగా లోయ నెక్కి, తీంట్రపొదవైపు సాగి ఉన్నాయి.

"యాభైకి పైగా ఉంటాయి" అనుకున్నాడు ముసలివాడు. వాటిని లెక్కపెడుతూ సమయాన్ని వృధా చేయడం అతనికి ఇష్టంలేదు. అతని కుడిచేతి వేళ్ళు ఈటెచుట్టూ బిగిసుకున్నాయి. గాలి ఉధృతంగా వీస్తున్నది. చంద్రుడు మేఘాచ్ఛాదితుడు కావడంతో ఏర్పడిన మసకను పారద్రోలడానికి చుక్కలు ప్రయత్నిస్తూ వెలుగుతున్నాయి.

"నాకు వొటమి తప్పేట్లు లేదు" ముసలివాడు. 'ఇన్ని నక్కలను నా చేతిలోని ఒకే ఒక ఈటెతో నేను చంపగలగడం అసంభవం. ఈటెకు బదులు నా చేతిలో పంగలకర్ర ఉండిఉంటే బాగుండును' అనుకున్నాడతడు. 'అసంబద్ధమైన ఆలోచనలను తలలోనికి రానీయకు. నీ చేతిలో లేని పంగలకర్రను గురించి ఆలోచించకు. నీ చెంతలేని పిల్ల వానిని గురించి ఆలోచించకు' అనుకున్నాడతడు.

నక్కలు తీంట్రపొదకు బాగా సమీపానికి వచ్చాయి. వాటి వాసనను గ్రహించి వాటి అలికిడి విని సుక్కపంది పొదలో లేచి నిలుచుంది. ఉన్న పాటున శత్రువుల మీద విరుచుకుపడి చీల్చి చెండాడాలనే ప్రతీకారంతోను, సలుగులను వదలలేని మమకారం తోను అది ఉక్కిరి బిక్కిరి అవుతూ పొదలో ఇడుగులాడసాగింది.

అప్పుడు దిగంతాల వద్ద మెరిసనట్టుగ, ముసలివాని మనసులో ఒక ఆలోచన పొడచూపింది. ఫెళఫెళార్భాటాలు చేసే ఉరుమును వెంటవేసుకుని ఆకాశాన్ని పాయలు పాయలుగా చీల్చే మెరుపువలె ఆ యోచన అతని మనసు నంతటినీ ఆవరించింది. విషపు ముండ్లు దిగినట్లు అతడు నిలువెల్లా కంపించాడు. కణతల వెంబడి చెమట జారసాగింది.

అతడు కుడిచేత్తో ఈటెను పైకెత్తాడు. కుడి భుజం వణికింది. ఎడమచేత్తో కుడి భుజాన్ని చరిచాడు. 'ఇప్పుడు నా ముందు ఒక ఘోరాతి ఘోరమైన సంఘటన జరగబోతున్నది. కురుక్షేత్రంలో ఇలావంతుడివలె నేను ప్రేక్షకమాత్రుడుగా ఉండలేను. నా ఆచరణలో కించిత్తు లోపం గాని, ఆలస్యం గాని జరగడానికి వీలులేదు. ఈ క్షణాన నా జీవితం మహోన్నతమైన వేగాన్ని పుంజుకున్నది' అనుకున్నాడతడు. అతడు మరొకసారి ఎడమచేత్తో కుడిభుజాన్ని చరిచాడు. పండ్లు కరుచుకుని పుష్టికొద్దికి ఈటెను సుక్కపంది మీదకు విసిరాడు.

ఈటె రివ్వుమని గాలిని కోసుకంటూ వెళ్ళి పంది ఎడమ డొక్కలో దూరి కుడి డొక్కలో బయటకొచ్చింది. పంది అడవి దద్దరిల్లేలా అరుస్తూ పొదలో నుండి బయటకు దూకి పచ్చగడ్డిమీద దొర్లసాగింది.



ఈటె పంది దేహంలోకి దిగడము, ముసలివాడు చెట్టు నుండి కిందకు దూకడము ఏకలిప్తలో జరిగాయి. కిందకు దూకిన అతడ నక్కలవైపు తిరిగి భయం గొలిపేలా అరచి, వంగి రెండు చేతుల్లోకి రెండు రాళ్ళను తీసుకుని నడుమెత్తాడు. నక్కలన్నీ దిక్కుకొక్కటిగా పలాయన మవుతుండడం అతనికి కనిపించింది. తోకలను తొడల సందన ఉంచుకుని అవి పరుగిడుతుండగా వాటి వెనుక దుమ్ము మేఘం వలె లేస్తున్నది. వాటి కాళ్ళకు తగిలి గులకరాళ్లు ఒక దాని మీదొకటి పడి నిప్పు రవ్వలు పుట్టుతున్నవి. పిరికితనంతో, ప్రాణ భయంతో పరిగిడుతున్న వాటికేసి అతడు అసహ్యం, జుగుప్స నిండిన కళ్ళతో చూస్తూ నిలుచున్నాడు. అవి కనుమరుగయ్యాక అతని చేతిలోని రాళ్ళు కిందపడ్డాయి.

అతడు నడుము, మోకాళ్ళు వంగుతుండగా నడిచి సుక్కపందిని సమీపించాడు. అది నల్ల గుండువలె నిశ్చలనంగా పడి వుంది. దాని రొమ్ము కడ్డంగా ఈటె గుచ్చుకుని అలాగే ఉన్నది. దాని పక్కలు, జబ్బలు రక్తంతో తడిసి ఉన్నాయి.

ముసలివాడు తన రెండు చేతులను ఈటె చుట్టూ వేసి ఎడమ పాదాన్ని పంది ముట్టిమీద వేసి ఒకసారి పెద్దగా ముక్కి ఈటెను ఊడలాగాడు. గడ్డకట్టిన నెత్తురు ఈటెమొనవెంబడి జారుతుండగా దానినతడు చంద్రుని కడ్డంగా పైకెత్తి పట్టుకుని, రుద్ధమైపోతున్న కంఠంతో గట్టిగా, "సుక్కపందిని సంపుకుంటి, చేజేతులా సంపుకుంటి." అనరచాడు. తరువాత అతడు ఈటెను భూమిలోకి కస్సుమని దిగవేసి, దానిపైన చేతులు వేసుకుని తగ్గుస్వరంతో, "వేరేదోవ లేకపొయే. సలుగుల్ని కాపాడుకునే దానికి వేరే దోవ లేకపోయె" అన్నాడు.

చంద్రుడు మబ్బుచాటు నుండి బయటికొచ్చాడు. గాలి యథాప్రకారం పిశాచాల నాట్యానికి వంత పాడుతున్నట్లు సందడి చేస్తూ వీస్తున్నది.

ముసలివాడు ఈటెను వదిలిపెట్టి, తీంట్రపొదలోకి, నడిచాడు.

ఎనిమిది సలుగులు ముద్దుగా దోగాడుతున్నాయి. అతడు మోకాళ్ళ మీద కూర్చుని రెండు చేతుల్లో రెండు సలుగుల్ని తీసుకున్నాడు. వాటిని ఆప్యాయంగా చూస్తూ అతడి ముఖం మీదున్న ముడతలు రెట్టింపు అయ్యేట్టుగా చిరునవ్వు నవ్వాడు.

'వీటిని పెంచి పెద్దజేయడం ఎలాగ?' అని అతడు ప్రశ్నించుకున్నాడు. 'నా దొడ్డిలో ఇంకో సుక్కపంది ఉంది. అది మొన్ననే సలుగుల నీనింది. ఈ సలుగులను తీసుకెళ్ళి దాని చెంత వదలుతాను' అనుకున్నాడతడు.

'సుక్కపందులు పరాయి సలుగులను దరచేరనియ్యవేమో అవి రురాయి సలుగులకు పాలివ్వడం ఎవరూ వినలేదు, కనలేదు' అని అతనికి సందేహం కలిగింది.

'అంతా సంభవమే. ఇతరులు కనీ, వినీ ఎరుగనివి ఎన్నోచేశాను, ఇంకా చేస్తాను' అనుకున్నాడతడు.

తను కూర్చుని ఉన్న చోటు నుండి అతడు సుక్కపంది వైపు చూశాడు. 'నా చేతులతో పెంచి పెద్దచేసిన పందిని నా చేతులతోనే చంపుకున్నాను. దానిని నేనెన్నటికీ మరచిపోను. ఆ మరణానంతం నాకది ప్రతిరాత్రీ కలలో కనబడుతూ ఉంటుంది.' అనుకున్నాడతడు.

గాలి గుప్పున ఆగిపోయింది. గాలిలో ఎగురుతుండిన ఎండుటాకులు గిరగిర తిరుగుతూ భూపతనం కాసాగాయి. తలలు పంచుకుని ఉండిన చెట్లు నిటారుగా నిల్చున్నాయి.

'యుద్ధం ముగిసింది' అనుకుంటూ ముసలివాడుపైకి లేచాడు. నల్లటిపిట్టలు కొన్ని 'గీగీగీగీ' అని అరుస్తూ ఆకాశంలో ఎగురుతూ పోతున్నాయి. 'కబోదిపిట్టలు కూడా గూళ్ళకు ప్రయాణమవుతున్నాయి. త్వరలో వేగుచుక్క పడుతుంది. పొద్దు పొడిచేలోగా నేను గుడిసెను చేరుకోవాలి.' అనుకున్నాడు ముసలివాడు.

సలుగులు కీచుకీచుమని చప్పుడు చేస్తున్నాయి. ఊత కర్రలను పోగొట్టుకున్న గుడ్డివాళ్ళ వలె తడబడుతూ అటూ ఇటూ ప్రాకుతున్నాయి. మెత్తగా కంపిస్తున్న వాటి డొక్కల కేసి చూస్తూ ముసలివాడు, 'యుద్ధం ముగిసిందని నే ననుకోవడం పొరబాటు. పొద్దుపొడిచేలోగా ఈ సలుగుల్ని గుడిసె వద్ద దొడ్డిలో ఉన్న సుక్కపంది వద్ద వదిలి పాలు కుడపాలి. పాలు లేకుండా ఈ పసి ప్రాణాలు ఎంతోసేపు బతకలేవు. పొద్దుపొడిచేలోగా గుడిసెకు చేరవేయడం అత్యవసరం. నక్కలను, తోటి గువ్వను, చివరకు సుక్కపందిని చంపి సలుగుల్ని కాపాడుకోవడం ఒక యెత్తు. కాపాడుకున్న సలుగుల్ని పొద్దుపొడిచేలోగా గుడిసెకు చేర్చడం మరొక యెత్తు కాపాడుకున్న సలుగుల్ని పొద్దు పొడిచేలోగా గుడిసెకు చేర్చడం మరొక యెత్తు. కనుక యుద్ధం ముగిసిందని నేననుకోవడం పొరబాటు. ఇప్పుడు నా బలహీనతయే నా శత్రువు' అనుకున్నాడతడు.

అతడు గడ్డి చాటున పడి ఉన్న కత్తిని తీసుకుని లోయకు అవతలి గట్టున ఉన్న వెదురు పొదలవైపు నడిచాడు. రెండు వెదురు బొంగులను నరికి భుజాన వేసుకుని సుంక్రేసు చెట్టు క్రిందకు ఈడ్చుకొచ్చాడు. వెదురు బద్దలను చీల్చి, ఆ బద్దలతోను, తీంట్ర తీగలతోను గంపను అల్లడం ప్రారంభించాడు.

'గుడిసెలో పిల్లవాడు నా కోసం ఎదురుచూస్తూ ఉంటాడు' అనుకున్నాడు ముసలివాడు. 'వాడీ రాత్రి జాగరం చేసి ఉంటాడు. తిండీ, నీళ్ళూ గూడా ముట్టుకోకుండా నా కోసం కళ్ళలో వత్తులు వేసుకుని చూస్తూ ఉంటాడు. నేను అడవిలో సుక్కపంది కోసం వెదుకుతూ తిరుగుతుండినంతేసేపు, దానికి కావలాకాస్తూ సుంక్రేసు చెట్టుమీద కూర్చుని ఉన్నంతసేపు, దానిని గంపలో వేసుకుని తిరగు ప్రయాణంలో ఉన్నంతసేపు వాడు గుడిసె ముందర కూర్చుని నాకోసం ఎదురు చూస్తూనే ఉంటాడు. నా క్షేమం కోసం, పందుల క్షేమం కోసం వేయి దేవుళ్ళకు మొక్కుకుని ఉంటాడు. సుక్కపంది చనిపోయిన వైనాన్ని, నా తొడలు చిన్నా భిన్నమైన వైనాన్ని చూసి వాడు ఎలా ప్రవర్తిస్తాడో? వేదక తాళలేక నేలమీద పడి దొర్లుతూ ఏడుస్తాడేమో? లేక గుడ్ల నీరు కుక్కుకుంటూ నా వొడిలో దూరి రోదిస్తాడేమో?"

అతడు గంపను అల్లడం పూర్తిచేసి పైకిలేచాడు. సుక్కపందిని ఎత్తి గంపలోవేశాడు. దాని మీద జానెడెత్తు కానుగాకులు పరచి ఆ పరుపు మీద సలుగులను ఒక్కొక్కదాన్ని నాజూకుగా తీసుకెళ్ళి

ఉంచాడు. గంపను నెత్తిమీద పెట్టుకోవడానికి అతడు ప్రయత్నించాడు. ఎంత ప్రయత్నించినా గంప భూమి మీద నుండి పైకి లేవలేదు. అతడు గోచెను సవరించి కట్టుకుని, అరచేతులను ఒక దాని కొకటి రాచుకుని, గుండెల నిండా గాలి పీల్చుకుని మళ్ళీ ప్రయత్నించాడు. నేలమీద గంప కసకలేదు, మెసకలేదు. అతడు తన ప్రయత్నాలను విరమించుకుని, గంప పక్కన కూర్చుని పరాజయాన్ని పొందిన తన దండలను చూసుకున్నాడు. 'నా వయసు పడమరకు వాలి చాలా ఏండ్లయింది' అనుకున్నాడతడు. తను కూర్చుని ఉన్న చోటు నుండే చుట్టూ చూస్తూ, 'ఎవరయినా చేయి ఆసరా ఇచ్చి ఈ గంపను నానెత్తిన పెడితే బాగుండును' అనుకున్నాడు. శవాలు, చెట్టు, లోయలు, శిలలు తప్ప అతనికి మరేమి కనిపించలేదు.

తానాసించిన సహాయం కోసం ఎదురుచూస్తూ అతడు కూర్చోదలుచుకోలేదు. కాలయాపన అన్నది ప్రస్తుతం అతడు కలలోనైనా చేయలేని సాహసం.

'ఈ గంప ఇంత బరువుంటుందని నేను అనుకోలేదు.' మరి లోకంలో ఉండే వైరుధ్యమంతా ఈ గంపలోనే ఉన్నదాయె. చాలా యేండ్లు జీవించి ఇప్పుడే ప్రాణం గోల్పోయిన ప్రాణి ఈ గంపలో ఉన్నది. ఇప్పుడే ప్రాణం పోసుకుని చాలా యేండ్లు జీవించనున్న ప్రాణులూ ఉన్నాయి" అనుకున్నాడతడు.

'ఈ నలుగులు నిజంగానే చాలా ఏండ్లు జీవిస్తాయా?' అని అతడు తనను తాను ప్రశ్నించుకున్నాడు. 'అడుగంటి పోతున్న నా దేహబలం మీద ఎనిమిది ప్రాణాల మనుగడ ఆధారపడి ఉండడం ఎంత దురదృష్టకరం!' అనుకున్నాడతడు.

'సలుగులను కాపాడుకొనడానికై సుక్కపందిని పోగొట్టుకున్నాను. సలుగుల కోసమే ఇప్పుడు సుక్కపంది శవాన్ని అడవిలో వదిలిపెట్టి వెళతాను' అనుకుంటూ అతడు పైకి లేచాడు. 'ఏ మానవుడూ పరిపూర్ణంగా అదృష్టవంతుడు కాదు. ఏ మానవుడూ తను వేలు పెట్టిన చోటల్లా విజయుడై రాలేదు. జయాపజయాల సమన్వయ



భావమే జీవితం. కన్నీళ్ళు దుఃఖబారాన్ని తగ్గించినట్టుగా ఈ సమన్వయబావం ఓటమిలో ఊరటనిస్తుంది" అనుకుంటూ అతడు గంపలోని సుక్కపంది శవాన్ని బయటకు ఈడ్చి గడ్డిమీద పడవేశాడు. గంప అడుగున గానుగ ఆకుల మీద ఎనిమిది నలుగులను సర్దాడు.

ఈ సారి అట్టే శ్రమపడనవసరం లేకుండా గంప పైకి లేచింది. దాని నతడు తన మోకాళ్ళ మీదుంచి పట్టుకుని పెద్దగా గాలి పీల్చుకున్నాడు. కణతల మీద రక్తనాళాలు పొంగుతుండగా, అవుడు గరచుకుని అతడు గంపను మోకాళ్ళ మీద నుండి భుజం మీదకు, అక్కడ నుండి నెత్తిమీదకు జరుపుకున్నాడు. చేయిచాచి కత్తిని, ఈటెను తీసుకుని తూర్పు వైపుగా నడవడం ప్రారంభించాడు.

## 20

నలుగులు కలతచెంది ఉన్నట్లు కీచుకీచు మనడం ప్రారంభించాయి. "ఇంకెంతసేపు లెంద్రా. కన్ను మూసి తెరిచేలోగా గుడిసె చేర్చేస్తా" అనుకుంటూ అతడు నడవసాగాడు.

ఆకాశం మీద పడమటి వాలున ఉన్న చంద్రుడు కలగజేసిన తన నీడను తొక్కుకుంటూ సుదూరంగా కనిపించే కొండల సహాయంతోను, నక్షత్రాల సహాయంతోను దిక్కులు తెలుసుకంటూ అతడు సాగుతున్నాడు.

నెత్తిమీదున్న గంపలోని గానుగాకులమీదున్న సలుగుల అవిరామంగా కదులుతుండగా వానచినుకులు పడుతున్నట్లు చప్పుడవుతున్నది.

తాను అడవిలోకి వచ్చేటప్పటికంటె ఈ తిరుగు ప్రయాణం వేగంగా సాగుతున్నట్టు ముసలివానికి అనిపిస్తోంది. ఇప్పుడు గుహలను వెదకనవసరం లేదు. పొదలను ఈటెతో బాదనవసరం లేదు. "హూచ్ - హూచ్"మని అరవనవసరంలేదు. కాలిబాట వెంబడి నడవడమొక్కటే ఇప్పుడతని పని.

అలా రెండు జాములు నడిచాక తాను అనవసరంగా కాలయాపన జరుపుతున్నట్లు అతనికి అనిపించింది. అతడు కాలిబాటను వదలి పెట్టి పచ్చిక మైదానాల కడ్డం గాను, లోయల కడ్డంగాను పడి తూర్పు దిక్కుగా నడవసాగాడు.

కళ్ళతో ఆకాశాన్ని గమనిస్తూ, చెవులతో సలుగుల అలికిడిని వింటూ అతడు వడివడిగా సాగుతున్నాడు.

క్రమంగా రాత్రి గడిచి చంద్రుడు అస్తమించి పడమటి కొండల వెనక గ్రుంకాడు. మరికొంత సేపటికి ఉషోదయమై తూర్పు ఆకాశం ఎర్రనయింది.

నడుస్తున్న ముసలివాడు వీపుమీదెవరో చరిచినట్లు హఠాత్తుగా ఆగిపోయాడు. అతడు గమనించలేదు గాని - చాలా సేపటి నుండి గంపలో నుండి సలుగుల అలికిడి వినబడడం లేదు. ఆ యెరుక కలగగానే అతిని తనువు అపాదమస్తకం క్షణకాలం జలదరించింది. జలదరిస్తున్న చేతులతో అతడు గంపను కిందకు దించి పెట్టాడు. ఎనిమిది సలుగులు నిశ్చలంగా పడి ఉన్నాయి. లోతుకు ఈడ్చుకుపోయిన వాడి డొక్కలు బలహీనంగా పైకీ కిందకు ఆడుతున్నాయి. మూసుకుని ఉన్న ఉల్లి పొరల వంటి పల్చని కనురెప్పల కింద కనుగుడ్లు అటు, ఇటు కదులుతున్నాయి.

ఆ గంప మీద ప్రాకుతున్న మృత్యునీడలను చూసి ముసలివాడు భయవిహ్వలుడయ్యాడు. "నేనీ సలుగుల జీవితాలతో చెలగాట మాడుతున్నాను. పాలు లేకుండా ఇక ఇవి అట్టేసేపు బతకవు. వీటిని నా చేతులారా నేనే చంపుకోబోతున్నాను. అనుకున్నాడతడు. వణుకుతున్న చేతులతో అతడు గంపను నెత్తిమీద పెట్టుకుని నడవసాగాడు.

నడిచేకొద్దీ జబ్బలమీదను, తొడలమీదను కట్టివున్న పక్కులు ఒక్కటొక్కటే విడిపోయి రక్తస్రావం ప్రారంభమయింది. రక్తం బొట్లు బొట్లుగా నేలమీద పడసాగింది. అంతకంతకు ముసలివానికి బలహీనత ఘుంచుకు రాసాగింది.



"నా సంకల్ప బలానికి పరాజయం లేదు. అది అన్ని బలహీనతలను జయిస్తుంది. సలుగులను ప్రాణాలతో గుడిసెకు చేరుస్తాను. అదే నా సంకల్పం" అనుకున్నాడు ముసలివాడు.

క్రమంగా అతనికి తాను గంపలో సలుగులను కాక మృత్యుదేవతను మోసుకుని పోతున్నట్టు, ఆ మృత్యువు తన ఆత్మస్థైర్యాన్ని, శరీర దారుఢ్యాన్ని హరించి వేస్తున్నట్లు ముసలివానికి అనిపించసాగింది.

అతనికి తల గిర్రున తిరుగుతున్నట్టు, మైకం కమ్ముతున్నట్లు అనిపించింది. అతని ప్రమేయం లేకుండానే అతని నడక ఆగిపోయింది. అతని కళ్ళు చీకట్లు కమ్మాయి. ఆ చీకటిలో అతనికి నీలిరంగు వలయాలు కనిపించాయి. ఆ చీకటిలో అతనికి పిల్లవాని కంఠస్వరం వినిపించింది. రాగి మానుకొమ్మల గుండా గాలి వీచినట్లుగాను, ఏటవాలుగా ఉన్న బండమీద నీళ్ళు ప్రవహించినట్టుగా ఆ కంఠం విన్పించింది.

ఇంచుక సేపటికి మైకం వీడిపోయి, చీకటి తొలగింది. ముసలివాడు చుట్టూ చూశాడు. పిల్లవాడు ఎక్కడా కనబడలేదు. "అలాంటి అనుభవం నాకు ఇదివరకెన్నడూ కలగలేదు. ఇంత అసహాయ స్థితికి నేనెప్పుడూ లోను కాలేదు." అనుకంటూ అతడు నడక ప్రారంభించాడు.

తూర్పున కాంతిరేఖలు పుంజుకున్నాయి. గాలి అణగారి పోయి ఉండడంవల్ల వృక్షాలన్నీ మౌనంగా నిశ్చలంగా నిలుచుని ఉన్నాయి. రాత్రి పొడవునా చంద్రుని చల్లదనాన్ని గ్రోలుతూ ఉండిన శిలలు ఒక కొద్ది సేపట్లో ప్రారంభం కానున్న సూర్యతాపానికి ఆయత్త పడుతున్నాయి.

ముసలివాని కాళ్ళు తడబడుతున్నాయి. దేహం కంపిస్తున్నది. నడక వేగం తగ్గుతున్నది. "కాని నా ప్రయాణాన్ని ఆపరాదు. ఇప్పుడు ప్రతి క్షణం ఒక యుగం వలె విలువైనది. నాజీవితం ఘడియలు ఇంతటి విలువలను ఆపాదించు కోవడం ఇంతకు మునుపెప్పుడూ జరగలేదు" అనుకున్నాడతడు.

కాని అతని శరీరంలోని వివశత్వం అధికమవుతూనే ఉంది. అతని సంకల్పబలాన్ని వమ్ముచేస్తూ అతని నడక ఒక మడగు చెంత ఆగిపోయింది. "కాసేపు విశ్రాంతి తీసుకుంటాను. సేదదీరాక బలం చేకూరవచ్చు" అనుకుంటూ అతడు గంపను దించి పెట్టాడు. గొంతు, నాలుక ఎండిపోతున్నట్టు అతని కనిపించింది. గంప వద్ద నుండి భారంగా నాలుగడుగులు వేసి మడుగులోని నీటిని సమీపించాడు. రత్నరాసులను కుప్పతోసుకుంటున్నంత ఆతురతతో నీటిని దోసిళ్ళతో తీసుకుని తాగాడు. నిర్మలంగా అద్దం వలె ఉండిన నీటిమట్టం అలలమయమై నక్షత్రాలు గజిబిజిగా ఎగరసాగాయి. దాహం తీరాక అతడు నీటి అంచువద్దనే నత్తగుల్లల మీద మేనువాల్చాడు.

బలహీనత నుండి పుట్టిన పరాజయభారంతోనూ, పరాజయం నుండి పుట్టిన బలహీనతతోనూ అతడలా పడుకుని ఉండగా మడుగులోని అలలు క్రమక్రమంగా అణగారిపోయాయి. చుక్కల ప్రతిబింబాలు మళ్ళీ నిశ్చలనంగా వెలగసాగాయి.

అతనికి కోడిపందాలు జ్ఞాపకానికొచ్చాయి. నెత్తురోడుతూ వెనకతొక్కులు తొక్కుతూ ఉండే కోడిపుంజు జ్ఞాపకమొచ్చింది. పందెం కాసిన జూదరులు తొడలు చరుచుకుంటూ పెడబొబ్బలు పెట్టడం జ్ఞాపకమొచ్చింది. ఎద్దు పందేలలో కోడెకు పౌరుషాన్ని పుట్టించడానికి యనాదులు డప్పు వాయించడం జ్ఞాపకమొచ్చింది.

'ఇప్పుడు నన్నెవరూ ఉత్సాహపరచలేరు. నాకెవరూ పౌరుషాన్ని గరపలేరు. నేను మానసికంగా, శారీరకంగా విపరీతమైన అలసటకి గురయ్యాను. ఇప్పుడు నన్నెవరూ కార్యోన్ముఖుని చేయలేరు' అనుకున్నాడతడు.

నీటి అంచువద్ద నత్తగుల్లల మీద వెల్లకిలా పడుకుని ఉన్న అతనికి చెట్ల చితారు కొమ్మలు, నక్షత్రాలు, మేఘాలతో నిండిన ఆకాశము కనిపిస్తున్నాయి.

తను 'సుగాలోల్ల అడవి'లో పశువులకాపరిగా ఉంటున్న రోజులల్లో జరిగిన ఒక ఉదంతం అతని తలలో మెదిలింది.



అతనితోబాటు మరి ముగ్గురు పశులకాపరులు 'సుగాలోల్ల అడవి'లో ఉండేవారు. వాళ్ళ పశువులు అడవి జీవితానికి అలవాటు పడడానికి చాలా నెలలు పట్టింది. వర్షాకాలానికి అలవాటు పడగానే ఎండాకాలం ప్రారంభమయ్యేది. ఎండాకాలానికి అలవాటు పడగానే చలికాలం మొదలయ్యేది.

ఇలా ఉండగా ఒక గొల్లవాడు తన పశువుల మందతో వాళ్ళను చేరాడు. ఆ మందలో ఎనిమిది ఆవులు, పది ఎద్దులు మరికొన్ని దూడలు మొత్తం ఇరవై జీవాలుండేవి. ఆ గొల్లవానికి ఆ పశువులే జీవనాధారం. అతనికి భూమీ పుట్ర ఏమిలేదు. అతడున్న ప్రాంతంలో కరువు తాండవించగా అతడు తన పశువులను తోలుకుని ఆ అడవికి వచ్చాడు. ఈ అడవిలో పచ్చగడ్డితో నిండిన మైదానాలనూ, గలగల పారే సెలయేళ్ళనూ చూసి అతని ఆనందానికి మితి లేకపోయింది.

కాని గ్రామ జీవితానికి అలవాటుపడిన అతని పశువులు అడవిలో ఒక పట్టాన యిమడలేక పోయాయి. వెదురు పొదలలో ఎక్కడైనా జెముడుకాకి "గూ గూ" అని కూస్తే ఆ పశువులు చెవులు రిక్కించుకుని నిలబడిపోయేవి. రెల్లు గడ్డిలో నీటికోళ్ళు రెక్కలు టపటప కొట్టుకుంటే అవి తోకలు పైకెత్తుకుని పరుగు పుచ్చుకునేవి.

ఒకనాడు గొల్లవాడు తన పశువులు కడుపు పగిలిపోయేలాగ మేపుకుని సందెవేళకు తిరిగివచ్చాడు. కట్టుగొత్తులకు వాటిని కట్టి వేసి మిగిలిన పశుకాపరులతో గుడిసెలో పడుకున్నాడు. సగం రాత్రప్పుడు పశువులు ఇదుగులాడుతున్న ధ్వని వినిపించింది. గొల్లవాడు దిగ్గున మేల్కొన్నాడు. పశువులు పగ్గాలను పటపట తెంచుతున్న ధ్వని వినిపించింది. గొల్లవాడు చర చర బయటక వెళ్ళి చూశాడు. అతని పశువులు ఒక్కటి గూడా కనిపించలేదు. కట్టుగొత్తుల వద్ద సగం సగం తెగిన పగ్గాలు కనిపించాయి. మిగిలిన వాళ్ళ పశువులన్నీ నిశ్చితంగా పడుకుని నెమర్లు వేస్తున్నాయి. గొల్లవాని పశువులకు అడవి జీవితం కొత్తగనుక చీకట్లో ఏదో ఆకారాన్ని చూసి గాని, శబ్దం వినిగాని జడుసుకుని పారిపోయి వుంటాయని అందరూ నిశ్చయించుకున్నారు.

పారిపోయిన పశువులను వెదకుతూ వాళ్ళు తలొక దిక్కుగా బయలుదేరారు. సూర్యుడు పుడుతుండగా వాళ్లు రిక్త హస్తాలతో తిరిగివచ్చారు. కాని గొల్లవాడు మాత్రం తిరిగి రాలేదు. మరి రెండు పగళ్ళు, రెండు రాత్రులు వాళ్ళు గొల్లవాని కోసము, వాని పశువుల కోసము అడవంతా గాలించారు. మూడవనాటి ఉదయం వాళ్ళు రెండు క్రోసుల దూరాన రాబందులు గుంపులు గుంపులుగా ఆకాశాన ఎగురుతుండడం గమనించారు. ఎలాంటి ఘోరాన్ని కళ్ళ జూడవలసి వస్తుందోనని భయపడుతూ వాళ్ళు అటువైపుగా పరుగెత్తారు.

ఒక భీకరమైన లోయమీద రాబందులు ఎగురుతున్నాయి. లోయ అడుగున గొల్లవాని పశువుల కళేబరాలు పడిఉన్నాయి. లోయ అంచు వెంబడి పశువుల కొమ్ములు, గిట్టలు గీరుకుపోయిన చారలు కనిపిస్తున్నాయి.

వాళ్ళందరూ లోయలోకి దిగి పశువులను సమీపించారు. దాపున ఉన్న ముష్టిచెట్టు కొమ్మ నుండి గొల్లవాడు తన పైగుడ్డతో ఉరి తీసుకుని వ్రేలాడుతూ ఉండడం చూసి వాళ్ళ గుండెలవిసిపోయాయి.

దాదాపు నలభై ఏండ్ల కింద జరిగిన ఆ ఉదంతం ముసలివానికి స్పష్టంగా జ్ఞాపకం రాసాగింది. 'ఆ దారుణ సంఘటన నాకిప్పుడెందుకు జ్ఞాపకం రావాలి?' అనుకున్నాడు ముసలివాడు. తానొక విషవలయంలో చిక్కుకున్నట్లు అతనికి అనిపించింది. 'నా బలం క్షీణించిపోవడంతో నాకు గొల్లవాడు జ్ఞాపకం వస్తున్నాడో, లేక గొల్లవాని జ్ఞాపకాలతో నాబలం క్షీణించిపోతున్నదో తెలియకుండా ఉంది' అనుకున్నాడతడు.

గొల్లవాడు ముష్టిచెట్టు నుండి వ్రేలాడుతున్న దృశ్యాన్ని తన మనోఫలకం మీద నుండి తుడిచివేయడానికన్నట్లు అతడు కళ్ళు మూసుకున్నాడు. మూసుకున్న అతని కళ్ళకు పిల్లవాని ఆకృతి కనబడింది. నీటిమట్టం మీద కొచ్చి తృళ్ళిపడి అలక చేసిన చేపవలె వాడు కేరింతలు కొడుతున్నాడు. చెరువులో ఈదులాడి గుట్టుకొచ్చి నీరోడుతున్న శరీరం ఎండలో మెరుస్తుండగా చెంగు చెంగున గంతులేస్తున్నాడు.



కొంతసేపటికి ముసలివాడు కళ్ళు తెరిచాడు. దాపున ఎక్కడా పిల్లవాని పొలకువ లేదు. అడవి నిశ్చలనంగా, గుంభనంగా నిలుచుని ఉంది.

'నాకు చిత్రమైన అనుభూతులు కలుగుతున్నాయి. శరీరమే గాదు, మనసు గూడా పట్టు తప్పుతోంది' అనుకున్నాడతడు.

ఎక్కడో కొండల వెనక సూర్యోదయమయింది. సూర్యుని ఎర్రని కిరణాలు ఆకాశంలోని మేఘాలను తాకుతున్నాయి. 'ఎండ సూర్యుని నుండి పుడుతుంది. వెన్నెల చంద్రుని నుండి పుడుతుంది. మరి చీకటి ఎక్కడి నుండి పుడుతుందో' అనుకున్నాడు ముసలివాడు.

'బహుశ చీకటికి చావు పుట్టుకలు లేవేమో. అది నిరంతరాయంగా ఉంటుంది కాబోలు. దైవ సంబంధమైన వెలుగు తాత్కాలికమై ఉండగా పైశాచికమైన చీకటి అజరామరమై ఉండడం ఎంత దారుణం!' అనుకున్నాడతడు.

మెల్లమెల్లగా అతని కండ్లు మూతలు పడ్డాయి. క్రమంగా అతడు కలో, నిద్రో తెలియని స్థితిలోకి జారుకున్నాడు.

మేఘాలను తాకుతుండిన సూర్యకిరణాలు కిందకు దిగి పర్వతశిఖరాలను, చెట్ల చిటారు కొమ్మలను తాకుతూ అతివేగంగా కిందకు జారసాగాయి. రాత్రి పొడవునా ఎగురుతూ అలసిపోయిన మిణుగురులు, అప్పుడే నిద్రలేచిన మిడతలు గడ్డిరెళలను, చెట్ల కొమ్మలను కరుచుకుని నిశ్చలనంగా ఉన్నాయి.

ఉదయపుటెండ అంతకంతకు కిందకు దిగి పొదలను, పచ్చి మైదానాలను, లోయలను స్పృజించింది. మడుగులోని నీటిమీద ఎండ మిలమిలలాడసాగింది. నీటి అంచున పడుకుని వున్న ముసలివానికి ఎండ తాకిడితో మెలకువ వచ్చింది.

కండ్లు మూసుకుని ఉన్న అతనికి తన దాపున ఏదో అలికిడి అవుతున్నట్లు అనిపించి, కండ్లు తెరచి లేచి కూర్చున్నాడు.

మూర్తీభవించిన మృత్యువువలె నాలుగు రాబందులు గంప అంచుమీద కూర్చుని ఉన్నాయి. వాడియైన వాటి ముక్కులు రక్తసిక్తమై ఉన్నాయి.

ముసలివాని శరీరం అపాదమస్తకం భగ్గున మండింది. అతడు చేయిచాచి ఈటెను తీసుకుని రాబందుల మీదకు విసిరాడు. ఈటె గురితప్పి భూమిలోకి జానెడులోతు దిగబడింది. రాబందులు ఒక్కటొక్కటే భారంగా లేచి రెక్కలు కొట్టుకుంటూ గాలిలోకి లేచాయి. అవి లేచినప్పుడు గంప తలక్రిందులై బోర్లపడింది. ముసలివాడు గబగబవచ్చి గంపను పైకెత్తి గానుగ ఆకులను పక్కకు నెట్టాడు. గానుగ ఆకుల కింద సలగులకు బదులు ఎనిమిది మాంసపు ముద్దలున్నాయి.

అతడు నడుమెత్తి నిలుచున్నాడు. అతని కనుగుడ్ల మీద నీళ్ళు నిలిచాయి. కనురెప్పలను అప్పళించగా కన్నీళ్ళు కిందకు జారి చెంపమీదున్న మడతలలో ఇంకి పోయాయి. కన్నీటి పొరగుండా అడవంతా గజిబిజిగా కనిపించింది. చేతి వెనుక భాగంతో అతడు కళ్ళు తుడుచుకున్నాడు. దాపున ఉన్న చెట్టు కొమ్మల మీద రాబందులు నాలుగు కూర్చుని ఉన్నాయి. అవి రక్తసిక్తమైవున్న ముక్కులను కొమ్మలకేసి రాచుకుంటున్నాయి. ఈటె తీసుకుని వాటి గుండెలను చిన్నాభిన్నం చేయాలని ఉందతనికి.

"కాని నేనిప్పుడు ఈటెను ప్రయోగించగల స్థితిలో లేను. ఈటెను ఊత కర్రగా ఉపయోగించవలసిన స్థితిలో ఉన్నాను" అనుకున్నాడతడు.

దీనత్వం ముంచుకురాగా అతడు పిర్రలమీదను, గుది కాళ్ళమీదను కూర్చున్నాడు. ముంజేతులను మోకాళ్ళమీద పెట్టుకుని, ముంజేతుల మీద నుదుటిని ఉంచుకున్నాడు.

"యుద్ధం ముగిసింది. నేను పూర్తిగా ఓడిపోయాను" అనుకున్నాడతను.



## 21

ఆకాశాన పొద్దు రెండు బారలెక్కింది.

ముసలివాడు ఎడమ చేతిలో కత్తిని పట్టుకుని కుడిచేతిలో ఈటెను ఊత కర్రవలె పొడుచుకుంటూ భారంగా అడుగులేస్తూ వచ్చి గుడిసెను సమీపించాడు. అతని రాకను గమనించి దొడ్డిలో ఉన్న పందులు కీచుకీచుమన్నాయి.

పిల్లవాడు గుడిసెకు, పందుల దొడ్డికి మధ్యన నేల మీద పడి నిద్రపోతున్నాడు. చుట్టగా చుట్టివున్న ఈత చాప వానిపక్కన పడి ఉన్నది. ముసలివాని కోసం రాత్రంతా ఎదురుచూస్తూ వాడు అలాగే వాలినట్టున్నాడు.

ముసలివాడు గుడిసె వాకిటవద్దనే కత్తిని, ఈటెను జారవిడిచి లోపలకు ప్రవేశించాడు. వెన్నుపాము, మోకాళ్ళు పళపళమని విరుగుతున్నట్లుండగా అతడు నేల మీద సాపుగా పడిపోయాడు. ఆకాశాన ఎగురుతున్న గద్ద తాలూకు నీడను చూసిన కోడిపిల్ల తన తల్లి రెక్కలకిందకు పరుగెత్తినంత సహజంగా, పాంథుని పాదాల తాకిడికి లేచిన ఇసుక రేణువులు తగిలి నత్త తన దేహాన్ని గుల్లలోనికి లాగుకున్నంత సహజంగా అతని దేహం బోర్ల తిరిగి నేలను కరచుకున్నది.

అతడు మూర్తీభవించిన జడత్వం వలె ఉన్నాడు. "నేనింతటి యుద్ధం జరిపింది ఈ జడత్వాన్ని పొందడానికేనా?" అన్న ప్రశ్న అతనిలోని ప్రత్యణువును తడివింది. "చలనము, పరిణామము జీవగర్రలుగా మనిన సృష్టి, చివరకు శూన్యంలో లీనమైనట్లు అత్యంత ప్రచండమైన అనుభవ పరంపరలతో నడిచిన జీవితం గూడా చివరకు జడత్వానికి లోనుగాక తప్పదేమో" అనుకున్నాడతడు.

తన దేహంలోని వివిధాంగాలు ఒక దాని నుండి ఒకటి విడిపోయి ఎక్కడెక్కడో నిర్జీవంగా పడి ఉన్నట్లు అతనికి అనిపిస్తోంది. కాని అతని మనసు మాత్రం చితివలె రగులుతూనే ఉంది. "ఎంత విచిత్రం! రూపురేఖలు కలిగిన దేహం చలనరహితంగా పడి ఉండగా,

రూపురేఖలు లేని మనసు పచ్చిక మైదానంలో సీతకోక చిలుకవలె ఎగురుతూ ఉన్నది!" అనుకున్నాడతడు.

"కాని నేనీ ఆలోచనలకు స్వస్థి చెప్పాలి. అలసి పోయిన నా మనసుకు ఒకింత విశ్రాంతి యివ్వాలి. ఆ తరువాత నేను చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. ఎందుకంటే ఇది నా జీవితంలో చివరిరోజు కాదు గనుక. ఈ రోజు నేను విపరీతమైన దురదృష్టాలకు లోనయ్యాను. లెక్క లేనన్ని ఎదురుదెబ్బలు తిన్నాను. ఐనా ఇది నా చివరిరోజు కాదు" అనుకున్నాడతడు.

క్రమంగా అతని మనసు గూడా జడత్వాన్ని పొందుతూ నిద్రలోకి జారుకున్నది.

## 22

గుడిసె పక్కన ఉన్న కణికి రాళ్ళ బాట వెంబడి రెండెడ్ల బండి సాగుతున్నది. చక్రాల గరగర శబ్దానికి పిల్లవాడు మేలుకుని లేచి కూర్చున్నాడు. ఎవరో తట్టి లేపినట్టుగా వాడు వొళ్ళు విరుచుకోకుండా, కళ్ళు నులుము కోకుండా బిత్తర పోతున్నట్లు నలుదిక్కులా చూశాడు.

గుడిసె వాకిలివద్ద కత్తి, ఈటె కనిపించాయి. వాడు గబగబ లేచి వాకిలి వద్దకు పరుగెత్తి వచ్చాడు.

ముసలివాడు నేలను కరచుకొని నిద్రిస్తున్నాడు. నోరు ఇంచుక తెరుచుకుని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జరుపుతున్నాడు. పక్కలు మెల్లగా లేస్తూ పడుతూ ఉన్నాయి. కాళ్లు రెండూ నడుం వద్ద నుండి పాదాలవరకు రక్తశిక్తమై ఉన్నాయి. అక్కడక్కడ కండరాలు వ్రేలాడుతున్నాయి.

పిల్లవాడు చప్పుడు చేయకుండా గడపదాటి లోపలకు వచ్చాడు. కళ్ళలో నీళ్ళు చిమ్ముతుండగా వాడు ముసలివాని పాదాల చెంత కూర్చున్నాడు.

- సమాప్తం -



# సింహావలోకనం

ఏమి నేర్చుకొన్నాడు మనిషి?

పుట్టేంతవరకు తల్లి గర్భంలో అధో చేతనావస్థలో ఉండటం నేర్చుకొన్నాడు.

ఇంకేమి నేర్చుకొన్నాడు?

పుట్టిన తరువాత మరణించే దాకా బ్రతికి వుండటం నేర్చుకొన్నాడు.

బ్రతకడం అయిన తరువాత చచ్చిపోవటం నేర్చుకొన్నాడు.

వీటన్నిటినీ మనిషి మాత్రమే నేర్చుకోలేదు, మనిషి కానట్టి ఇతర జీవులు కూడా నేర్చుకున్నాయి.

అయితే, మనిషి అంతవరకు మాత్రమే నేర్చుకొని ఆగిపోలేదు. ఇంకా నేర్చుకొన్నాడు.

నేర్చుకొన్నాడు అనేక శాస్త్రాలు, కళలు, క్రీడలు మొదలైనవెన్నో వాటిలోనిదే సాహితీకళ.

కావ్యం, నవల, నవలిక, కథానిక, నాటకం, నాటిక, ప్రహసనం, చరిత్ర, జీవితచరిత్ర స్వీయచరిత్ర, వ్యాసం మొదలైనవి.

డాక్టర్ కేశవరెడ్డి రచించిన ఈ "అతడు అడవిని జయించాడు" అనేది నవలిక. ఇదొక విశిష్ట నవలిక.

కేవలం వైశిష్ట్యం మాత్రమె ఒక రచనకు విలువలను అందించే కొలతబద్ద కాదు. అయినా, వైశిష్ట్యం విశిష్టమైందే!

ఈ నవలికలోని వైశిష్ట్యం ఏమిటి? ఒకటి కాదు, అనేకం.

ఇందులోని ఇతివృత్తం, రచనాశిల్పం, మాటలు, వర్ణనలు, రసానుభూతులు, ఆలోచనాధార, సన్నివేశాలు, తర్కం, తత్వం, అన్నీ విశిష్టమే.

ఇందులో మానవ పాత్ర ఒక్కటే. రెండవ పాత్ర అప్రధానమైంది.

ఆ పాత్రకు పేరు లేదు. ముసలివాడు అనే పేరు మాత్రమే.

అతడు నివసిస్తున్న స్థలం ఏ ఊరిదో తెలియదు.

ఇందులోని మిగతా పాత్రలన్నీ జంతువులూ, చెట్లూ, సెలయేళ్లూ, కొండలూ, లోయలూ, రాళ్లూ, రప్పలూ.

కథంతా ఆ ఒక్క ముసలివాని మీదుగానే నడుస్తుంది.

కథా ప్రాధాన్యమంతా అడవిలో ఒక్క రాత్రితో అయిపోతుంది. కనుక దీన్ని 'నైశ నవలిక' (Nocturnal novelette) అనవచ్చు.

ఆ ముసలివాడి సాహసగాథ "అతడు అడవిని జయించాడు" అనే నవలిక. అతడి జీవితంలోని వింత అనుభవాల్లో అదొకటి. చదివే పాఠకులకు అదొక వింత అనుభూతి.

ఆ ముసలివాడికి ఏది సాహసమో పాఠకునికి అది భయం.

అదంతా ఒక అపూర్వ జగత్తు!

"అతడు నిద్రిస్తున్న బయట పందుల దొడ్లు రెండున్నాయి. ఒక దొడ్లో సుక్కపంది తన పిల్లలను పక్కన వేసుకొని పడుకొని ఉంది. అది తన నాలుగు కాళ్ళను బార్ల జాపుకొని మోమును నేలపై పడవేసుకొని అరమోడ్పు కన్నులతో ఆనందతిశయాన్ని అనుభవిస్తూంది. పిల్లలు తల్లి రొమ్ములను కుమ్ముతూ పాలు తాగుతున్నాయి. పిల్లలు మరీ మోటుగా కుమ్మినప్పుడు తల్లి పంది మెత్తగా హాయిగామూలుగుతున్నది. పన్నెండు సలుగులకు తానిప్పుడు తల్లిననే గర్వము, సంతోషము, తృప్తి దాని అరమోడ్పు కన్నుల్లో కనిపిస్తున్నది."

ఈ రచయితలోని రసదృష్టి ఎంత పదునైనదో! పందిలో నందిని సందర్శించ కలిగేడు. నైచ్యం అనబడే దానిలో ఔన్నత్యం చూడకలిగేడు. హేయంలో ప్రేయం అనుభూతించాడు. దీన్నే కురూపపు సురూపం (the beauty of ugliness) అంటారు. రసద్రష్టకు లోకంలో ఏదీ కురూపం కాదు, అంతా సురూపమే. ఏదీ కునాదం కాదు, అంతా సునాదమే.

ఫ్రెంచ్ రసతత్వంలో ఒక "అభ్యుక్తి" ఉన్నది. "Le beau dans l horrible" (beauty in the terrible) అని. భయంకరంలో సౌందర్యం.



దీన్ని భారతీయ నవరసాల్లోని భీభత్స, భయానక రసాలతో పోల్చవచ్చు. వాస్తవానికి డాక్టర్ కేశవరెడ్డి ఈ నవలికలో అభివ్యక్తపరచింది దాదాపు ఇటువంటి రసానుభూతినే. ఇది రసాల్లో కల్లా బలీయమైన రసం, గంభీరమైన రసం.

పందులను పెంచే ఆ ముసలివాని చిత్రమైన స్వభావం. అతన్ని చూచి ఎవరైనా భయపడదు శరీరానికి కాని, మానసానికి కాని ఎంత దెబ్బ తగిలినా బాధచెందడు, వ్యధ చెందడు. అతని దృష్టిలో ఏ వ్యసనమూ దుర్వ్యసనం కాదు. ఏ వర్తనా దుర్వర్తన కాదు. బలహీనత, అసమర్థత, పిరికితనం, ఈ మూడు అతని దృష్టిలో మనిషి జీవితానికి పరమ శత్రువులు. జీవితంలో నిత్యావసరాలు అనుకొనేవాటిని కూడా కొన్నిటిని లెక్కచేయడతను.

"అతనికి స్నానం పైనా ఒకింత చిన్నచూపు కద్దు. పరిశుభ్రతను గురించి ఖాతరులేదు. అతని గురి, నమ్మిక అంతా దృఢత్వం మీదనే. ఈ లోకంలో కొందరు దినానికి రెండుసార్లు స్నానం చేస్తుంటారనే సత్యాన్ని అతడు కలిమాయలోని ఒక అంశంగా భావిస్తడు."

పై చిత్రణను బట్టి తెలుస్తుంది ఆ ముసలివాడు ఎంత అసాధారణ జీవియో అని!

ఇందులో ప్రధాన మానవ పాత్ర ముసలివాడు అయితే ప్రధాన మానవేతర పాత్ర సుక్కపంది. ఈ రచనలోని గాథంతా సుక్కపందికీ, ముసలివాడికీ సంబంధించిందే. సుక్కపంది లేకపోయినా, ముసలివాడు లేకపోయినా ఈ రచనయే ఉండేదికాదు.

అరణ్యమే ఈ ముసలివాని లీలానికేతనం. జంతువులూ, చెట్లూ, ఇతని ఆప్తమిత్రులు. ప్రమాదాలు అతనికి ప్రమోదాలు.

ఈ ప్రపంచమంతా తన కాళ్ళ క్రింద ఉన్నట్లు, ఈ ప్రపంచం అంతటిపైనా తన కాళ్ళున్నట్లు, తాను తలుచుకుంటే తన రాతిస్థంబాల కాళ్ళ తొక్కిడితో ఈ భూలోకాన్నంతా పొడిపొడి చేయగలననే ధీమా అతనిది. తాను చేసిన పొడిలో తానుకూడా పొడి అయిపోతే మాత్రం ఏమి అని అతని నిర్లక్ష్యం.

నిండు చూలాలైన తన రెండో సుక్కపంది కనపడకపోవటంతో దాన్ని వెదకి పట్టుకురావాలని సంధ్య వేళలో బయలు దేరుతాడు ముసలివాడు. అతని గుడిసె గోడమీద వ్రేలాడుతున్న కల్లు దుత్తను దించుతాడు.

"ముసలివాడు రెండు చేతులతో దుత్తను తీసుకొని పెదవుల కంటించుకున్నాడు. కల్లు నోటిలో కమ్మని రుచి కలిగిస్తూ గొంతు వెంబడి దిగి కడుపులో కుదురుకుంటున్నది. ఒక్క పెట్టున అతడు దుత్తను ఖాళీ చేసి గోడకు తగిలించాడు. పెదవులను తుడుచుకొని లొట్ట వేశాడు."

గొప్పగా ఉన్నది అతను కల్లు త్రాగుతున్న దృశ్యం!

అతను ఏమి చేసినా గొప్పగానే చేస్తాడు.

ఇటువంటి హేయవర్ణనలతో సాహితీ రచన క్రిందికి దిగజారిపోదా అని కొందరు సమాజ సంస్కారుల సందేహం.

ప్రపంచంలో అన్ని కాలాల్లో కూడా మంచీ చెడులు, వెలుగు నీడలు, తీపి చేదులు ఉంటూనే వస్తున్నాయి.

సమాజంలోని వెలుగు భాగానికి మాత్రమే విలువ నిచ్చి చీకటి భాగాన్ని అలక్ష్యం చేస్తే ఆ చీకటి భాగాపు చీకటి ఇంకా ముదిరి చిమ్మ చీకటిగా మారే ప్రమాదం ఉన్నది. ఆ చిమ్మచీకటి మూలంగా వెలుగు భాగం కూడా నల్లబడే విపత్తు ఉన్నది.

మంచి భాగాన్ని ఇంకా మంచి చేస్తూ చెడ్డ భాగాన్ని చిన్నచూపు చూస్తే ఆ చెడ్డ భాగపు బలం మంచి భాగాన్ని త్రుంచివేస్తుంది.

సమాజ శ్రేయస్సు జరగాలంటే సమాజపు ఉచ్చతర స్తరానికి మాత్రమే శ్రద్ధనందజేస్తూ నిమ్నతర స్తరం జోలికి పోవటం మానితే రెండవది మొదటిదాన్ని కిందికి లాగుతుంది. తనకంటే ఇంకా క్రిందకు.

అందుకే పందులు పెంచే ముసలివాణ్ణి నిర్లక్ష్యం చేస్తే పందిరి మంచాలపైని పందిరి క్రిందకి జారుతుంది.



కనుకనే డాక్టర్ కేశవరెడ్డి పందుల ముసలివాడికి ఉదాత్త శక్తులను ప్రసాదించాడు. చర్మపు లోతు మాత్రమేగల నైతిక రీతులకు విలువ ఇవ్వ నిరాకరించాడు. సిసలైన మానవీయ విలువలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చాడు. తన రచనకు సామాజిక వికాసాన్ని ఇస్తూనే వ్యక్తి వికాసానికి ప్రత్యేక విలువ నిచ్చాడు.

సమాజం లేకపోయినా వ్యక్తి వుంటాడు.

వ్యక్తి లేంది సమాజం ఉండదు.

కల్పనా సాహిత్యంలో వ్యక్తుల విస్తరణ ద్వారానే సమాజం సంఘటిత మవుతుంది చాలా వరకు.

సృష్టిలో మానవ సమాజం మాత్రమే కాక అనేక మానవేతర సామాజాలున్నాయి. ఈ నవలికలో వాటన్నిటికీ సమాన ప్రతిపత్తి ఇవ్వబడింది. సామ్యదృష్టిలో పందికీ నందికీ మధ్య ప్రభేదం సున్న.

చెట్టుకూ పుట్టకూ మధ్య తారతమ్యం మృగ్యం.

మన్నూ మిన్నూ కూడ సమాన ఆస్తిత్వాలే.

ఈ నవలికా రచయిత చెప్పే తీరులో వైశిష్ట్యం ఉన్నది.

"కొంత సేపటికది గారడీ యుక్తివలె గురివెంద పొదలమధ్య మాయమై పోయింది. అందుకతను వగవలేదు. "ఈ దారులు ఎటూ కాని చోట ప్రారంభమై ఎటూ కానిచోట అంతమవుతాయి" - అనటంలో ఆ వాక్య నిర్మాణం ఒక కావ్యంతగా ధ్వనించేది. ఆ ఆకర్షణ లేనపుడు కావ్యం వాక్యంగా మాత్రమే రూపొందుతుంది.

నగరాల అందాలు నగరాలకు ఉంటే, అరణ్యాల అందాలు అరణ్యాలకున్నాయి. నగరాలకు 'జనారణ్యాలు' అని కూడ పేరున్నది.

అందుకని అరణ్యాలను 'వృక్షనగరాలు' అని పిలవచ్చునేమో!

ఏది ఏమైనా అరణ్యాల శోభ శోభాయమానమైంది. రహస్యమయమైంది. పందుల ముసలివాడికి విద్యాగంధం లేనప్పటికీ ప్రకృతి పరిశీలన ఎంతో ఉన్నది.

"అతడు తల ఎత్తిచూస్తే వృక్షాలమధ్య ఆకాశం కొంత కనిపిస్తుందే కాని సూర్యుడిని తన వెనక దాచుకున్న పడమటి కొండ కాని, చంద్రుని ఆకాశంలోకి విసరిన తూర్పు కొండకాని కనిపించటం లేదు. అతన్ని పరివేష్టించి వృక్షాలు, కొండలు, గుట్టలు, పొదలు గంభీరంగా నిలుచుని ఉన్నాయి. అడవిలో నుండి ఉద్భవించిన ధ్వనులు అవిరామంగా వినిపిస్తున్నాయి. కంటికి కనిపించక పోయినప్పటికీ ఆ ధ్వనులను కలుగజేస్తున్న ప్రాణులను అతడు క్షుణ్ణంగా ఎరుగును. కాని అతని అవగాహనకు అతీతమైన ధ్వనులు చాలా ఉన్నాయి. ఆ ధ్వనులు ఎలా పుట్టాయో, వాటి అంతరార్థమేమిటో అతడికి కాని, అతని పూర్వులకు కాని అంతుపట్టలేదు. 'అడవి నిగూఢమైనది. ఏ అనుభవానికీ, ఏ మేధస్సుకూ అంతుచిక్కని రహస్యాలు ఇక్కడ చాలా ఉన్నాయి' అనుకున్నాడు ముసలివాడు"

ఈ నవలికాకారుని అరణ్య అభిజ్ఞత అద్భుతమైంది. ఎన్నెన్నో చాలా మందికి తెలియని అడవిచెట్లు ఈయనకు తెలుసు. ముష్ఠి చెట్లు, బలసతుప్పలు, కాసేరాకు, బొంత జొముదు, కిచ్చిలిచెట్లు, తీంట్రపొదలు ఈ విధంగా ఎన్నో ప్రత్యేకం అరణ్యం గురించి వ్రాసిన కల్పనా సాహిత్యం ఇంత సుందరమైనది తెలుగులో మరెవరైనా రచించారో లేదో తెలియదు. అటువంటిది ఈ "అతడు అడవిని జయించాడు" అనేది ఉన్నదని మాత్రం తెలుసు.

బెంగాలీలో ఉన్నది అరణ్యాలకు అంకితం చేసిన కల్పనా సాహిత్యం. అందులో "పథేర్ పాంచాలీ" రచయిత అయిన విభూతి భూషణ బంద్యోపాధ్యాయ రచించిన "అరణ్యక్" (తెలుగులో వనవాసి) అనే నవల సుప్రసిద్ధమైంది. కాని అది అనాగరికుని అరణ్యానుభవాలు కాక నాగరికుని అనుభవాలు. డాక్టర్ కేశవరెడ్డిది అనాగరికుని అరణ్యానుభవాలు, బెంగాలీ "అరణ్యక్" కంటే "అతడు అడవిని జయించాడు" అనేది చాలా విధాలుగా మిన్న అనటం తెలుగు అభిమానం కాదు.

ఇందులో ప్రధానమైంది అరణ్య సంబంధం అయినప్పటికీ ముసలివాడి పాత్ర పోషణ అద్భుతంగా వుంటుంది. అతని శక్తి సామర్థ్యాలు, బాధాసహిష్ణుతా మొదలైనవి చూస్తే అతడు సాధారణ మానవుడుగా తట్టడు.



సుక్కపందిని కనుక్కోటంలో, దాని ద్వారా తన శరీరమంతా విపరీతమైన గాయాలు కావటంతో, ఆ రక్తధారలతోనే ఆ వయసులో ఆ ముసలివాడు తొడలు కండలు తెగివున్న స్థితిలోనే చెట్టు ఎక్కి రాత్రంతా ఆ చెట్టు కొమ్మల మీద గడపటం వీరోచిత కృత్యాలను గమనిస్తుంటే అనిపిస్తుంది. అతడు మానవుడా అతిమానవుడా అని!

సుక్కపంది తీంట్రపొదలో ప్రసవించి పది పిల్లలను పెడుతుంది. ఆ రాత్రంతా వాటిని రక్షించే నిమిత్తం చెట్టుమీద తాను స్వయంగా నెత్తురు ముద్ద అయివుండి కూడా అతడు పడిన బాధలు వర్ణనాతీతాలు.

సుక్కపంది ఈనింది గదా అనే సంతోషంతో అతడు ఆ వెన్నెలరాత్రిలో పిల్లలు కదులుతున్న తీంట్రపొద దగ్గరకు పోయేవరకు పిల్లలు తల్లి కాండ్రుమంటూ ముసలివాడిపై పడి అతడి శరీరాన్నంతా కండలూడ బెరికిపెట్లు నుజ్జుచేసి అతడిని నెత్తురు ముద్దగా మార్చింది.

అతడు మరణాన్ని భయపెట్టేవాడే కాని మరణానికి భయపడేవాడు కాదు. కనుకనే అటువంటి భయంకరమైన గాయాలు కలిగినా కూడా మరణించక ఇంకా ఉత్సాహంతో జీవించియే ఉన్నాడు. ఆ నిబిడారణ్య మధ్యలోని చెట్టుమీద! అక్కడ తను జీవించి ఉండటం అంటే సుక్కపంది పిల్లను తినటానికి వచ్చిన గుంటనక్కల వంటి జంతువులు మరణించటమే.

మానవుడికి ఇటువంటి అసామాన్య శక్తి పుట్టుకతో వస్తుందా, లేక సాధన ద్వారా లభ్యమవుతుందా అని తేల్చడం కష్టం. ఏ ఒక్క దాని ద్వారా అది జరగదు, రెంటి ద్వారానూ జరుగుతుంది.

ఈ రచనను గురించి ఒక చిన్న సందేహం - ఏమంటే, నిరక్షరాస్యుడైన ముసలివాడి ఆలోచనలు విద్యావంతుని మాటల్లో వెల్లడవుతున్నాయని.

"అడవి నిగూఢమైనది. ఏ అనుభవానికీ, ఏ మేధస్సుకూ అంతు చిక్కని రహస్యాలు ఇక్కడ చాలా ఉన్నాయి." అనుకున్నాడు ముసలివాడు అని ఉన్నది.

పై కొటేషన్ మార్కుల మధ్య ఉన్న మాటలు రచయితవి అయి వుండవు, ముసలివాడివి అయి ఉండాలి. రచయితవి అయివుంటే కొటేషన్ మార్కులు అవసరం ఉండవు కాబట్టి అవి ముసలివాడివే.

అక్షరజ్ఞానం లేని అటవిక స్వభావి అయిన ముసలివాడికి అటువంటి మాటలు తెలుసా అని. కనుక ఈ పద్ధతి ఔచితికి భంగమేమో అని. కొటెషన్‌లు లేకుంటే ఆ చిక్కు ఉండదు.

రచయిత చెపుతున్నప్పుడు మామూలు రీతిలో చెప్పవచ్చు. సంభాషణలు వచ్చినప్పుడు ఆయా పాత్రలను బట్టి సంభాషణ శైలి మారుతుంటుంది.

పై కొటెషన్ సశబ్ద సంభాషణ కాకపోయినా, నిశ్శబ్ద సంభాషణ అవుతుంది. అటువంటప్పుడు ఆ ముసలివాడి స్వంత శైలినే ఉపయోగిస్తే బాగుండేదేమో. దీనికి రెండో వైపు ఏమంటే, ఆ మాటలు అతను ఉచ్చరించిన మాటలు కావు. అది ఆలోచన మాత్రమే కనుక ఆ మాటలు అతని మాటలుగా ఉండవలసిన అవసరంలేదు, రచయితగా ఉంటే చాలు అనేది. అటువంటప్పుడు కొటెషన్ మార్కులు ఎందుకనే ప్రశ్నలేస్తుంది. కొటేషన్ మార్కులు ముసలివాడి ఆలోచనను చూపటానికే కాని అతడి మాటల్ని చూపటానికి కాదని.

అంటే, అతడి ఆలోచనను రచయిత తన మాటల్లో పొదిగి వ్యక్తపరచటం అని ఆలోచన అతడిది కాని తనదికాదని తెలపటానికి రచయిత కొటేషన్ మార్కుల్లో అతడి ఆలోచల్ని బంధించి ఉండవచ్చు.

ఇదంతా ఊహాగానం. అసలు ఇందులో రచయిత స్వీయ అభిప్రాయం ఏమై ఉంటుందో! ఏమై ఉండకపోవచ్చు కూడ.

ఇది చాలా స్వల్ప విషయం కనుక ఏ రీతిలో ఉన్నా భీతిలేదు.

ఆ ఏకరాత్రి గాథ అర్ధరాత్రి గడిచిపోయిన తరువాత ఒక విషాద గాథగా మారింది. సుక్కపందిని రక్షించటం పోయి దాని సంతానాన్ని రక్షించటం అనేది ప్రబలం అయింది ముసలివాడి మనస్సులో.

తానెంత జాగ్రత్తగా కాపాడుతూ, పందిపిల్లల దగ్గరకొచ్చిన గుంట నక్కలను కత్తి విసిరి, బరిసె విసరి సంహరిస్తున్నా కూడా పది



పంది పిల్లల్లో రెండు పోనే పోయాయి. ఎనిమిది పిల్లల్ని రక్షించాలి. తాను చెట్టు మీద ఉండి ఏ విధంగా వాటిని రక్షించాడు? తన కత్తీ, బరిసె కూడా సుక్కపంది దగ్గరలో పడి ఉన్నాయి. తాను చెట్టు దిగి సుక్కపంది దగ్గరకు పోతే డొక్క చించేస్తుంది, ఇదివరలో చించిన దానికంటే మించి.

పంది పిల్లలను రక్షించాలంటే తాను చెట్టుదిగి పిల్లల దగ్గర ఉండాలి. తాను వాటి దగ్గరకు పోతే పంది తనను ఈ లోకం నుండి శాశ్వతంగా సాగనంపుతుంది. కాబట్టి ఆ పిల్లలను రక్షించాలంటే తల్లిని సంహరించాలి. తాను పెంచి కాపాడిన ప్రాణి ప్రాణాన్ని తానే నాశనం చేయాలి! తప్పదు మరి. ముసలివాడు దేహం నిండా ఉన్న గాయాలతో చెట్టుదిగి నిశ్శబ్దంగా తీంట్రపొద వద్దకు పోయి బడిసె తీసుకొని సుక్కపందితో పోరాడి దాన్ని సంహరిస్తాడు.

జీవితం విచిత్రమైంది. రచయిత తన రచనలో ఘటనా చక్రాన్ని వింతగా త్రిప్పుతాడు. ముసలివాడు తాను స్వయంగా పెంచుకొన్న జీవిని నిర్జీవిగా చేస్తాడు.

సుక్కపంది తన పిల్లలు బ్రతికుండేందుకు తాను సంహరించబడింది. అటువంటి దారుణ ఘడియల్లో ముసలివాడి ప్రీతి కల్లుమీదకు పోతుంది. కాని ఆ మహారణ్యంలో కల్లెక్కడ లభిస్తుంది? తన కాంక్ష ఆకాంక్ష గానే మిగిలిపోతుంది!

'కాకిపిల్ల కాకికి ముద్దు' అంటారు. నిజానికి కాకి పిల్ల కాకికి మాత్రమే కాదు ముద్దు, తల్లిలేని పందిపిల్లలు ముసలి వాడికి ఎంతో ముద్దు. ముసలివాడికే కాదు, వయసువాళ్ళక్కూడ అవి ఎంతో ముద్దుముద్దుగా ఉంటాయి. ఒక పిల్ల మీదకు మరో పిల్ల ఎక్కుతూ, గునగున పాకుతూ, అమాయకంగా బలవంతాన కళ్ళు తెరిచి చూస్తూ, నలుపూ తెలుపుల వెలుగు నీడలను ప్రదర్శిస్తూ ఎంతో అందంగా ఉంటాయి. ఆనందం కలిగిస్తాయి!

"చంద్రుడింకా మబ్బుల వెనకనే ఉన్నాడు. ముసలివాడు తలెత్తి సుంక్రేసు కొమ్మల గుండా చూస్తూ, 'సువ్వేమీ బయటికి రానక్కరలేదు. ఇక్కడ తీంట్ర పొదలో పదిచందమామలున్నాయి.

నువ్వు బయటికొస్తే ఎంత, రాకపోతే ఎంత' అనుకున్నాడు ముసలివాడు."

సందర్భ ఔచితి బాగా రక్తి కట్టింది. తనకు ప్రియమైన పంది పిల్లలను చంద్రునితో పోల్చే అవకాశం దొరికింది. ఆకాశంలో మేఘాల్లో దాగి ఉన్నది ఒక్క చందమామ మాత్రమే. కాని తీంట్రపొదలో దాగి ఉన్నాయి పది చందమామలు.

తన పందిపిల్లలు ఒక్కోటి ఒక్కో చందమామ. అంతకంటే సంతృప్తి, సంతుష్టి ఏమికావాలి ముసలివాడికి? ఆకాశంలోది చేతికందని చందమామ.

తన పది చందమామలు చేతికందే చందమామలు.

తనతో ఆడే చందమామలు, పాడే చందమామలు.

ముసలివాడు మురిసిపోతున్నాడు.

ముసలివాడు తన గుడిసెకు తిరిగి రావడంతో కథ అంతమవుతుంది.

అతడు నడవలేక నడవలేక వచ్చి మూర్తీభవించిన జడత్వం వలె గుడిసెలో పడిపోతాడు.

"తన దేహంలోని వివిధాంగాలు ఒకదాని నుండి ఒకటి విడిపోయి ఎక్కడెక్కడో నిర్జీవంగా పడి ఉన్నట్లు అతనికి అనిపిస్తుంది. కాని అతని మనసు మాత్రం చితివలో రగులుతూనే ఉంది. 'ఎంత విచిత్రం! రూపురేఖలు కలిగిన దేహం చలన రహితంగా పడి ఉండగా రూపురేఖలు లేని మనసు పచ్చిక మైదానంలో సీతాకోక చిలుకవలె ఎగురుతూ ఉన్నది' అనుకున్నాడు."

ఏమి నేర్చుకొన్నాడు మనిషి?

"అతడు అడవిని జయించాడు" లాంటి రసమయి రచనలను రచించుట నేర్చుకొన్నాడు.

చితివలె –డాక్టర్ సంజీవదేవ్, **1985**